www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక
గురువారం 10 ఏప్రిల్ 2025
సంపుటి :06 సంచిక : 309 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

## మూడ్రోజుల పాటు ఈదురుగాలులతో వర్షాలు

- వాతావరణ విభాగం ప్రకటన



8 లో..

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ కులగణన

- కులగణన తేలితేనే ఆయావర్గాలకు న్యాయం
- వారి వాటా వారికి దక్కడంలో అవకాశం
- అలాంటి ప్రయత్నాలను అడ్డుకుంటున్న బిజెపి
- రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సదస్సులో రాహుల్







**అహ్మదాబాద్,ఏప్రిల్9( వెలుతురు):** కులగణన ద్వారా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, దేశమంతా కలుగణన జరగాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అన్నారు. ఆయా వర్గాలకు వారి హక్కులు లభించాలంటే ఎవరు ఎంతమంది ఉన్నారన్న లెక్క తేలాల్సి ఉందన్నారు. ఏం సంస్థలలో దళితులు, ఆదివాసీలు, ఇతర వెనకబడిన వర్గాలకు వారి వాటా దక్కడం లేదన్నారు. ఆదానీ, అంబానీ కంపెనీల ఉద్యోగుల జాబితా తీస్తే కూడా ఇది తెలుస్తుందన్నారు. ఇకపోతే రాజ్యాంగమే కాంగ్రెస్ ఆత్మ అని, దానిని పరిరక్షించుకునేందుకు మనమంతా కలిసి పోరాడాలని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మత స్వేచ్ఛ మీద దాడి చేస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన 84వ కాంగ్రెస్ సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగం,



## ఏదో ఒకరోజు మోడీ దేశాన్ని అమ్మేస్తారు

- ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేట్ పరం అవుతున్నాయి
- ఎన్నికల సంస్థలు కూడా మోడీ గుప్పిట చిక్కుకున్నాయి
- బ్యాలెట్ పోరే దేశానికి శ్రీరామరక్ష
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో మల్లికార్జున ఖర్గే

2 లో..



## మోడి పాలనలో దేశానికి తీవ్ర నష్టం

- ఆయనను తప్పిస్తేనే దేశానికి మోక్షం
- రాహుల్ ఆదేశాలతో కులగణన చేపట్టాం
- తెలంగాణ విముక్తికి పటేల్ కారణం
- తెలంగాణ ఇచ్చిన సోనియా ధన్యురాలు
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో రేవంత్ వ్యాఖ్యలు

# భారతదేశంలో జైనానిది విడదీయలేని బంధం

- ఉగ్రవాదం లాంటి సవాళ్లకు జైనమత విలువలే సమాధానం
- మహావీర్ జయంత్యుత్సవంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్9( వెలుతురు):** భారత దేశానికి గుర్తింపు తీసుకురావడంలో.. జైన మతం వెలకట్టలేని పాత్రను పోషించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచానికి సవాళ్లుగా మారిన ఉగ్రవాదం, యుద్ధం, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలకు.. జైన మత విలువలు సమాధానం ఇవ్వగలవన్నారు. నవకర మహామంత్ర దివస్ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రాచీన మతానికి చెందిన సంప్రదాయాన్ని, వారసత్వాన్ని, ప్రబోధనలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టు-బడి ఉందని మోదీ తెలిపారు. పార్లమెంట్ బిల్డింగ్ లో జైన తీర్థంకరుల విగ్రహాలు ఉన్నట్లు- చెప్పారు. జైన

2 లో..



# రాష్ట్ర భూ కుంభకోణంలో కాంగ్రెస్- బీఆర్ఎస్ పార్టీలు

## : ఎమ్మెల్యే పాయల్ శంకర్



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో ఏప్రిల్ 9:** రాష్ట్రంలో భూ కుంభ కోణాలల్లో ఉన్నది కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలు అని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు,బుధ వారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ మాట్లాడారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిట్‌చాట్‌లో మాట్లాడుతూ, బీజేపీ - కాంగ్రెస్ కలిసి హైదరాబాద్‌లో భూకుంభకోణాలపై నిజాలు బయటపెడతానని చెప్పారు. కానీ వాస్తవానికి భూకుంభకోణాల వెనుక ఉన్నవి బీఆర్ఎస్ - కాంగ్రెస్ పార్టీలే. అని పాయల్ శంకర్ విమర్శించారు, తమపై ఉన్న అవినీతి ఆరోపణల నుంచి దృష్టి మళ్లించేందుకే కేటీఆర్ బిజెపిని బద్నాం చేసేలామాట్లాడుతున్నారు. ఎక్కడ వాళ్ల మధ్య ఉన్న అవినీతి, కుంభకోణాల వ్యవహారాల్లో సంబంధాలన్నీ బయట పడతాయేమోననే భయంతో.. ఆ ఆరోపణల నుంచి పక్కదారి

2 లో..

## పెట్రోల్ ధరలతో కేంద్రం ఆర్థిక దోపిడీ

- సెస్సు వసూళ్లతో సొంత రాజకీయ ప్రచారాలు
- సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న మోడీ
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి
- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి కెటిఆర్ లేఖ



2 లో..

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అటకెక్కించారు

- ఒక్క హామీ అమలు చేయలేక చతికిల పడ్డారు
- కెసిఆర్‌ది సాగుభాష ..రేవంత్‌ది చావు భాష
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



**సంగారెడ్డి,ఏప్రిల్9( వెలుతురు):** కేసీఆర్‌ది సాగు భాష అయితే.. రేవంత్ రెడ్డిది చావు భాష అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డివి మాటలు తప్ప చేతలు లేవన్నది ప్రజలకు అర్థమయి పోయిందన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అయినా

2 లో..

# సీఎంగారూ... పగటి కలలు మానుకోండి

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 09:** బ్రిటీషర్ల కంటే బీజేపీ ప్రమాదకరమంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. జాతీయవాద సిద్ధాంతాలు, నిలువెల్లా దేశభక్తిని పుణికిపుచ్చుకున్న పార్టీ భారతీయ జనతా పార్టీని దేశాన్ని దోచుకున్న బ్రిటీషర్లతో పోల్చడం సిగ్గు చేటు. అవకాశవాద రాజకీయాలకు, అవినీతి పాలనకు నిలువెత్తు రూపం కాంగ్రెస్ పార్టీ. కరోనా కంటే ప్రమాదకరమైన పార్టీ కాంగ్రెస్. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి రానివ్వకుండా అడ్డుకుంటామంటూ రేవంత్ రెడ్డి గారు పగటి కలలు కంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అంతరంచిపోతున్న జాతిలాంటిది. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో ఎంతటి ప్రజా వ్యతిరేకతను



మూటగట్టుకుందో 15 నెలల కాంగ్రెస్ పాలనలో అంతకు రెట్టింపు వ్యతిరేకతను మూటగట్టుకున్న విషయాన్ని రేవంత్ రెడ్డి గారు మర్చిపోయారా? తన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్‌ను గెలిపించలేకపోయారు. సిట్టింగ్ సీటైన

2 లో..

- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా
- ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం
- కాంగ్రెస్ కు అభ్యర్థులే కరువయ్యారు
- అంతరించి పోతున్న పార్టీ కాంగ్రెస్
- హైదరాబాద్ ను మజ్లిస్ చేతిలో పెట్టేందుకు సిద్ధమైంది
- దేశభక్తి పార్టీని బ్రిటీషర్లతో పోలుస్తావా?
- కరోనా కంటే ప్రమాదకరమైన పార్టీ కాంగ్రెస్
- మిగిలిన రెండు రాష్ట్రాల్లోనైనా కాంగ్రెస్ ను కాపాడుకుంటే బెటర్
- బండి సంజయ్ కుమార్ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి

# కోలుకుంటున్న మార్క్ శంకర్



- మరో మూడు రోజులు ఆస్పత్రిలోనే చికిత్స
- కొడుకు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో పవన్ సంప్రదింపులు
- మార్క్ ఫోటోను విడుదల చేసిన కుటుంబ సభ్యులు

**అమరావతి,ఏప్రిల్9( వెలుతురు):** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. సింగపూర్‌లోని స్కూల్లో చోటు-చేసుకున్న అగ్నిప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడ్డ సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో చిన్నారి మార్క్ కాళ్లు, చేతులకు గాయాలు కాగా, ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది.

2 లో..

## మంచు కుటుంబంలో ముదురుతున్న వివాదం

- జల్‌పల్లి నివాసం ముందు మనోజ్ బైఠాయింపు
- ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా పోలీసుల మొహరింపు
- ఆస్తి పంచాయితీ కాదంటున్న మంచు మనోజ్

8 లో..

**హైదరాబాద్,ఏప్రిల్9( వెలుతురు):** నటుడు మోహన్‌బాబు కుటుంబం మరోమారు రోడ్డున పడింది. సొంత గొడవలతో పోలీస్ స్టేషన్ ఎక్కిన తనయులు తాజాగా మరో వివాదంతో ముందుకు వచ్చారు. ఇలా తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. తన కారు పోయిందని






# ఆదాయ మార్గాలపై దృష్టి సారించండి


- పన్నుల వసూళ్లు పెరిగేలా చూడండి
- ఎఐ సాయంతో ఎగవేతదాదరులను గుర్తించండి
- అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి,ఏప్రిల్9( వెలుతురు):** రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా సొంతంగా ఆదాయ మార్గాలు పెంచుకోవలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.. పన్నుల వసూళ్లు పెరిగేలా ఆదాయార్జన శాఖలన్నీ పనిచేయాలని అధికారులను ఆదేశించారు. మరిన్ని ఆదాయ మార్గాలను వెతకడంతో పాటు, ఎక్కడ ఆదాయం తక్కువుగా నమోదవుతుందో దానికి గల కారణాలను వెతికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పన్నుల చెల్లింపుల దగ్గర నుంచి రశీదులు, నోటీసులు జారీ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగాలని చెప్పారు. సచివాలయంలో ఆదాయార్జన శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ శాఖ ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా బిల్డర్లు అసలు రిజిస్టర్ కాలేదని ఏఐ గుర్తించింది. అయితే, తప్పనిసరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ప్రభుత్వం ఎటువంటి ఆమోదాలైనా తెలపాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు..





8 లో..





# కీలక వడ్డీరేట్లను సవరించిన ఆర్‌బిఐ

- వరుసగా రెండోసారి రెపోరేటు 0.25 శాతం మేర తగ్గింపు
- తగ్గనున్న గృహ, వాహన రుణాల వడ్డీల భారం
- ద్రవ్యపరపతి కమిటీ నిర్ణయాలు ప్రకటించిన గవర్నర్ మల్హోత్రా
- బంగారం రుణాలపై ఆంక్షలు విధించే యోచనలో ఆర్‌బిఐ

**ముంబై,ఏప్రిల్9( వెలుతురు):** విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను ఆర్‌బీఐ మళ్లీ సవరించింది. వరుసగా రెండోసారి రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. దీంతో రెపో రేటు 6.25

8 లో..

## భారతదేశంలో జైనానిది విడదీయలేని బంధం

మతంలో ఉన్న అనేకాంతవాదం గురించి ఆయన ప్రస్తావించారు. నిజం అనేది అనేక రూపాల్లో వ్యక్తం అవుతుందన్నారు. జైన మతంలో ఒకరిపై ఒకరు ఆధారపడుతారన్న వాస్తవాన్ని గుర్తింపు ఉందని, అందుకే వాళ్లు స్వల్ప స్థాయిలో కూడా హింసను ఆమోదించరన్నారు. శాంతి, సామర్యం, పర్యావరణ పరిరక్షణలో ఇదే కీలకం అన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి జైన సాహిత్యం వెన్నుముకగా నిలుస్తుందన్నారు.

## రాష్ట్ర భూ కుంభకోణంలో కాంగ్రెస్- బీఆర్ఎస్ పార్టీలు

పట్టించేందుకే కేటీఆర్ మాట్లాడారనీ ఎమ్మెల్యే పాయల్ ఆరోపించారు గతంలో పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ఆగ్రహంగా మాట్లాడారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఆ డబ్బు రికవరీ చేస్తామని కూడా చెప్పారు. కానీ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జరిగిన అవినీతి, స్కాంల విషయంలో ఏ కేసు రిజిస్టర్ కాలేదు. ఏ నాయకుడు అరెస్ట్ కాలేదనీ ఆయన చెప్పారు, బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంతో మిలాఖత్ అయి..గతంలో జరిగిన అవినీతి బయటపడకుండా రాజకీయాలు చేస్తోందన్నారు, ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు, రైతుల భూములను తమ పేర్లకు మార్చుకున్నారని రేవంత్ రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవినీతి బయటపెడతామని చెప్పినా... ఒక్క ఎకరం కూడా తిరిగి ఇవ్వలేదనీ పాయల్ శంకర్ ఆరోపించారు, ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ అదే పరిస్థితి. ఐపీఎస్ అధికారుల ద్వారా రాజకీయ నాయకులు, బిజినెస్ మేనేజర్లు, మీడియా ప్రతినిధుల ఫోన్‌లు ట్యాప్ చేయించారని అప్పట్లో కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేశారు. ఆ కేసును ముమ్మందు విచారణకు లాగుతామని, తడాఖా చూస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఆ అవినీతిని తవ్వింది లేదు. కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయాలు చేస్తూ బిజెపి పై బురదజల్లే ప్రయత్నంచేస్తున్నాయనీ ఆయనవిమర్శించారు, హెచ్‌సీయూ భూముల విషయంలోనూ ఇదే కుతంత్రం. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు విలువైన భూములను అమ్ముతున్నాయి. భారతీయ జనతా పార్టీ బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై గళమెత్తింది. రాష్ట్ర ప్రజల ఆస్తులను తాకట్టుపెట్టి రాష్ట్రాన్ని అంధకారంలో నెడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పుడు విధానాలను ఎండగట్టింది. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో భూముల అమ్మకాలపై కూడా పోరాటం చేస్తోంది. హెచ్ సీయూ భూములను ఈరోజు కాపాడగలిగామంటే.. అది విద్యార్థులు, మేధావులు, తెలంగాణ ప్రజల అండతోనే. కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీకి వ్యతిరేకంగా బిజెపి నిక్కచ్చిగా పోరాటం చేస్తున్నది. నయీం కేసులో వేల కోట్ల ఆస్తులు దొరికాయని, ఆ పత్రాలన్నీ బహిర్గతం చేయాలని కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. కానీ ప్రజలకు సరైన సమాచారం ఇవ్వడం లేదు. వేల కోట్ల రూపాయలు ఎలా చేతులు మారాయి..? డాక్యుమెంట్లు ఎవరి చేతుల మీదుగా బదిలీ అయ్యాయో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు, బీఆర్ఎస్ – కాంగ్రెస్ కలిసి అవినీతిని దాచేందుకు ప్రయత్నిస్తున్నాయి. అదే సమయంలో బీజేపీని బద్నాం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ వంటి వారు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నవారే. ఇప్పుడు వారిని రక్షించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. కాని అనేక విషయాల్లో కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీలు ఒకరికొకరు సహకరించుకుంటూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని బయటకు తీయొద్దని, అందుకు కావాల్సిన సహకారం అందిస్తామని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు ఒక్కటయ్యారు. దానికి తోడు బిజెపి ని బద్నాం చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంఐఎంను గెలిపించేందుకు కాంగ్రెస్ – మజ్లిస్ చేతులు కలిపాయి. భారతీయ జనతా పార్టీపై ఆరోపణలు చేస్తున్న కేటీఆర్‌కు ధైర్యం ఉంటే ఆ వివరాలు బయటపెట్టాలి. లేకపోతే పరువునష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుంది. బిజెపి నాయకులు ప్రజాసేవలో నిక్కచ్చిగా ఉంటారు. బీఆర్ఎస్ లాంటి లాలూచీ రాజకీయాలకు దూరంగా ఉంటారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి, అటు ఢిల్లీ కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా సహకారం అందిస్తూ లాలూచీ రాజకీయాలు చేస్తున్నది. రాహుల్ గాంధీని, సోనియా గాంధీని మెప్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి బిజెపిని విమర్శిస్తున్నడు. తెలంగాణలో బిజెపి ని అడుగుపెట్టనివ్వమని రేవంత్ విమర్శించిండు. ఆల్రెడీ 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు, మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలను బిజెపి గెలిచింది. ప్రజలు బిజెపి వైపు ఉన్నారు. నరేంద్ర మోదీ గారు నాయకత్వాన్ని సమర్థిస్తున్నారు. తెలంగాణ ప్రజలు బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆలోచిస్తున్నరు. కాంగ్రెస్ కు ఇచ్చిన 60 నెలల సమయంలో 15 నెలల పాలన పూర్తయింది. ప్రజలకు మేలు చేయాలని భావించాలి. కాని బిజెపి ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తే అది మీ మూర?త్వమే. తెలంగాణలో రానున్న రోజుల్లో బిజెపి అధికారంలోకి వస్తుందని అనేక సర్వేలు చెబుతున్నాయనీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు,

## పెట్రోల ధరలతో కేంద్రం ఆర్థిక దోపిడీ

**హైదరాబాద్,ఏప్రిల్9( వెలుతురు):**



పెట్రోల్ రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక దోపిడికి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వసూలైన సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా తమ సొంత రాజకీయ అజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడు తుందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తుందన్నారు. ఆకాశాన్నంటుతున్న పెట్రో ధరలపై కేంద్ర పెట్రోలియం,సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి బహిరంగ లేఖ రాసిన కేటీఆర్, ఇంధన ధరల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దేశాల్లో ఒకటిగా మనదేశం నిలిచిందని విమర్శించారు. భూటాన్, పాకిస్తాన్, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డిజిల్, ఎల్‌పీజీ ధరలు భారత్‌లో కంటే చౌకగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 1,100 దాటడం పేద, మధ్యతరగతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందన్నారు కేటీ–ఆర్. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఒక క్రూరమైన జోక్‌గా మారిందన్నారు. ఒకప్పుడు ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారని చెప్పారు. గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడు కూడా ఇప్పటితో పోలిస్తే దేశంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం పెంచడం దేనికి సంకేతమని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులతో పాటు బిజెపి నేతలు అంతా గతంలో పెట్రో ధరలు తగ్గించమని ఆందోళన కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో ప్రస్తావించారు. కేంద్రం పెంచుతున్న పెట్రోల్ గ్యాస్ ధరల వలన పేద ప్రజల జేబులు ఖాళీ అవుతుండగా ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు చేరుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్లు–పండగ అయిపోగానే పెంచడం ప్రజల్ని వంచించడమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నన్స్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం 'మాక్సిమం టాక్సేషన్, మినిమం రిలీఫ్'గా మారిందని విమర్శించారు. మోడీ చెప్పిన 'అచ్చే దిన్' అంటే ఈఎంఐలు కట్టలేక, ఇంధన బిల్లుల భారం భరించలేక మిడిల్ క్లాస్ సతమతమవడం, సిలిండర్ తెచ్చుకోవాలా? సరుకులు కొనుక్కోవాలా? అన్న మీమాంసలో పేదలు ఉండిపోవడం, రాష్ట్రాలు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోవడమేనా అని కేటీఆర్ పశ్నించారు. దేశంలోని కోట్లాది ప్రజల తరపున రాసిన ఈ లేఖలో, ప్రజల తరపున కొన్ని డిమాండ్లను కేంద్రమంత్రి ముందు కేటీఆర్ ఉంచారు. ఇంధన ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, కేంద్ర ఎక్సైజ్ సుంకాలను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాలకు ఇవ్వని సెస్‌లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ క్రూడ్ ధరలకు అనుగుణంగా పారదర్శక ధరల విధానం అమలు చేయాలన్నారు. ఇంధన పన్నులు, సెస్ వినియోగం, ఆదాయ వాటా వివరాలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆర్థిక కేంద్రీకరణ విధానాలను విడనాడి, నిజమైన సహకార ఫెడరలిజాన్ని పునరుద్ధరించాలని సూచించారు. దేశ ప్రజలు పెట్టు–కున్న నమ్మకాన్ని నిలబెట్టు–కోవాల్సిన సమయం కేందప్రభుత్వానికి వచ్చిందన్నారు కేటీ–ఆర్. ఆకట్టుకునే నినాదాల వెనుక దాక్కోవడం మాని, అసలైన పని చేయాలని కేటీ–ఆర్ ఊచించారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ కులగణన

మన ఐడియాలజీ అని, దానిని మనమే కాపాడుకోవాలన్నారు. కాంగ్రెస్ ఐడియాలజీ రాజ్యాంగమని.. అందుకే బీజేపీ ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు మన రాజ్యాంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఇది తన బాధ్యత అన్నారు. బీజేపీ తమ వ్యవస్థ మీద దాడి చేస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణాలో కులగణ అంశంపై స్పందించారు. కులగణనపై మంచి స్పందన వచ్చిందన్నారు. మైనార్టీలు, ఆదివాసులు, గిరిజనుల కోసం కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. జాతీయ జన గణన చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. తెలంగాణలో కుల గణనపై రేవంత్ రెడ్డి నాకు వివరించారు. తెలంగాణలో ఓసీలు, బీసీలు మైనార్టీలు ఎంత అనేది తేలింది. తెలంగాణ లో విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నాం. దేశానికే ఆదర్శంగా నిలిచాం. రాష్ట్రంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసులకు సరైన ప్రాతినిధ్యం లేదని స్పష్టమైంది. బీసీల రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిల్లు కేంద్రానికి పంపారు. రేవంత్‌రెడ్డి పంపిన బిల్లుపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణలో కులగణనను విజయవంతంగా నిర్వహించారు. కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కులగణన వల్ల దేశంలో బీసీల సంఖ్య ఎంతో తెలుస్తుంది. కులగణన విషయంలో తెలంగాణ దేశానికి మార్గం చూపింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అంశాన్ని తొలగిస్తాం. తెలంగాణలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారు. తెలంగాణ సంపదలో మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన భాగస్వామ్యం లేదు. వారి జనాభాకు అనుగుణంగా సంపదలోనూ తగిన వాటా అవసరం' అని రాహుల్ గాంధీ అన్నారు. దేశ జనాభాలోని 90 శాతం మంది జనాభాకు సరైన ప్రాతినిధ్యం లేదు. 90 శాతం మంది జనాభా అవకాశాలను లాగేసుకున్నారు. మీరందరూ లేకుండానే భారత్ జోడో యాత్ర రాహుల్ గాంధీ చేయగలడా? అని ప్రశ్నించారు. మహాత్మ గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, అంబేద్కర్, గురునానక్, కబీర్ ఆలోచనల రూపం భారత రాజ్యాంగం అని రాహుల్ గాంధీ అన్నారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల నాటి పుస్తకంగా భావించరాదని.. వేలాది సంవత్సరాలుగా భారత దేశ ప్రజల ఆలోచన విధానమే భారత రాజ్యాంగం అని స్పష్టం చేశారు. రాజస్థాన్ లో సీఎల్పీ నేత దళితుడని.. గుడిలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారన్నారు. ఆయన గుడికి వెళ్లిన పాపానికి గుడిని శుద్రం చేశారని అన్నారు. ఇది బిజెపి ఆలోచనా విధానామని, కానీ తమ కార్యకర్తలు దళితులు, ఆదివాసులు అందరికీ గౌరవం ఇస్తారని చెప్పారు. దేశ సమస్యలు తీర్చాలంటే.. దేశాన్ని ఎక్సరే తీయాలని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. దళితులు, ఆదివాసీల సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. దళితులు, ఆదివాసీలకు న్యాయం జరుగుతోందా అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. వారి సమస్యలను పరిష్కరించేం దుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ విమర్శించారు. చనిపోయాక నా గురించి ప్రజలు ఏం ఆలోచిస్తారనేది అనవసరం. నేను అనుకున్న పనులు పూర్తి చేశాక ప్రజలు మరిచిపోయినా నాకు అభ్యంతరం లేదు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోదీ ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నారు. ఇద్దరు వ్యాపారవేత్తలకే వాటిని అప్పగిస్తున్నారు. ఎయిర్‌పోర్టులు, గనులు, సిమెంట్, స్టీల్ సహా కీలక పరిశ్రమలన్నీ ఓ పారిశ్రామికవేత్తకే కట్టబెడుతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపా అక్రమాల ద్వారా గెలిచింది. అక్కడ ఓటరు జాబితా కోరితే ఇంతవరకు ఇవ్వలేదన్నారు.

ఆర్ఎస్ఎస్, భాజపా రోజూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. దేశంలో కులగణన చేపట్టాలని ప్రధాని మోదీని కోరాం. దీనికి ప్రధాని సహా ఆర్ఎస్ఎస్ తిరస్కరించింది. లౌకిక భావనకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకం అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఇకపోతే మోడీకి అత్యంత సన్నిహితుడైన ట్రంప్ టారిఫ్‌లతో ఆర్థిక ఉత్పాతం దూసుకు వస్తోందని హెచ్చరించారు. బంగ్లా తాత్కాలిక సారథితో సమావేశంలోనూ మోడీ నోరు మెదపలేదని అన్నారు. ఎప్పుడూ తనగురించి గొప్ప చెప్పుకునే మోడీ తన దారేందో చెప్పరని, కానీ ఇందిరా ఓ సమయంలో తనది భారత్ దారని గర్వంగా చెప్పారని గుర్తు చేశారు. ఈ వేదికపై సోనియా, అంబికా సోనీ, ఖర్గే, కెసి వేణుగోపాలు, సిఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

### ఏదో ఒకరోజు మోడీ దేశాన్ని అమ్మేస్తారు

ప్రధాని మోడీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్ అహ్మదాబాద్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ– (ఏఐసిసి) సమావేశాలు జరుగుతున్నాయి. అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం నెలకొల్పబడుతోంది. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ దెబ్బతింది. వారు బలహీన వర్గాల వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదు. వారు ప్రభుత్వరంగాన్ని ఒక్కొక్కటిగా అమ్మేస్తూ.. తమ స్నేహితులకు సహాయం చేస్తున్నారు. ఇదే కొనసాగితే.. మోడీ ఏదో ఒకరోజు ఈ దేశాన్ని అమ్మేస్తారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించిన ప్రభుత్వ రంగ కర్మాగారాలను నాశనం చేస్తున్నారు. మీరు, నేను దేశం కోసం ఏం చేస్తున్నాం? భవిష్యత్ తరాలకు మనం ఏమి ఇవ్వాలనుకుంటున్నాము? కాంగ్రెస్‌ను దుర్భాలాషలాడడం తప్ప మోడీ దగ్గర వేరే సమాధానాలు లేవు అని ఆయన అన్నారు. నేడు ఎన్నికల సంస్థలు కూడా వారి నియంత్రణలోకే వెళ్లాయి. ప్రభుత్వం ప్రతిదానిలో జోక్యం చేసుకుంటూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో.. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఇవిఎంలను వదిలి బ్యాలెట్‌పేపర్స్ వైపు మళ్లాయి. ప్రపంచంలో ఇవిఎంలు ఎక్కడా అందుబాటులో లేవు. దేశంలో 140 కోట్ల మంది ప్రజాస్వామ్యాన్ని నమ్ముతారు. ఇప్పుడో లేక తరువాతో.. ఈ దేశ యువత మనకు ఇవిఎంలు వద్దు.. బ్యాలెట్ పేపర్లు కావాలని నినదిస్తారు అని ఖర్గే అన్నారు.భారత్‌పై అమెరికా 26 శాతం పన్నులను విధించింది. ఈ విషయంపై పార్లమెంటు చర్చించనీయలేదు. ఈ విషయంపై మేము చర్చించాలని పట్టుబట్టాము. కానీ వారు చర్చకు అనుమతించలేదు. ముఖ్యమైన ప్రజా సమస్యలను చర్చించడానికి బదులుగా.. ప్రభుత్వం పార్లమెంటు–లో మత విభజన గురించి చర్చించింది. దీనికోసం తెల్లవారుజామున 3–4 గంటల వరకు చర్చలు నిర్వహించింది. మణిపూర్ వంటి అంశాలపై ఉదయం 4.40 గంటలకు ప్రారంభమైంది. ఆరోజు మణిపూర్ అంశంపై మేము తరువాతరోజు మాట్లాడతామని అమిత్‌షాకు చెప్పాము. దీంతో ఈ విషయంపై మమ్మల్ని చర్చకే అనుమతించలేదు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ నేతలు ఇలాంటివి చేస్తున్నారు అని ఖర్గే విమర్శించారు. ఈ ప్రభుత్వానికి యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఉద్దేశం లేదు. దేశంలో అన్నింటా ప్రభుత్వ ఆధిపత్యమే కొనసాగుతున్నదని, కేంద్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్నదని, అందుకే ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

### మోడిపాలనలో దేశానికి తీవ్ర నష్టం


ప్రధాని మోదీ మతాల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని విభజించాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. మోడీని తప్పిస్తే తప్ప దేశానికి విముక్తి లేదని అన్నారు. గాంధీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ గాడ్సే సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తున్నారని రేవంత్ విమర్శించారు. దేశ యువత ఏకం కావాల్సిన సమయమొచ్చిందన్నారు. యువతకు గాంధీ బాటలో నడుస్తూ.. మోదీ, గాడ్సేలను ఓడించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అంటే ప్రధాని మోదీకి భయం..మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాడనే లోక్‌సభలో రాహుల్ గాంధీకి మైక్ ఇవ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వంలో మోదీకి, అమిత్ షాకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. నెహ్రూ నేతృత్వంలో పటేల్ నిజాం నుంచి తెలంగాణకు విముక్తి కలిగించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది సోనియాగాంధీ.. దేశాన్ని విభజించడమే మోదీ లక్ష్యం అందుకే తెలంగాణలో బీజేపీని, మోదీని అడుగు పెట్టనివ్వం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గాంధీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్ళింది.దేశ యువత ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన –టైం వచ్చిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. దేశంలో కుల గణన చేపట్టిన తొలి రాష్ట్రం తెలంగాణే అని గర్వంగా తెలిపారు. రాష్ట్రంలోని కుల గణనను తాము విజయవంతంగా పూర్తి చేశామని, అదే తరహాలో దేశవ్యాప్తంగా కూడా జనాభా గణనతో పాటు కుల గణన జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం 21 వేల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేశామని వెల్లడించారు. రైతులపై భారం తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపాలనలో దేశానికి అభివృద్ధి కన్నా మోసం ఎక్కువగా జరిగిందని ఆరోపించారు. రాహుల్ గాంధీతో కలిసి గాంధీ పరివారమంతా పనిచేయాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, నైతికత కోసం పోరాడే నాయకుడిగా రాహుల్ గాంధీని ఆదరించాలని కోరారు. కాగా మోదీ పరివారాన్ని గాడ్సే పరివారంగా అభివర్ణించి తీవ్ర విమర్శలు చేశారు. బ్రిటిష్ వాళ్లు ఎలా దేశ సంపదను లూటీ చేశారో, అదే బాటలో బీజేపీ నాయకులు కూడా నడుస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజల ఆస్తులు ప్రైవేటు కార్పొరేట్‌లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. వచ్చే రోజుల్లో దేశం మీద విపరీతంగా పెరుగుతున్న బీజేపీ చెరను తొలగించాలన్న బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ అడుగుపెట్టనివ్వకపోవడం తమ గెలుపు సూచిక అని పేర్కొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అటకెక్కించారు

నెరవేర్చారా అని ప్రశ్నించారు. పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి ఆదర్శ్ రెడ్డి పాదయాత్ర అనంతరం బుధవారం సిద్ధి వినాయక దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ రోజు రాష్ట్రమంతా కూడా కేసీఆర్ వైపు చూస్తున్నది. ఏడాది పాలనలో ప్రజలకు పాలేవో,నీళ్ళేవో అర్థం అయిపోయింది. నో ఎల్ఆర్ఎస్ అని అన్నారు కానీ ఇప్పుడు ఎల్ఆర్ఎస్ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. మేము వస్తే ఫార్మాసిటీ భూములన్ని రైతులకు వాపసిస్తామని అన్నారు. ఇప్పుడేమో 16 వేల ఎకరాలు ఫార్మా సిటీ కోసం స్వీకరిస్తామని ప్రకటించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్‌ది సాగు భాష అయితే రేవంత్ రెడ్డిది చావు భాష. కేసీఆర్ ఎప్పుడు మాట్లాడిన మిషన్ కాకతీయ కింద చెరువులు బాగు చేయాలి అనేది. ప్రాజెక్టుల నిర్మాణం చేసి రైతులకు నీళ్లు అందించాలని చెప్పేది. రేవంత్ రెడ్డి మాట్లాడితే పేగులు మెడలో వేసుకుంటా, తొక్కుతా చంపుతా తొడలదర కొడతా ఇలాంటి భాష రేవంత్ రెడ్డిది. ఢిల్లీలో కూడా రేవంత్ రెడ్డి పని అయిపోయింది. ఢిల్లీలో బిసి సభకు రాహుల్ గాంధీని తీసుకొని వస్తా పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేస్తానని అన్నాడు. వీళ్ళ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ఢిల్లీలో ఉండి కూడా ధర్నాకు రాలేదు. రాహుల్ గాంధీ, సోనియాగాంధీ మరుసటి రోజు రేవంత్ రెడ్డి లేకుండా పిసిసి అధ్యక్షులతో ఉపముఖ్యమంత్రితో ఫోటోలు దిగారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మొన్న ఒక స్టేట్‌మెంట్ ఇచ్చాడు. హెచ్‌సీయూ విద్యార్థుల మీద పెట్టిన కేసులు ఎత్తేస్తున్నామని ప్రకటించారు. ఈ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి ఆదేశించిందట ఉపముఖ్యమంత్రి కేసులు ఉపసంహరించుకుంటారంట. ముఖ్యమంత్రి హోంమంత్రి రేవంత్ రెడ్డి కేసులు పెడితే ఉపముఖ్యమంత్రి కేసులు ఉపసంహరించు కుంటాడు అంట. ఇదేమి రాజ్యం. తోక కుక్క నాడిస్తున్నదా కుక్క తోక నాడిస్తున్నదా అర్థం కావడం లేదు. రేవంత్ రెడ్డి పెట్టింది తప్పుడు కేసులని ఉపముఖ్యమంత్రి బట్టి భట్టి విక్రమార్క చెప్పినట్టే కదా..? హెచ్‌సీయూ విద్యార్థులపై అక్రమంగా కేసులు పెట్టారని విడుదల చేసినట్టే కదా..? అక్రమ కేసులో పెట్టినందుకు రాష్ట్ర హోం మంత్రిగా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి హెచ్‌సీయూ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేసీఆర్ ఈ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలబెడితే.. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను పడగొట్టిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్ర జీఎస్టీ ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం 12 శాతం జీఎస్టీ వృద్ధిరేటు ఉండేది. దేశ జీఎస్టీ కంటే సగానికి తెలంగాణ జిఎస్టి వృద్ధిరేటు– పడిపోయింది. దేశం 10 శాతం జీఎస్టీ వృద్ధిరేటు సాధిస్తే తెలంగాణ కేవలం 5 శాతం మాత్రమే వృద్ధిరేటు– సాధించింది. కేసీఆర్ ఉన్నప్పుడు దేశ జిఎస్టి వృద్ధి రేటు కంటే ఎప్పుడూ ఎక్కువగానే ఉన్నాం తప్ప తక్కువగా లేం అని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్ చెట్లు–పెడితే రేవంత్ రెడ్డి వాటిని నరుకుతున్నాడు. మొన్న అగ్రికల్చర్ యూనివర్సిటీలో 100 ఎకరాల భూమి తీసుకొని అక్కడ చెట్లని నరికేసిండు. నిన్న హెచ్ సీయు భూముల్లో 400 ఎకరాల అడవుల్లోనూ నరికి మూగజీవుల పాపం కట్టుకున్నాడు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూలగొట్టాడు రేవంత్ రెడ్డి. ఒక చిన్న పిల్ల వాళ్ళ నాన్న కొనిచ్చిన వాటర్ బాటిల్ తీసుకొని వస్తాను అన్నా వినకుండా ఇల్లును కూలగొట్టారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. జీవో 58,59 కింద ఇదే పటాన్‌చెరు నియోజకవర్గంలో వేల మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశాం. ఈరోజు రేవంత్ రెడ్డి వచ్చాక 58, 59 జీవో బంద్ పెట్టిండు. పైసలు కట్టినోళ్లకు కూడా పట్టాలు ఇవ్వడం లేదు. రైతుబంధు ఎగ్గొట్టిండు. రుణమాఫీ కూడా కాలేదు, రైతుబంధు రాలే, 4000 పెన్షన్ రాలే, అక్కచెల్లెళ్లకు మహాలక్ష్మి పెన్షన్ రాలే. కేసీఆర్ ఎన్నికల హామీ ఇవ్వకపోయినా 13 లక్షల పేదింటి ఆడపిల్లల కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించారు. ఇప్పుడు పెళ్లయి పిల్లలు పుట్టినా కల్యాణ లక్ష్మి చెక్కు లేదు తులం బంగారం పూసే లేదు అని హరీశ్‌రావు విమర్శించారు.

# కోలుకుంటున్న మార్క్ శంకర్

ప్రస్తుతం అతడు సింగపూర్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అప్పటికప్పుడు సింగపూర్‌కి బయలుదేరి వెళ్లగా.. పవన్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ కూడా మార్క్‌ని చూడడానికి వెళ్లారు. అయితే తాజాగా మార్క్ శంకర్ ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు ఫొటోను కుటుంబసభ్యులు విడుదల చేశారు. ఈ ఫొటోలో మార్క్ విజయానికి సంకేతం చూపిస్తున్నట్లుగా పోజ్ ఇచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరోవైపు మార్క్ పూర్తిగా కోలుకోవడానికి మూడు రోజులు పట్టనున్నట్లు సమాచారం. గత రాత్రి హైదరాబాద్ నుంచి సింగపూర్‌కు పవన్ కళ్యాణ్ సహా చిరంజీవి దంపతులు వెళ్లారు. పవన్ కళ్యాణ్ నేరుగా ఆసుపత్రికి చేరుకొని మార్క్‌ను కలిశారు. చేతులు, కాళ్లకు కాలిన గాయాలు కావడంతో పాటు, ఊపిరితిత్తులకు పొగ చేరడంతో అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ వైద్యులు, అధికారులతో పవన్ కళ్యాణ్ ఇప్పటికే మాట్లాడారు. మార్క్ కోలుకుంటున్నాడని, ఊపిరితిత్తుల దగ్గర పొగ చేరడంతో ఆ కారణంగా తలెత్తే ఆరోగ్యపరమైన ఇబ్బందుల గురించి పరీక్షలు చేస్తున్నామని వారు పవన్ దృష్టికి తీసుకొచ్చారు. మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలోనే మార్క్‌కు పరీక్షలు చేయాల్సి ఉంటుందని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. అయితే, తాజాగా మార్క్ శంకర్‌కు సంబంధించిన ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ ఫోటోలో మార్క్ కాళ్లకు గానీ, చేతులకు గానీ ఇబ్బంది పెట్టే అంత గాయాలు అయితే కనిపించడం లేదు. మోచేతి దగ్గర ఒక కట్టుతో పాటు, ముఖానికి ఆక్సిజన్ సిలిండర్‌తో మార్క్ కనిపిస్తున్నాడు. రెండు చేతులతో థమ్సప్ చూపిస్తూ, తాను బాగానే ఉన్నానని చెప్పే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోంది.



### సీఎంగారూ... పగటి కలలు మానుకోండి

మల్కాజ్‌గిరి స్థానాన్ని కూడా నిలబెట్టుకోలేకపోయారు. అక్కడా కూడా బీజేపీ గెలిచింది. స్వయంగా పోటీ చేసిన కామారెడ్డిలో బీజేపీ చేతిలో ఓడిపోయి మూడో స్థానానికి పడిపోయారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓడిపోయారు. ఎంపీ ఎన్నికల ఫలితాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే 50 శాతానికిపైగా ప్రాతినిధ్యం బీజేపీ కలిగి ఉందనే విషయాన్ని విస్మరించొద్దు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోటీ చేసే అభ్యర్థులే కరవయ్యారు. దిక్కులేక హైదరాబాద్ ను మజ్లిస్ చేతిలో పెట్టేందుకు సిద్ధమైన మీరు బీజేపీ కంచుకోటైన గుజరాత్ కు వెళ్లి తెలంగాణలో బీజేపీని అడ్డుకునే శక్తి ఉందనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్. కాంగ్రెస్ కు అంటిన బురదను తుడుచుకోలేని వారు దేశం మొత్తాన్ని క్లీన్ చేస్తాననడం హాస్యాస్పదం. రిజర్వేషన్ల ముసుగులో మత విద్వేషాలు రెచ్చగొట్టేది, మత రాజకీయాలు చేసేది కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలేనన్న సంగతి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు. మీరెన్ని డ్రామాలాడినా తెలంగాణలో అధికారం రావడం పక్కా. మిగిలిన కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోనైనా అధికారం కోల్పోకుండా చూసుకుంటే బెటర్.

# ఆ పంచాయతీల పురోగతి భేష్....

- నాటి సర్పంచులు, అధికారులకు కంగ్రాట్స్...
- కష్టపడి పనిచేసిన సర్పంచులపట్ల పాలకుల వివక్ష
- పెండింగ్ బిల్లులు చెల్లించకుండా వేధిస్తారా?
- తక్షణమే బిల్లులు చెల్లించండి
- లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదు
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 09:**
సుస్థిర అభివృద్ధి సాధనలో భాగంగా "గ్రామ పంచాయతీ పురోగతి"లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 6 గ్రామాలు ర్యాంకులు సాధించడం హర్షణీయం. తెలంగాణలో 25 గ్రామ పంచాయతీలు ర్యాంకులు సాధిస్తే వాటిలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని తిమ్మాపూర్, బండపల్లి(చందుర్తి మండలం), గంద్రపల్లి (జమ్మికుంట మండలం), బల్వంతపూర్ (మల్యాల మండలం), రుద్రంగి, ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీలు మెరుగైన ర్యాంకులు సాధించడం సంతోషదాయకం. ఆయా పంచాయతీల అభివృద్ధిలో కీలకంగా పనిచేసిన నాటి సర్పంచులు, అధికారులకు నా అభినందనలు. ఇతర పంచాయతీలు కూడా సుస్థిర అభివృద్ధి సాధన కోసం క్రుషి చేయాలని కోరుతున్నా. అదే సమయంలో పంచాయతీల అభివృద్ధి, ప్రజలక మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అహర్నిశలు కష్టపడిన మాజీ సర్పంచులపట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు తీవ్రమైన నిర్లక్ష్యాన్ని చూపడం సహించరాని విషయం. ప్రజల కోసం అప్పులు చేసి, ఆస్తులమ్మి పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టిన మాజీ సర్పంచులకు ఏళ్ల తరబడి పెండింగ్ బిల్స్ చెల్లించకపోవడం దుర్మార్గం. ఇకనైనా వెంటనే మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా. లేనిపక్షంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మాజీ సర్పంచులు కాంగ్రెస్ కు తగిన గుణపాఠం చెప్పడం తథ్యం.

# గోల్కొండ హస్తకళాల స్టాల్ ప్రారంభం





**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 09:**
హస్తకళలను ప్రోత్సహించేందుకే స్వామివారి క్షేత్రంలో "గోల్కొండ హస్తకళా విక్రయశాల" ను అందుబాటులోకి తీసుకు వచ్చిన్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరక్టర్ శైలజా రామయ్యర్ తెలిపారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో గల హస్తకళలను ప్రదర్శించి స్వామివారిని దర్శించుకునే భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. బుధవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం కొండపైన రాష్ట్ర హస్తకళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోల్కొండ హస్తకళల విక్రయశాలను రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వామివారిని దర్శించుకునే భక్తులు హస్తకళలతో రూపొందించిన వస్తువులను కొనుగోలు చేసి ఉపాధి కల్పనకు కృషి చేయాలని కోరారు. పెంబర్తి హస్తకళలు, ఉడ్ కార్వింగ్ తో రూపొందించిన బొమ్మలు, ఇతర హస్తకళ చిత్రాలు అందుబాటులోకి తీసువచ్చినట్లు తెలిపారు. కొండపైన హస్తకళ విక్రయశాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన దేవాలయ అధికారులు, హస్తకళల అభివృద్ధి సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి సంస్థ ఓఎస్డీ భాష, మసూద అలీ, వేణుగోపాల్, గాయత్రి, సుల్తానా, శ్రీపాణి, మహేందర్ రావు, ఆలయ ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కరశర్మ పాల్గొన్నారు.

# సీనియర్ ఐఎఎస్ రోనాల్డ్ రోస్‌కు ఊరట

- తెలంగాణలో కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు

**హైదరాబాద్,ఏప్రిల్9( వెలుతురు):**
సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ రోనాల్డ్ రోస్‌కు క్యాట్‌లో ఊరట లభించింది. రోనాల్డ్ రోస్ తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రోనాల్డ్ రోస్.. ఏపీ ప్రభుత్వంలో ఆర్థికశాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇక తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యే ముందు రోనాల్డ్ రోస్.. విద్యుత్ శాఖ కార్యదర్శిగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం.. కేటాయించిన రాష్ట్రాల్లోరిపోర్ట్ చేయాలని ఐఏఎస్ అధికారులను గతేడాది అక్టోబర్‌లో డీవోపీటీ- ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులపై క్యాట్, హైకోర్టును ఆశ్రయించినా ఆయా ఐఏఎస్‌లకు ఊరట దక్కలేదు. దీంతో తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లాల్సిన వాణిప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యారు. వెంటనే ఏపీలో రిపోర్ట్ చేశారు. మొత్తానికి ఏడు నెలల తర్వాత క్యాట్‌లో రోనాల్డ్ రోస్‌కు ఊరట దక్కింది. తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది.



కటకం నర్సింగ్ రావు (హైదరాబాద్) అనే నేను, భారతీయ జనతా పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేసిన పత్రని నాంపల్లి రాష్ట్ర కార్యాలయం సెక్రటరీ ఉమా శంకర్ గారికి ఇవ్వడం జరిగింది...

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 09:**

# బీజేపీ పార్టీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

## ఈ నెల 10 నుంచి 12వరకు గావ్ ఛలో-బస్తీ ఛలో కార్య క్రమాలు

## బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**(రాపర్తి భాస్కర్ గౌడ్)**
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో,ఏప్రిల్ 9:**



భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఏప్రిల్ 6 నుండి 12 వరకు పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనీ బీజేపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు, అందులో భాగంగా ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో 'గావ్ ఛలో - బస్తీ ఛలో' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామన్నారు.ఈ మూడు రోజుల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, బస్తీల్లో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి , కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ,రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ ,పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి పదాధికారులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు భాగస్వాములవుతారనీ కాసం చెప్పారు,ప్రతి గ్రామంలో పార్టీ పరంగా ఐదు ముఖ్యమైన కార్యక్రమాలను నిర్వహిస్తాం. 1) గ్రామాల మరియు బస్తీల సందర్శన,2) హాస్పిటల్, దేవాలయం లేదా పాఠశాల వంటి ప్రదేశాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం 3) బూత్ కమిటీ సభ్యులతో సమావేశం,4) కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులలో కనీసం 10 మందిని కలవడం,5) పార్టీ జెండాలతో ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు, అదేవిధంగా గ్రామంలో చిన్న స్థాయి సభ నిర్వహించి.ఈ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకుంటాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో పెద్ద స్థాయిలో ఉద్యమాలను చేపట్టేలా సన్నాహాలు జరుగుతాయి.ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేలా ప్రజలందరూ సహక రించాలని కోరుతున్నామన్నారు అలాగే రాష్ట్ర నాయకులందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని జాతీయ పార్టీ సూచనలు జారీ చేసిందనీ కాసం వెంకటేశ్వర్లు తెలిపారు,

# ఘనంగా నరేంద్ర వర్ధంతి వేడుకలు

- ఆయన సేవలను స్మరించుకున్న బీజేపీ నేతల

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో ఏప్రిల్ 9:**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం టైగర్ నరేంద్ర 11వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నరేంద్ర చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీ ఎన్. రాంచందర్ రావు, మాజీ శాసనసభ్యుడు సైదిరెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు , బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆలె భాస్కర్ ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు మాట్లాడారు, హిమాయత్‌నగర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన నరేంద్ర హైదరాబాద్ ప్రజలను తమ బంధువుల్లా భావించేవారు. పాతబస్తీలో హిందువులపై జరిగిన అన్యాయాలను ఎదుర్కొని ధైర్యంగా ముందుకెళ్లేవారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిది. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నరేంద్ర సేవలు ఎనలేనివన్నారు, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కార్యకర్తలంతా ముందుకు సాగాలి. స్వర్గీయ టైగర్ నరేంద్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టైగర్ నరేంద్ర తెలంగాణ బీజేపీకి ఉద్యమస్ఫూర్తి, హైదరాబాద్ నగరంలో రజాకార్ల గుంపుతో యోధుడిలా పోరాడి హిందువులకు రక్షణ కల్పించారు. పాతబస్తీలో ఎంఐఎం గూండాల ఆగడాలను ధైర్యంగాఎదుర్కొన్నారు. ఐఎస్ఐ ఉగ్రవాదులకు, రోహింగ్యా అక్రమ చొరబాటుదారులకు వ్యతిరేకంగా పోరాడి, స్థానిక ప్రజలకు బాసటగా నిలిచారు. వారి సాహసాన్ని భారదేశం మొత్తం ప్రశంసించింది. ముఖ్యంగా నరేంద్ర అయోధ్య రామాలయ నిర్మాణం ఉద్యమంలో అశోక్ సింఘాల్ జీ లాంటి గొప్ప ఉద్యమకారుల సరసన నిలిచి, ముందువరుసలో నడిచారు. అయోధ్యలోని గర్భగుడికి వెళ్లి ములాయం సింగ్ యాదవ్ సైన్యం దాడిలో మొట్టమొదట గాయపడిన ఉద్యమకారుడు నరేంద్ర అని తెలిపారు, అనేక పోరాటాలు, ఉద్యమాలతో హైదరాబాద్ ను శాంతియుతంగా ఉంచేలా హిందూ ప్రజలకు బాసటగా నిలిచారు. నరేంద్ర వారసత్వాన్ని బిజెపి గౌరవంగా ముందుకు తీసుకెళ్తోంది. గోల్కొండపై కాషాయ జెండా





ఎగురవేయాలనే తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చే దిశగా బీజేపీ కృషి చేస్తోంది. నరేంద్ర స్ఫూర్తితో ఎంఐఎం గూండాలు, ఐఎస్ఐ ముష్కరులను ఎదుర్కొంటూ హిందువులకు రక్షణగా నిలబడతామన్నారు,

# సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖ సన్నద్ధం

- సైబర్ ఫ్రాడ్ నేరాలపై ప్రత్యేక దృష్టి
- పరిశ్రమల్లో మహిళా ఉద్యోగుల రక్షణ కోసం షీ టీమ్
- డీజీపీ జితేందర్ వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్9( వెలుతురు):**
వాణిజ్య రంగంలో మారుతున్న సవాళ్లకు తగిన విధంగా స్పందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ముందడుగు వేస్తోందని డీజీపీ జితేందర్ తెలిపారు. ముఖ్యంగా సైబర్ ఫ్రాడ్ నేరాలను అరికట్టేందుకు ఐజీ ర్యాంక్ అధికారిని ప్రత్యేకంగా నియమించామన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. పరిశ్రమల్లో మహిళా ఉద్యోగుల రక్షణ కోసం షీ టీ-మ్‌ను ఏర్పాటు చేయడం, వారి ప్రయాణ సౌకర్యార్థం షీ షటిల్ బస్సులు అందుబాటులోకి తేవడం వంటి చర్యలను వివరించారు. తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో మెరుగైన పోలీస్ నిఘా , ప్రజా భద్రతపై రాష్ట్ర డీజీపీ జితేందర్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంకేతిక పోలీసింగ్, సైబర్ భద్రత, మహిళా ఉద్యోగుల రక్షణ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల భద్రతా సహకారంపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల మధ్య భద్రత విషయంలో అంతరాన్ని తగ్గించడమే ఈ సమావేశ ఉద్దేశం అన్నారు. పరిశ్రమల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. వేధింపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటు-న్నామన్నారు. గత ఐదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖకు రూ.800 కోట్లు మంజూరు



చేసినట్లు- జితేందర్ తెలిపారు. 100 డయల్ సేవలు మెరుగు పడటంతోపాటు పోలీస్ పనితీరు దేశంలోనే కాక, అంతర్జాతీయంగా ప్రశంసలందుకుంటోందని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని రంగాల అభివృద్ధి పోలీస్ భద్రతపై ఆధారపడి ఉంది. శాంతి భద్రతలను కాపాడడంలో మా బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తున్నాం, అని డీజీపీ జితేందర్ తెలిపారు. ఈ సమావేశం వాణిజ్య, పరిశ్రమల రంగం నుంచి విశేష స్పందన పొందింది. భద్రత , నిఘాపై ప్రభుత్వ నిర్ణయాలు పరిశ్రమల విశ్వాసాన్ని పెంచుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది.

# బిసి గురుకుల విద్యార్థులకు సెయిలంగ్ శిక్షణ

- సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్9( వెలుతురు):**
విద్యార్థుల్లో చదువుతో పాటు వారి ఆసక్తిని గమనించి అనుగుణంగా అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బీసీ గురుకుల విద్యాసంస్థ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఇందులో భాగంగా బీసీ గురుకుల విద్యార్థులకు సెయిలింగ్ క్రీడ ద్వారా శాస్త్రీయ శిక్షణతో పాటు నీటిలో నైపుణ్యం, సహనం, చురుకుదనం వంటి లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో యాచ్ క్లబ్ ఆద్వర్యంలో హుస్సేన్ సాగర్ లో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బేసిక్ ఫౌండేషన్ కోర్సుకు అర్హత సాధిస్తారు. బేసిక్ కోర్సులో అర్హత పొందిన వారికి మెరుగైన శిక్షణ ఇవ్వడంతో పాటు- వారు జాతీయ, అంతర్జాతీయ సెయిలింగ్ పోటీ-ల్లో పాల్గొన్నే నైపుణ్యం వస్తుంది. 2026 లో జరిగే ఆసియన్ గేమ్స్ , 2028 జరిగే ఒలింపిక్స్ లో పాల్గొనే అవకాశం ఉంటుందని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న 14 ఏండ్ల లోపు వయసు గల విద్యార్థులలో ఆసక్తి గలవారిని ఈ శిక్షణకు ఎంపిక చేశామని, బాలురు 32, బాలికలు 19మంది శిక్షణకు హాజరు అవుతున్నారని ఆయన తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 11 తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, బేసిక్ శిక్షణ పూర్తి చేసిన వారిలో బెస్ట్ అనిపించిన వారికి నెక్స్ట్ లెవల్ ట్రైనింగ్ ఉంటుదని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని ఆయన వివరించారు.



# రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళి సై తండ్రి మరణం పట్ల సీఎం రేవంత్ సంతాపం



**(రాపర్తి భాస్కర్ గౌడ్)**
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో,ఏప్రిల్ 9:**
తెలంగాణ మాజీ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తండ్రి, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గొప్ప సాహితీవేత్త కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మహాత్ముడి సిద్ధాంతాలను పునికిపుచ్చుకున్న దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమికుడు అనంతన్ ని కోల్పోవడం ఎంతో బాధాకరం అని సీఎం పేర్కొన్నారు.కుమారి అనంతన్ నాలుగుసార్లు శాసనసభకు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై ప్రజలకు ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తమిళిసై , వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. అనంతన్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లుగా సీఎం పేర్కొన్నారు



# సంపాదకీయం..

## వడ్డీలు..పన్నుల్లో హేతుబద్ధత ఉండాలి !

ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధానం కారణంగా కొంత వెసులబాటు కలుగుతోంది. అయితే ఇది మరింతగా ప్రజలరు ఆదుకునేలా ఉండాలి. వడ్డీరేట్లు ప్రజలకు, వ్యాపారులకు, ఉద్యోగులకు అనువుగా ఉండాలి. వారు భరించేవిగా ఉండాలి. పన్నులు కూడా హేతుబద్ధంగా ఉండాలి. విపరీతంగా పన్నులు, వడ్డీలు వసూలు చేస్తే ప్రజలు భరించలేరని గుర్తించాలి. స్వయం ఉపాధి పొందే వారికి,చవువుకునే వారికి ఉపయుక్తంగా ఉండాలి. డబ్బు వినిమయం, వస్తు కొనుగోళ్లకు అవినాభావ సంబంధం ఉంది. డబ్బు మార్కెట్లో చలామణి అవుతూనే వస్తూత్పత్తి అన్నది ప్రజలకు చేరాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా పరపతి విధానం ఉండాలి. అది ఇల్లు కావు, ఇతర పదార్థాలు కావచ్చు. అలాగే పెట్రో ధరలు, గ్యాస్ ధరలు కూడా ప్రజల కొనుగోలు శక్తికి మించి ఉండరాదు. ఇవి వస్తువుల ధరలు కూడా నియంత్రిస్తుంటాయి. వీటి ధరల ఆధారంగానే మార్కెట్లో వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇవి బ్యాలెన్స్ చేయడం అన్నది ప్రభుత్వం నడిపిస్తున్న వారికి అవసరం. అదేపనిగా ఉచిత పథకాల కారణంగా సమాజంలో పనిచేసే వారు తగ్గిపోతున్నారు. తినికూర్చునే వారు పెరుగు తున్నారు. దీంతో వస్తూత్పత్తి కూడా తగ్గుతుంది. ఇది కూడా గమననించాల్సి ఉంది.ఇకపోతే ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించ లేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మాత్రం పెరగడంలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించివేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగుతోంది. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించాలంటే ప్రజల కొనుగోలుశక్తిని పెంచే మార్గాలు అన్వేషించాలి. ఉపాధికల్పన మార్గాలను అన్వేషించాలి. కనీసం పెట్రో ఉత్పత్తుల మీద పన్నులను పెంచడం తగ్గిస్తే ప్రజల కొనుగోలుశక్తి పెరుగుతుంది. అప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకోగలరు. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగుదల వలన అదనపు ఆదాయం సమకూరుతోంది. ఆవిధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉపాధి కల్పన వంటి రంగాలకు ఖర్చు చేయడం బదులు, కార్పొరేట్లకు మరిన్ని రాయితీల్విడానికో, వారి బకాయిలను మాఫీ చేయడానికో వినియోగిస్తోంది. అలాగే మరిన్ని ఉచిత పథకాలకు వెచ్చిస్తున్నారు. వాస్తవానికి మన దేశంలో పెట్రోలు ధరలో **45.5** శాతం, డీజిల్ ధరలో **39.8** శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులకే పోతుంది. పన్ను రూపంలో వసూలు చేసేదానిలో కేంద్రం రాష్ట్రాలతొ భాగం పంచుకోవాలి. అందుచేత మోడీ ప్రభుత్వం నేరుగా పన్ను రూపంలో కాకుండా స్పెషల్ డ్యూటీ, రోడ్ సెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ వంటి పేర్లతో వసూలు చేస్తోంది. తరచూ ఆర్థిక మాంద్యం ఏర్పడడం వల్ల సరుకుల వినిమయం తగ్గిపోతుంది. అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతూ వుంటుంది. మన రూపాయి విలువ పడిపోయినా, సరుకుల ధరలు పెరిగినా అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం **8** శాతం దాటింది. వీటికి తోడు మన దేశ వార్షిక జిడిపి వృద్ధి రేటు ముందు అంచనా వేసినట్టుగా ఉండడం లేదని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ట్రంప్ విధానాలు, పాలస్తీనా,ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద ప్రభావం చూపనున్నాయని అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి ఆర్థి దుస్థితికి తాజా ఉదాహరణాలు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. ఐతే మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెట్టివేస్తున్నారు. ఇకపోతే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం వలన దాని ప్రభావం రవాణా రంగం మీద పడుతుంది. దాని కారణంగా ఇతర సరుకుల ధరలు కూడా పెరుగుతాయి. ఇవన్నీ కలిసి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీని పర్యవసానంగా శ్రామిక ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. దానివలన సరుకుల వినియోగం తగ్గిపోతుంది. మార్కెట్ లోని సరుకులు చెల్లుబాటు కావు. అందువలన ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. ఇకపోతే మనదగ్గర పంటలు బాగానే పండుతున్నాయి. మిర్చి, పప్పు ధాన్యాలు విపరీతంగా పండుతున్నాయి. వరి లెక్కకు మించి పండిస్తున్నారు. అయితే ఈ ధరలు ప్రజలకు చేరడం లేదు. తాజాగా ఆక్వా రైతులు ట్రంప్ దెబ్బకు విలవిల్లాడుతున్నారు. చికెన్, మటన్ ధరలు విపరీతంగా పెరుగుతున్నా ఆక్వా సామాన్యులకు అందుబాటు లోకి లేదు. దానిని ప్రజల చెంతకు తీసుకుని వెళ్లాల్సి ఉంది. ప్రజలకు మనదేశంలో లభిస్తున్న ఆహార ఉత్పత్తులు సరసమైన ధరలకు చేరాలి. ప్రధానంగా రొయ్యలను ఇంటింటికీ చేరుకునేలా చేయాలి. **140** కోట్లు జనాభా ఉన్న మనదేశంలో మాంసాహారులు కూడా ఎక్కువే. అమెరికా సుంకాలకు భయపడి కూర్చోకుండా ఆక్వాను ప్రజలకు అందించేలా ప్రణాళికలు చేయాలి. ఇకపోతే ట్రంపం సుంకాలను విమర్శిస్తున్న మనం ..మనవద్ద మోడీ సుంకాలను పట్టించుకోవడం లేదు. దేశం ఆర్థికంగా నిలదొక్కుకుని ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే జిఎస్టీ వడ్డింపులు భారీగా తగ్గాలి. ఉచిత పథకాలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టాలి. తాయిలాలను పక్కన పెట్టాలి. కిలో రూపాయికే బియ్యం పథకానికి పాతరేయాలి. వడ్డీరేట్లు మరింతగా తగ్గాలి. విద్యార్థులు తీసుకునే విద్యారుణాలపై వడ్డీ నామమాత్రంగా ఉండేలా చూడాలి. ఇలా ఆలోచన చేసినప్పుడే, ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. సంపాదించింది తిండికి కూడా సరిపోకపోతే దాని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుందని పాలకులు, వారికి సలహాలు ఇస్తున్న మేధావులు గుర్తించాలి.

# ట్రంప్ నిర్ణయాలతో మార్కెట్లపై ప్రభావం

- **ట్రంప్ సుంకాలపై చైనా ఎదురుదాడి**
- **ప్రతీకార సుంకాలతో బదులు తీర్చుకున్న డ్రాగన్**

**న్యూఢిల్లీ,ఏప్రిల్9( వెలుతురు):** అగ్రరాజ్యం అమెరికా, డ్రాగన్ దేశం చైనా మధ్య టారిఫ్ వార్ మరింత ముదిరింది. ఈ వ్యవహారం ఆసియా మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ట్రంప్ సుంకాల నిర్ణయంతో లక్షల కోట్లు మదుపురుల పెట్టబడి ఆవిరవుతోంది. దేశంలో వ్యతిరేకత వస్తున్నా..అనేక దేశాలు హెచ్చరిస్తున్నా ట్రంప్ మూర్ఖంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ట్రంప్ బెరింపులను చైనా కూడా పట్టించుకోవడం లేదు. అమెరికా ఇటీవల ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సుంకాలపై చైనా గట్టిగానే బదులిచ్చింది. డ్రాగన్ దేశం సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించింది. అయితే, సుంకాలను వెనక్కి తీసుకోవాలని.. లేకపోతే మరింత సుంకాలను ప్రకటించను న్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. చైనా వెనక్కి తగ్గకపోవడంతో ట్రంప్ అన్నంత పని చేశారు. చైనా వస్తువులపై భారీగా సుంకాలను ప్రకటించారు. తాజా సుంకాలతో 104శాతానికి సుంకాలు చేరాయి. కొత్తగా ప్రకటించిన సుంకాలు వెంటనే అమలులోకి వస్తాయని వైట్‌హౌస్ వెల్లడించింది. ఏప్రిల్ 2న అమెరికా చైనాపై 34శాతం సుంకాలను విధించింది. దీనికి స్పందనగా డ్రాగన్ దేశం సైతం అగ్రరాజ్యంపై 34శాతం సుంకాలు విధించింది. చైనా కొత్తగా ప్రకటించిన 34శాతం సుంకాలను ఉపసంహరిం చుకోకపోతే 50శాతం అదనంగా సుంకాలను ప్రకటిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఏప్రిల్ 9 నుంచి అమలులోకి వస్తాయని.. దాంతో పాటు చైనాతో అన్ని చర్చలు సైతం రద్దు చేస్తామని స్పష్టంచేశారు. దీనికి




అమెరికా ప్రతీకార సుంకాలు ఏకపక్షమని.. రెచ్చగొట్టడమేనంటూ చైనా స్పందించింది. తాము సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించామని.. భవిష్యత్ లో నూ మరిన్ని సుంకాలు పెంచుతామని ఘాటు-గా బదులి చ్చింది. సార్వభౌమాధికారం, భద్రతా, అభివృద్ధి తదితర ప్రయోజ నాలు కాపాడు కునేందుకు ప్రతీకార చర్యలు తీసుకుంటామని చైనా వాణిజ్యమంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 2న ట్రంప్ భారత్‌పై 26శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.వియత్నాంపై 46 శాతం, చైనాపై 34 శాతం, తైవాన్‌పై 32 శాతం, దక్షిణ కొరియాపై 25 శాతం, జపాన్‌పై 24 శాతం, యూరోపియన్ యూనియన్‌పై 20 శాతం సుంకాన్ని ప్రకటించారు. ఆయా దేశాలు అమెరికాపై చాలా ఎక్కువ సుంకాలను విధిస్తున్నాయని, వాటిపై ప్రతీకార సుంకాలను విధిస్తున్నామని ట్రంప్ వ్యాఖ్యానించారు. యూఎస్-చైనా టారిఫ్ వార్ మరింత ముదిరే అవకాశం ఉన్నది. అమెరికా విధించిన కొత్తగా ప్రకటించిన సుంకాలపై చైనా సైతం ఎంత మేర సుంకాలు విధిస్తుందో చూడాల్సిందే. టారిఫ్ వార్ మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ టారిఫ్ వార్ కారణంగా ఇతర దేశాలపై సైతం భారీ ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలిన విషయం తెలిసిందే. తాజాగా సుంకాల ప్రకటనతో మార్కెట్లు ఎలా గట్టెటెక్కుతాయో వేచి చూడాల్సిందే.

# దేశీయంగా సంస్కరణలకు ఇదే సమయం

- **ట్రంప్-చైనా సుంకాల నేపత్యంలోజాగ్రత్తగా ఉండాలి**
- **పెట్టుబడులు ఆకర్శంచేలా వ్యవహరించాలి**
- **మాజీ ఆర్‌బిఐ గవర్నర్ రఘురామ రాజన్**

**న్యూఢిల్లీ,ఏప్రిల్9( వెలుతురు):** ప్రస్తుతం అమెరికా-చైనా మధ్య తీవ్రస్థాయిలో జరుగుతున్న వాణిజ్యయుద్ధం భారత్‌కు మంచి అవకాశాలు సృష్టిస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు తలపడినప్పుడు వాణిజ్యంలో కొంత అస్థిరత ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో భారత్ సరైన నిర్ణయాలు తీసుకొంటే లబ్ధి పొందుతుందన్నారు. అయితే ట్రంప్ నిర్ణయాలతో అమెరికా సెల్ఫ్‌గోల్ చేసుకొందని రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. భారత్ చురుగ్గా వ్యవహరించి పెట్టుబడులు పెరిగేలా.. ఎగుమతులకు ప్రోత్సాహం లభించేలా అమెరికాతో వాణిజ్య చర్చలు జరపాలని అన్నారు. భారత్ ఇప్పుడు ఒక్క అమెరికాపైనే కాకుండా .. టారిఫ్‌ల విధానాన్నే పూర్తిగా సరళీకరించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. భారత్ ఇప్పుడు ఆర్థిక రక్షణాత్మక వైఖరి నుంచి దూరంగా జరిగి.. వాణిజ్య, పెట్టుబడుల వాతావరణాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని రాజన్ అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితులను అవకాశాలుగా భావించి భారత్ నిర్ణయం తీసుకోవాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించేలా దేశీయంగా సంస్కరణలను చేపట్టాలని చెప్పారు. తూర్పు, ఉత్తర దేశాలతోపాటు- ఆర్సీఈపీ, ఆసియాన్ వంటి గ్రూపులు, చైనా, జపాన్ వంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవాలన్నారు. బీజింగ్‌తో న్యూఢిల్లీ వాణిజ్య లోటు- ఉన్నా.. బ్యాలెన్స్‌గా వ్యవహరించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ట్రంప్ నిర్ణయాలు స్వల్పకాలానికి అమెరికాకు సెల్ఫ్‌గోల్‌లా పనిచేస్తాయని రాజన్ హెచ్చరించారు. ఆ దేశంలో నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి.. ఫెడ్ వడ్డీరేట్లు-



తగ్గించేందుకు సౌకర్యవంతంగా ఉన్న సమయంలో.. సొంత ఆర్థికవ్యవస్థనే ఆయన పట్టాలు తప్పిస్తున్నారన్నారు. అమెరికాకు ఎగుమతులు చేయడంపై ఆధారపడిన వియత్నాం వంటి దేశాలు ఈ నిర్ణయాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయని చెప్పారు. వీటితో పోలిస్తే భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం పరిమితిగా ఉంటుందని చెప్పారు. మన జీడీపీతో పోలిస్తే ఎగుమతులు తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని రాజన్ అభిప్రాయపడ్డారు. మన వృద్ధిరేటు పైనా పెద్దగా ప్రతికూల ప్రభావం ఉండదన్నారు. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బను తప్పించుకోవడానికి చైనా నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకొన్న కంపెనీలకు భారత్ ఓ ఆకర్షణీయమైన ప్రదేశమని రాజన్ వెల్లడించారు. మనం సరైన నిర్ణయాలు తీసుకొంటే.. అమెరికా తక్కువ టారిఫ్‌లు విధించిన దేశాల్లో భారత్ ఉండటం, దేశీయంగా ఉన్న బలమైన మార్కెట్ వంటి భారీగా పెట్టు-బడులను తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించే నిర్ణయాలు తీసుకోవడంతోపాటు-.. పన్ను చట్టాలను మరింత సరళీకరించాలి. భారత్‌కు సేవారంగ ఎగుమతులకు మాత్రం టారిఫ్‌ల సెగ తాకలేదని చెప్పాలని రాజన్ వివరించారు. ఇటీ-వల కాలంలో దేశంలో సేవారంగ ఎగుమతులు తయారీ రంగాన్ని దాటేశాయన్నారు. ఇక అమెరికా టారిఫ్‌లు భారత్‌లో ద్రవ్యోల్బణ నియంత్రణకు కూడా ఉపయోగపడే అవకాశాలున్నాయని చెప్పారు. భారత ఎగుమతులు తూర్పు ఆసియా వంటి మార్కెట్ల వైపు చూస్తాయని.. అదే సమయంలో దేశీయ మార్కెట్లు- కూడా వాటిని ఆకర్షిస్తాయని చెప్పారు. ఇక చైనా ఉత్పత్తులకు అమెరికాలో ప్రవేశం కష్టం కావడంతో.. భారత్ వైపు మళ్లే అవకాశం ఉన్నట్లు- వెల్లడించారు. ఇక టారిఫ్‌లు ఇలానే కొనసాగితే మాత్రం ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉందని రాజన్ అంచనా వేశారు.

# దేశీయంగా ఆక్వా మార్కెట్ పెంచాలి

- **ప్రతీకార సుంకాలను అవకాశంగా తీసుకోవాలి**
- **దేశీయంగా వాడకం పెంచేలా చర్యలు చేపట్టాలి**

**ఏలూరు,ఏప్రిల్9( వెలుతురు):** మన దేశ ఆక్వా ఎగుమతులపై అమెరికా 26 శాతం సుంకం విధించడంతో రొయ్యల సాగు రైతులు బేజారవుతున్న వేళ,చంద్రబాబు ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.రొయ్యలను దేశంలోని మార్కెట్లకు ఎగుమతి చేసి, నష్టాలను పూడ్చుకునేలా ఆక్వా రైతులకు తోడ్పాటు ఇవ్వాలి. దీంతో మాంసం ప్రియులకు రొయ్యలు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ సంక్షోభాన్ని వ్యాపార అవసరంగా మార్చుకోగలిగితే మంచిది. ట్రంప్ టారిఫ్‌లతో మన ఆక్వా రంగం కుదేలవుతున్న వేళ దేశీయంగా మార్కెట్‌ను పెంచితే మంచిది. దేశంలో 60శాతం మంది మాంసం ప్రియులకు రొయ్యలు దక్కడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భరోసా ధర కల్పించి రైతులకు ఊరట కల్పించేలా చర్యలు తీసుకోవాలి.సవాలక్ష సమస్యతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు అమెరికా విధించిన 26 శాతం సుంకం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఆక్వా రైతులు సమావేశాలు ఏర్పాటు- చేసుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటి, రెండు రోజుల్లో స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే మూకుమ్మడిగా క్రాప్‌హాలిడే ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నారు. అయితేఇం÷-దుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. వంద కౌంట్‌ను రూ.220కు కొనుగోలు చేయాలని ఎగుమతి వ్యాపారులకు చంద్రబాబు సూచించారు. అయితే, ఈ ధర తమకు గిట్టుబాటు- కాదని రైతులు అంటున్నారు. మిర్చి రైతుల పరిస్థితి మాదిరిగానే తమ పరిస్థితీ మారనుందని, భవిష్యత్తులో



రైతులు పెదవి విరుస్తున్నారు. కౌంట్ ఒక్కంటికీ రూ.20 నష్టం ప్రస్తుతం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద రైతుల వద్ద రూ.10 వ్యత్యాసంలో ఆ ధరకు కొనుగోలు చేస్తున్నారు, చిన్న రైతులను దళారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు రూ.20 నుంచి రూ.30 వరకూ కోత విధిస్తున్నారు. చెరువు నుంచి పట్టిన తర్వాత నిల్వ చేసుకునే అవకాశాలు లేకపోవడంతో తెగనమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా వైఖరిలో మార్పులేకపోతే భవిష్యత్తులో ధర మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 50 కౌంట్ రూ.320కు మించడంలేదు. 80 కౌంట్ రూ.240 మాత్రమే ఉంది. అత్యధిక మంది రైతుల వద్ద 100 కౌంట్ పంట ఉంది. ఎకరా విస్తీర్ణంలో రొయ్యల సాగుకు రూ.90 వేల నుంచి రూ.1.25 లక్షలకు వరకూ పెట్టుబడి అవుతోంది. ఎకరాకు 3 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. పంట బాగా ఉంటే ఒక్కోసారి 5 టన్నుల వరకూ కూడా వచ్చే అవకాశం ఉంది. .ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ధరకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ నష్టం వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.10 లక్షలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 80 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది.

ఈ ధర పెరగకపోగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, విద్యుత్ కోతలను అధిగమించి రైతులు ఈ ఏడాది రొయ్యలను సాగు చేశారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో రొయ్యలకు మంచి ధర లభించింది. 30 కౌంట్‌కు రూ.610 చొప్పన అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. అదే సమయంలో 100 కౌంట్ ధర రూ.260 నుంచి రూ.270 వరకూ పలికింది. దీంతో, వేసవిలో కూడా లాభాల పంట పండిస్తుందనే ఆశతో మార్చిలో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. అయితే, అమెరికా ప్రతీకార సుంకం ప్రభావం ఆక్వా రంగంపై తీవ్రంగా పడింది. రొయ్యల ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. 100 కౌంట్ రూ.200కు పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరపై

## చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం..

- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్..



**కూకట్ పల్లి ఏప్రిల్ 9 వెలుతురు:**
వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని డంపింగ్ యార్డ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాంకీ జోనల్ ఇంచార్జ్ రవి నాయక్ తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ వేసవిలో డంపింగ్ యార్డ్ కార్మికుల, సామాన్య ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఎండలకు ఇబ్బంది పడకుండా తమ దాహాన్ని తీర్చుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అందరికి సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, వాలి నాగేశ్వరరావు, శివ కృష్ణ, ఎస్.ఆర్.పి గోపాల్ నాయల్, డంపింగ్ ప్రెసిడెంట్ డి.కృష్ణ, ఎం.అంజి, ఏ. జయన్న, జి.ఎస్ మల్లికార్జున, టి.రవీందర్, ఎం.నాగరాజు, ఎం.రంగస్వామి, ఎం.మహేష్, ఎం.నారాయణ, శివ, శ్రీను, జి.ఎచ్.ఎం.సి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## శివ భక్త మార్కండేయ స్వామి ఆలయానికి విరాళం..

- ప్రధాన ద్వారము, గడప పూజ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గణేష్ నేత కుటుంబసభ్యులు.



**కూకట్ పల్లి ఏప్రిల్ 9 వెలుతురు:**
సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలో నూతనంగా నిర్మిస్తున్న శివభక్తా మార్కండేయ స్వామి దేవాలయంలో తన తండ్రి కీర్తిశేషులు జిల్లా సహవేవ్ జ్ఞాపకార్థంగా జిల్లా గణేష్ నేత విరాళంగా ప్రధాన ద్వారము, గడపను ఆలయానికి అందజేశారు. ఈ నేపథ్యంలో బుధవారం వారి కుటుంబ సమేతంగా గర్భగుడిలో గడప ప్రతిష్ట పూజలో పాల్గొన్నారు. ఈ ప్రతిష్ట కార్యక్రమంలో కొండపాక గ్రామ పద్మశాలి సంగం అధ్యక్షులు మంతెన నాగరాజు, మామిడాల వెంకటేశం ,రవి, యాదగిరి , నవీన్, నాగరాజు, పద్మశాలి కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## నాపై చేసిన ఆరోపణలు అవాస్తవం...

- గాదె శివ చౌదరి



**కూకట్ పల్లి ఏప్రిల్ 9 వెలుతురు:**
ఉద్దేశపూర్వకంగా తనపై కొందరు కుట్రపూరితంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కెపిహెచ్బి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గాదె శివ చౌదరి అన్నారు. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ తాను రాజకీయంగా ఎదుగుతున్నానే దురుద్దేశంతో తనపై కేసు నమోదు అయిందని తప్పుడు కథనాలతో చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఉన్నత విద్యావంతుడైనప్పటికీ నిస్వార్థంగా ప్రజాసేవలో ఉంటూ చిన్న, పెద్ద ప్రతి ఒక్కరిని అన్న, అక్క అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ నిత్యం నాయకులకు, ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ముందడుగు వేస్తూ, ప్రజా సమస్యలను పరిష్కారం కోసం నా వంతుగా కృషి చేస్తున్నానని అన్నారు. పేద, ధనిక, కులం, మతం తేడా లేకుండా కలుపుకొని ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులతో అందరితో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని అన్నారు. తాను నిత్యం రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి మహిళా నాయకురాళ్ల తోనే కలిసి పార్టీ కోసం పనిచేస్తున్నాను నేను తప్పు చేస్తే వారితో కలిసి పని చేసే అవకాశం నాకు ఉండదని నాపై చేసిన ఆరోపణలు అన్ని అవాస్తవం అన్నారు. అందరిని సోదర సమానులుగా, అక్క చెల్లెలుగా భావిస్తున్నాని అన్నారు. రాజకీయంగా ఎదుగుదల చూసి కొంతమంది ఓర్వలేక టిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ లో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు నాపై తప్పుడు ప్రచారాలు పూనుకున్నారని అన్నారు. నాపై ఏ విధమైన కేసు నమోదు కాలేదని తాను ఏ అమ్మాయిని నేను కించ పరచలేదన్నారు. తాను పని చేస్తుంది మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకురాళ్ళతోనే నా తప్పు ఉంటే తొలుత ఖండించేది మా అక్కలే అని శివ చౌదరి అన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ ఫలాలు ప్రతి ఒక్కరికి అందెలా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

**బుధవారం రోజున జనగామ నియోజకవర్గ చేర్యాల మండలం నాగపురి గ్రామంలో భీమ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, 'జై బాబు - జై భీమ్ - జై సమ్మిదాన్' పాదయాత్రలో భాగంగా ఒక నిరుపేద కుటుంబాన్ని సందర్శించారు. గౌరవ ముఖ్యమంత్రివర్యుల చొరవతో ఇప్పుడు నిరుపేదలు కూడా సన్న బియ్యం తింటున్న ఈ ఆనందదాయక సందర్భంలో ఆ కుటుంబంతో కలిసి భోజనం చేశారు.**

చేర్యాల మండలం వెలుతురు ఏప్రిల్ 09:



# పేదలకు పట్టెడన్నం పెట్టడమే కాంగ్రెస్ లక్ష్యం

### తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం
### ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం




**శంకర్ పల్లి వెలుతురు ఏప్రిల్ 9**
రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుండి అమలు చేస్తున్న సన్నబియ్యం పథకంలో భాగంగా శంకర్ పల్లి మండలం టంగటూరు గ్రామంలో రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది... ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... పేదల ఆకలి గోస తీర్చేందుకు దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చౌక ధరల దుకాణలలో సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. పేదలకు సమృద్ధిగా సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని రేషన్ షాపులలో తెల్ల కార్డుదారులకు ఇక నుంచి ప్రతి నెల సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. గత వానాకాలం నుండి సన్నవడ్లకు రైతులకు క్వింటాల్ కు రూ. 500 బోనస్ చెల్లించి ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన సన్నరకం ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా ఇక నుంచి మేలురకం సన్న బియ్యం మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. దీనికీ అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకొని ఉగాది పండుగ నుంచి పేదలకు సన్న బియ్యం రేషన్ ద్వారా సరఫరా చేస్తున్నారని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 55 రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా జరుగుతుందని, అవసరమైతే అదనపు షాపులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ప్రజలకు రేషన్ ద్వారా దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా చేశారని, దీని వల్ల చాలా వరకు రీసైక్లింగ్ జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే సంవత్సరానికి రూ. 2 వేల 700 కోట్లు భరిస్తూ పేదల కోసం సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ సరఫరా వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతులకు 2 లక్షల రుణ మాఫీ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించిన ఘనత రాష్ట్ర సర్కార్ కే దక్కిందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 59 కోట్ల 62 లక్షల రూపాయలను రైతు ఖాతాలలో బోనస్ క్రింద జమ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతూ సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడతామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన పేదలందరికీ రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని భరోసా ఇచ్చారు. రానున్న నాలుగేళ్ల కాలంలో నియోజకవర్గంలో దాదాపు 15 వేలు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి ప్రజాపాలన చూసి ఓర్వలేక కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలో కూడా బీజేపీ సన్న బియ్యం పంపిణీ చేసిందా అని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రెసిడెంట్ బద్దం రంగారెడ్డి, సీనియర్ నాయకులు, బద్దం కృష్ణారెడ్డి, బద్దం యాదిరెడ్డి, బద్దం పాండురంగారెడ్డి, జంగయ్య, బద్దం నిరంజన్ రెడ్డి, బద్దం రాజిరెడ్డి, బద్దం మాణిక్య రెడ్డి, అంతయ్య, మంచు విజయ్, పులిమద్ది ఏసు, బద్ధం వెంకట్రాంరెడ్డి, కోడి కృష్ణా, రేసు పాండురంగారెడ్డి, యాదగిరి, బద్దం జంగారెడ్డి, గూడెం మారయ్య, సీనియర్ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ తమ ధ్యేయం...

### కెపిహెచ్బి కాలనీలో భారీ ర్యాలీ చేపట్టిన కూకట్పల్లి కాంగ్రెస్ నాయకులు...



**కూకట్ పల్లి ఏప్రిల్ 9 వెలుతురు:**
రాజ్యాంగ పరిరక్షణ తమ ధ్యేయమని రాజ్యాంగ మార్పులు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని కాంగ్రెస్ నాయకులు తేల్చి చెప్పారు. ఏఐసిసి ఇచ్చిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, కార్యక్రమాన్ని బుధవారం కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ లో ఘనంగా నిర్వహించారు. ముందుగా 1వ, రోడ్ లోని మహాత్మ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడినుంచి రమ్య గ్రౌండ్ వరకు పెద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంటు ఇన్చార్జి పట్నం సునీత రెడ్డి, ఇంచార్జ్ ఉజ్మా షకీలా లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ తమ ధ్యేయమన్నారు. మహాత్మా గాంధీని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని అవమానిస్తూ కేంద్ర హెూం మంత్రి అమీషా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ పాలనలో సామాన్యుడు బతికే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. రాజ్యాంగ పరిరక్షకులు గా ఉండాల్సిన మోడీ రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమం తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ వ్యాప్తంగా ఇంటింటికి తీసుకెళ్తామన్నారు. సంవత్సరం పాటు కొనసాగుతుందని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, ఏ బి బ్లాక్ పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు ,కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, దండగుల యాదగిరి, పుష్ప రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మరియు డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళ అధ్యక్షురాలు, కాంగ్రెస్ యూత్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ, సీనియర్ నాయకులు, ఎస్సీ సెల్, బీసీ సెల్ నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కాంగ్రెస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా..సిద్దం.ఉజ్వల్ రెడ్డి




**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:**
రాజ్యాంగ పరిర క్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డి అన్నారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు జహీరాబాద్ మండలం చిరాగ్ పల్లీ, బూర్దిపాడ్ గ్రామాల్లో పాద యాత్ర నిర్వహించారు. వారు మాట్లాడుతూ డాక్టర్ అం బేద్కర్ రచించిన రాజ్యాంగానికి ముప్పు తెచ్చే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లే విధంగా ఉన్నాయన్నారు. అనంతరం జహీరాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంగా పేరుగాంచిన భారతదేశంలో రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కేంద్రం కుట్రలను ప్రజలకు వివరించేందుకు రాహుల్ గాంధీ గ్రామ గ్రామాన పాదయాత్ర చేపట్టాలని నిర్దేశించారని చెప్పారు. ఈకార్యక్రమంలో సిడిసి చైర్మన్ మహ్మద్ ముబీన్, జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ భీమయ్య, మాజీ సర్పంచ్ లు నర్సింహారెడ్డి, జగన్మోహన్, మాజీ కౌన్సిలర్ శేఖర్, మాజీ యం.పి.టి.సి లు హన్మంత్ రెడ్డి, నాగి శెట్టి,అశ్విన్ పాటిల్, నాథా నేయల్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ అక్బర్, ఇమామ్ పటేల్, సునీల్ కుమార్, దిలీప్ కుమార్, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జహీరాబాద్ లో ఘనంగా ఎన్ఎస్యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా..సిద్దం.ఉజ్వల్ రెడ్డి...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 09:**
జాతీయ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగమైన నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీ డా?? ఉజ్వల్ రెడ్డి నివాసంలో బుధవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డి హాజరయ్యారు. వారు కేక్ కట్ చేసి ఎన్ఎస్యూఐ విద్యార్థి నాయకులకు కేకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబీన్, జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, ఎన్ఎస్యూఐ అధ్యక్షులు విష్ణు వర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, అశ్విన్ పాటిల్, అక్బర్, ఇమామ్ పటేల్, నిజాం, శ్రీకాంత్ రెడ్డి, ప్రమోద్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 09:**
సంగారెడీ జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ న్యాల్కల్ మండల అధ్యక్షులు మల్లేష్ గంగ్వార్ ఆధ్వర్యంలో న్యాల్కల్ మండల కేంద్రంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అల్లాడి బక్కయ్య గుప్తా ముఖ్యఅతిథిగా రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఓంకార్ యాదవ్, భారతీయ జనతా యువమోర్చా మండల అధ్యక్షులు విష్ణు, సీనియర్ నాయకులు రాహుల్ పాలింకర్, వీరన్న పాటిల్, నవీన్ కుమార్, బసవరాజ్, శ్రీకాంత్, వీరారెడ్డి, బ్రహ్మం, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లాడి బక్కయ్య గుప్తా మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాబోయే స్థానిక సంస్థలలో ప్రతి గ్రామంలో విజయం సాధించే విధంగా కష్టపడాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ హయాంలో గత పది సంవత్సరాలలో సాధించిన విజయాల గురించి వివరించారు వాటిని ఏ విధంగా డెవలప్ చెయ్యాలనే అంశాలపై వారు మాట్లాడారు.

## అంగన్వాడి పిల్లలకు ప్లేకార్డ్ నీ ఆవిష్కరించిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 09:**
బుధవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ లోని అంగన్వాడి పిల్లలకు వచ్చే వేసవి కాలం ముందు పరిశుద్ధ గురించి మరియు ఇతర అంశాలు గురించి చెప్తూ ఒక ప్లేకార్డ్ నీ హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఐలమ్మ, మంజుల, నీరజ, మాధవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## మునిపంపుల గ్రామంలో బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 9**

మండలం మునిపంపుల గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నగరికల్ నియోజకవర్గం ఇంచార్జి నకరకంటి మొగులయ్య మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలియజేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచంలో, అభివృద్ధి చెందిన దేశాల్లో, ముందుకు తీసుకుపోయేందుకు కృషి చేస్తుందని అన్నారు. పేదల కోసం పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని చెప్పారు రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాషాయపు జెండా ఎగరవేయడం ఖాయం అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు మధుకర్ రెడ్డి, మరియు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, మరియు బిజెపి సీనియర్ నాయకులు పద్మా రెడ్డి , మునిపంపుల మాజీ సర్పంచ్ కట్ట యాదయ్య, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బిజెపి నాయకులు లక్ష్మయ్య , భిక్షం, మరియు ఆదరణ నరసింహ, గజ్జల రాము, శేఖర్, రేపాక లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## తుక్కుగూడలో చలివేంద్రం ప్రారంభం




**వెలుతురు,తుక్కుగూడ 09ఏప్రిల్:**

మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీ లో దేవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ మండే ఎండలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులకు ప్రజలకు దాహం తీర్చాలనే ఉద్దేశంతో ఈ యొక్క కార్యక్రమం ని చేపట్టడం జరిగింది. ఈ వేసవి ఎండలకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోని సురక్షితంగా ఉండాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బరిగేల హేమలత రాజు గౌడ్,మాజీ కౌన్సిలర్ జపాలా భవన సుధాకర్,బిజేపీ సీనియర్ లీడర్ కాటం భాస్కర్ మరియు బిజేపీ నాయకులు,కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలి

- ప్రజల కంటే పెట్టుబడిదారులపై ప్రేమ చూపిస్తున్న కేంద్ర ప్రభుత్వం...
- పెరిగిన ధరలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం...



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 09:**

కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు కేవలం పెద్దలకు మాత్రమే మేలు చేస్తూ బడా బాబుల లాభాల కోసం పేద ప్రజలపై బారాల మోపుతుందని అందులో భాగంగానే గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు పెంచిందని వాటిని తక్షణమే తగ్గించాలని సిపిఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలను నిరసిస్తూ ఈరోజు సిపిఎం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేవలం పెట్టబడుదారులు, పారిశ్రామికవేత్తలకు, బడాబాబులకు అనుకూలంగా వాళ్ళ లాభాల కోసం పనిచేస్తుంది తప్ప ఉపాధి లేక జీవనం కొనసాగించడమే గగనంగా మారిన నేటి తరుణంలో ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ప్రజల అవసరాలు తీర్చకుండా ప్రజా సమస్యలను గాలికి వదిలి కేవలం కొంతమంది ప్రయోజనాలకు పని చేయడం సరైన పద్ధతి కాదని తక్షణమే తీరు మార్చుకోవాలని పెంచిన ధరలను తగ్గించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కౌడి నర్సింలు, సలీం, దుర్గాప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాకాణికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**అమరావతి,ఏప్రిల్9( వెలుతురు):**

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన క్వాష్‌పిటీషన్‌పై విచారణను కోర్టు రెండు వారాల పాటు వాయిదా వేసింది. విచారణపై స్టే విధించాలని దాఖలు చేసిన అనుబంధ పిటిషన్ డిస్మిస్ చేసింది. పోలీసులు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు తెలిపింది. కాగా కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ రవాణా కేసులో ఆయన ఆరోపణలు ఎదుర్కొంటు–న్నారు. ఈ అక్రమ మైనింగ్ వ్యవహారంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోసం మాజీ మంత్రి పిటీ–షన్ వేసిన సంగతి తెలిసిందే.

# పేదల ఆరోగ్యానికి పెద్ద పీట

- యాదగిరిగుట్టలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ప్రభుత్వ విప్ బీర్ల



**యాదగిరిగుట్ట, వెలుతురు న్యూస్, ( ఏప్రిల్ 9 )**

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, వారికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు పనిచేస్తుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నివాసంలో ఆయన ఆలేరు నియోజకవర్గం లోని 8 మండలాలకు చెందిన సుమారు 675 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న ప్పుడు వారికి ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు పెద్ద ఎత్తున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్నామని అన్నారు . అనారోగ్యానికి గురైన పేదలు కూడా మంచి నాణ్యమైన వైద్యాన్ని అందుకునేలా తాము సహకరిస్తున్నామని అన్నారు . పేదల కోసం నిరంతరం పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు . అదేవిధంగా గత కొద్దికాలంలోనే ఆలేరు నియోజకవర్గం లో సుమారు 4500 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చేయూతను అందించామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఆలేరు నియోజకవర్గానికే వచ్చాయని ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి కి, మంత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి ఎల్లవేళలా అందుబాటు లో ఉంటామని తమది ప్రజా ప్రభుత్వమని , ప్రజల కోసమే పని చేస్తుందని ఆయన అన్నారు . ఈ సందర్భం గా ఆలేరు నియోజకవర్గం లోని 8 మండలాల నుండి వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదా రులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేయించారు. సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు రానుపోను రవాణా చార్జీలు కూడా అందజేయడం విశేషం. ఈ కార్యక్రమంలో 8 మండలాల నుండి వచ్చిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

## రామన్నపేట నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ నాగరాజు కు డాక్టరేట్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 9**

హిందీ దళిత్ కహానియో మే ఛత్రిత్ దళిత్ జీవన్ కా యతార్థ్ (1980 –2010 )కే సందర్భ్ మే.అను అంశం పై హిందీ డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ మాయాదేవి వాగ్మారే మార్గదర్శకంలో పరిశోధన పూర్తి చేసినందుకు నాగార్జున స్కూల్ కరెస్పాండెంట్ నాగరాజు నకిరేకంటి కు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది.వ్యవసాయ ఆధారిత కుటుంబనేపథ్యంలో నాన్నకు చేదోడుగా ఉంటూ స్థానికంగా పాఠశాల విద్యాభ్యాసం మొదలుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట లో డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువులపై ఆసక్తితో పీజీ కాలేజ్ సికింద్రాబాద్,ఓయూలో ఎం.ఏ హిందీ పూర్తి చేసి పిహెచ్.డి లో సీట్ పొందడం జరిగింది.యూనివర్సిటీ ప్రెసిడెంట్ గా సామాజిక న్యాయ పోరాట ఉద్యమాల్లో,మలిదశ తెలంగాణ సాధన ఉద్యమం వంటి సుదీర్ఘ పోరాటాల్లో చురుకైన భాగస్వామిగా విద్యార్థి రాజకీయాల్లో ముందుంటూనే పరిశోధన కొనసాగించారన్నారు.కుటుంబ సభ్యుల ప్రోత్సాహం,మిత్రుల సహకారంతో ఊరికి దూరంగా ఉంటూ కష్ట నష్టాలకు నిరుత్సాహపడకుండా, ఒడిదుడుకులను ఎదుర్కొంటూ పట్టుదలతో శ్రమించి పిహెచ్.డి పూర్తి చేశానన్నారు. స్థానికంగా చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి గాను నాగార్జున స్కూల్ స్థాపించడం జరిగిందన్నారు. పిహెచ్.డి పూర్తి చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.నాగరాజు డాక్టరేట్ పొందిన సందర్భంగా కుటుంబ సభ్యులు,ఉపాధ్యాయులు,మిత్రులు హర్షం వ్యక్తంచేశారు.

## భారత రాజ్యాంగ పరిరక్షణ - మనందరి బాధ్యత..

*దేశ ప్రజలందరూ భారత రాజ్యాంగ పరిరక్షణలో భాగస్వామ్యమవ్వాలి. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉంది..*







**నారాయణ్ ఖేడ్ వెలుతురు ఏప్రిల్ 09:**

ఈ ఉద్దేశ్యంతో, ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ మరియు పీసీసీ ఆదేశాల మేరకు నారాయణ్ ఖేడ్ నియోజకవర్గంలో "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" రాజ్యాంగ పరిరక్షణ సన్నాహ సమావేశం మరియు పాదయాత్ర కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని నారాయణ్ ఖేడ్ నియోజకవర్గా ఎమ్మెల్యే పటోళ్ల సంజీవ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, టిజిఐఐసి చైర్మన్ మరియు సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మరియు జైహీరాబాద్, నారాయణ్ ఖేడ్ నియోజక వర్గాల కోఆర్డినేటర్ డా: జూలూరు ధనలక్ష్మీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.. ఈ సందర్భంగా డా : జూలూరి ధనలక్ష్మి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ అమలుకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించే విధంగా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా "జై బాపు, జై భీమ్" కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని సాధించేందుకు రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.. చేతిలో గాంధీ, అంబేద్కర్ చిత్ర పటం పట్టుకొని పాదయాత్రలో పాల్గొన్న ప్రజలందరికీ ధనలక్ష్మీ కృతజ్ఞతలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిన గొప్ప రాజ్యాంగమని, దానిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని గుర్తు చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బ్లాక్ మరియు మండల అధ్యక్షులు, మండల నాయకులు, స్థానిక ప్రజలు, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## ఎన్ ఎస్ యు ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 9 :**

మండల కేంద్రంలో ఎన్ ఎస్ యు ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం రోజున కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి భీమనపల్లి శివ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి, ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారికి బ్రేడ్లు, పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు బోయ రామచంద్రం, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ భార్గవ్, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు బోయ నవీన్, పోతగోని శివ, ఎర్ర శ్రీధర్, బోయ శివ ప్రకాష్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించే స్థితిలో లేము

- టీఎస్ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల జాయింట్ సెక్రెటరీ పనకంటి భాస్కరరావు

**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 9 :**



యజమానుల వేధింపుల కారణంగా త్వరలో జరగబోయే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించే స్థితిలో కళాశాలలో లేవని తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ పనకంటి భాస్కరరావు అన్నారు. మాత్మ గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థుల తరపున ప్రభుత్వము చెల్లించే ఫీజుల ద్వారా మాత్రమే కళాశాలను నిర్వహిస్తున్నందున డిగ్రీ కళాశాలకు గత నాలుగు సంవత్సరాలుగా ఆర్టిఎఫ్, ఎంటిఎఫ్ చెల్లించకపోవడం వలన చాలామంది పేద విద్యార్థులు, యాజమాన్యాలు అనేక రకాల ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై గత 9 నెలలుగా వివిధ రూపాలలో నిరసన తెలియచేసినప్పటికి ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు పట్ల ప్రభుత్వం వివక్షత చూపించడం తగదన్నారు. ఇట్టి నిస్సయ పరిస్థితులలో కళాశాలలో పనిచేసే అధ్యాపకులకు గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించే పరిస్థితిలో లేమని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కళాశాలలో నుండి నిర్వహిస్తున్న భవన యజమానులకు కూడా అద్దె చెల్లించలేకపోవడం వలన ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. కావున కళాశాల సిబ్బంది సహాయ నిరాకరణ చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.భవన యజమానులు భవనాల అద్దె చెల్లించాలని ఒత్తిడి చేస్తున్న కారణంగా త్వరలో జరగబోయే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించే స్థితిలో లేమని అన్నారు. కావున ప్రభుత్వము తక్షణమే స్పందించి ప్రైవేట్ విద్యా సంస్థలను ఆదుకోవాలని కోరారు.

## డిగ్రీ సెమిస్టరీ పరీక్షల వాయిదా

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 9**

మాత్మ గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థుల తరపున ప్రభుత్వము చెల్లించే ఫీజుల ద్వారా మాత్రమే కళాశాలను నిర్వహిస్తున్నందున డిగ్రీ కళాశాలకు గత నాలుగు సంవత్సరాలుగా ఆర్టిఎఫ్ మరియు ఎంటిఎఫ్ చెల్లించకపోవడం వలన చాలామంది పేద విద్యార్థులు మరియు యాజమాన్యాలు అనేక రకాల ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ విషయంపై గత 9 నెలలుగా వివిధ రూపాలలో నిరసన తెలియచేసినప్పటికి ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడం వలన రాష్ట్రంలో విద్యార్థులు పట్ల వివక్ష చూపిస్తున్నారు. ఇట్టి నిస్సయ పరిస్థితులలో కళాశాలలో పనిచేసే అధ్యాపకులకు గత ఆరు నెలలుగా జీతాలు మరియు భవన యజమానకు అద్దె చెల్లించలేకపోవడం లేదు. కావున కళాశాల సిబ్బంది, సహాయ నిరాకరణ మరియు భవన యజమానులు వేధింపుల కారణంగా త్వరలో జరగబోయే, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించే స్థితిలో లేమని ఇందు ముఖంగా తెలియజేస్తున్నాము. ఇట్లు తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ మరియు పీజీ కళాశాల జాయింట్ సెక్రటరీ డాక్టర్ పనకంటి భాస్కర రావు.

## సిరిపురం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి

- సింగిల్ విండో వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్రమ్మ, రవీందర్ రెడ్డి
- రామన్నపేట-వలిగొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 9**



మండలం సిరిపురం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్రమ్మ రవీందర్ రెడ్డి వలిగొండ–రామన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి ప్రారంభించడం జరిగినది. అనంతరం మాట్లాడుతూ, అధికారులు సకాలంలో వడ్ల కొనుగోలు చేయాలని, రైతులకు అదనపు ఖర్చులు లేకుండా చూసుకోవాలని, రైతులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని, రైతులు మాచర్ వచ్చే విధంగా వడ్లను చూసుకోవాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట ఎమ్మార్వో లాల్ బహదూర్, వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీఖాన్, డి ఎల్ సి ఓ సురేష్ , ఏఈఓ శ్రీనివాస్, ఇంచార్జ్ సీఈవో సాలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ద బోయిన వెంకటేశం, సింగిల్ విండో డైరెక్టర్ పాశం రామ్ రెడ్డి, రైతులు కునూరు ముత్తయ్య, బండ శ్రీనివాస్ రెడ్డి,అంబటి యాదిరెడ్డి, దాడి మల్లారెడ్డి, బడుగు రమేష్,అప్పం లక్ష్మీ, నర్సు, కునూరు గణేష్, పున్న వెంకటేశం,కంకల నరసింహ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులకు గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆశీర్వాదం



**కేసముద్రం వెలుతురు ఏప్రిల్ 09:**
కేసముద్రం మునిసిపాలిటీ ఎస్టి కాలనీ సబ్స్టేషన్ తండాకి చెందిన వాంకుడోత్ దివ్య–సుక్య దంపతుల కుమార్తె కావ్య వివాహం పెళ్లి కుమారుడు అశోక్ తో జరగగా ఈ వివాహ మహోత్సవ వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ కేసముద్రం మండల కాంగ్రెస్ నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రవీందర్,వీర్య, రాజా లాల్ సింగ్,రమేష్ నాయక్,రవి,సురేష్, కొండేటి కళాధర్,సురేష్ గౌడ్,సహస్ర రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మహబూబాబాద్ జిల్లా నాయకులు



**కేసముద్రం వెలుతురు ఏప్రిల్ 09:**
కేసముద్రం మండలం బేరువాడ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ ముదిగిరి సాంబయ్య- సులోచన దంపతుల కుమారుడు రాజ్ గణేష్ వివాహం పెళ్లి కుమార్తె స్వాతి తో గూడూరు మండలం నెక్కొండ రోడ్ లోని మహేశ్వర గార్డెన్స్ లో వివాహం జరగగా ఈ కళ్యాణ మహోత్సవ వేడుకకు కేసముద్రం మండల నాయకులు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జెన్నారెడ్డి మహేందర్ రెడ్డి,ధన్నసరి పిఎసిఎస్ చైర్మన్ మర్రి రంగారావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్న యాదవ్,గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అక్రమాలపై విచారణ జరపాలి

- జిల్లా కలెక్టరుకు రాచాల ఫిర్యాదు




**వనపర్తి వెలుతురు ఏప్రిల్ 09:**
జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో జిల్లా ప్రాజెక్టు మేనేజరుగా పనిచేస్తున్న భాష్యా నాయక్ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గారికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అనంతరం రాచాల మాట్లాడుతూ వనపర్తి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరుగా కొన్నేళ్ల క్రితం నుంచి పని చేస్తున్న భాష్యానాయక్ పై మహిళా సంఘాలు, వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుంచి అనేక ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఒక్కో కొనుగోలు కేంద్రం నుంచి రూ.5,000ల చొప్పున, సంవత్సరానికి రూ.10 లక్షలు వసూలు చేస్తున్నట్లు అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ఆ డబ్బును నగదు రూపంలో మరియు ఫోన్ పే ద్వారా ప్రభుత్వం ఇచ్చిన ఫోన్ నంబరుకు ఫోన్ పే చేయించుకున్నాడని, దీంతోపాటు మహిళా సంఘాల్లో పనిచేస్తున్న బుక్ కీపర్లు, సీసీలు కూడా బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. కావున డీపీఎం భాష్యా నాయక్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి అతని ఫోన్ పే నంబరుకు లింకు ఉన్న అకౌంటులో వీవోఏల నంబర్ల నుండి వచ్చిన డబ్బులపై మరియు సీసీ, బుక్ కీపర్ల ద్వారా వచ్చిన డబ్బులపై కూడా విచారణ జరిపి అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాచాల కలెక్టరును కోరారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్ రెడ్డి, బీసీ పొలిటికల్ జెఎసి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటన్న, పట్టణ అధ్యక్షుడు దేవర శివ, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, గడ్డం శేఖర్, రామన్ గౌడ్, రాందాస్ నాయక్, రాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలి

- కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు మానుకోవాలి
- సిపిఐ ఆధ్వర్యంలో ఖేడ్ చౌరస్తా వద్ద నిరసన

**వెలుతురు నారాయణఖేడ్ ఏప్రిల్ 09 .**



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ డివిజన్ కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కూడా చేపట్టడానికి సిద్ధపడతామని అన్నారు ఇప్పటికే ప్రజలకు అనేక భారాలు మోపుతున్న మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా పెంచిన ధరలను వీటన్నిటిని వెంటనే తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు తగ్గించకుంటే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ డివిజన్ నాయకులు చిరంజీవి అశోక్ దత్తు రెడ్డి పుప్పాల అశోక్ సతీష్ సంజు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన తండాలలో సైతం తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్న రేవంత్ సర్కార్

- **బీజేపీ ఒబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్**

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఏప్రిల్ 09:**

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం పేరుతో ఇచ్చిన 6 గ్యారెంటీలలో ఏ ఒక్కటి నెరవేర్చకపోవడంతో నారాయణపురం మండలం కొర్ర తండాలో భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా జిల్లా నాయకుడు కొర్ర నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దరఖాస్తుల సేకరణ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా హాజరైన బీజేపీ ఒబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్,బిజెపి మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ గారు తండాలోని వృద్ధులను, మహిళలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న సందర్భంగా ఆ తండా ప్రజలు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలకు మోసపోయి మేము ఓట్లు వేశామని,గెలిచిన తర్వాత రేవంత్ రెడ్డి మాకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి మమ్మల్ని నట్టేట ముంచాడని వృద్ధులు మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారితో



మాట్లాడిన అనంతరం రాజు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు ?2500/- రూపాయలు,వృద్ధులకు ఆసరా పింఛన్ ?4000/- రూపాయలు ఇస్తానని బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలను మోసం చేశారు. ఆ యొక్క పథకాలను వెంటనే అమలు చేసేదాకా అన్ని గ్రామాలలో పర్యటించి ప్రజల తరపున భారతీయ జనతా పార్టీ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని దానికి ప్రజల తరపునుండి అనూహ్య స్పందన ఉన్నది. ఈరోజు మేము తీసుకున్న దరఖాస్తులను ప్రజల తరపున మండల తహసీల్దార్ జిల్లా కలెక్టర్ కి భారతీయ జనతా పార్టీ సంస్థాన్ నారాయణపురం మండల శాఖ ఆధ్వర్యంలో అందజేయడం జరుగుతుందని ఆ రోజు ప్రతి గ్రామం నుండి ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బూత్ అధ్యక్షులు కొర్ర శోభన్ నాయక్,ఆత్మూరి రాములు,కొర్ర శంకర్ చౌహాన్,తంగెల్ల సత్తయ్య,కరంటోత్ రమేష్ నాయక్,కొర్ర సురేందర్ నాయక్,సూరపల్లి శివాజీ,గుండె మల్లేష్ యాదవ్,గూడూరు మంజునాథ్ రెడ్డి,కొర్ర జగన్ నాయక్, కొర్ర జెల్ సింగ్, కొర్ర శంకర్,తరునోజు నవీన్ చారి, నాగరాజు గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## చంద్ర రాజేశ్వరరావు స్పూర్తితో భూ పోరాటాలు ఉధృతం చేయాలి

### బి కె యం యు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్




**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 09:**
పేదలకు భూములు పంచాలని భూ పోరాటాలకు రూపుకల్పన చేసిన చంద్ర రాజేశ్వర్ రావు స్పూర్తితో భూ పోరాటాలు ఉదృతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. చంద్ర రాజేశ్వర్ రావు 31వ వర్ధంతి సందర్భంగా బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం, సామాజిక ప్రగతి కోసం నిరంతరం జరుగుతున్న విప్లవ పోరాటాల్లో చంద్ర వ్యక్తిత్వం గుర్తించబడినదని, 8 శతాబ్దాల పైగా తాడిత, పీడిత ప్రజల సేవల్లో ఆయన రాజకీయ జీవితం అజేయమైనదిగా నిరూపితమైనదని వారు అన్నారు. కృష్ణాజిల్లాలో ఫ్యూడలిజం దొరలకు, జమీందారులకు, జాగీరుదారులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాన్ని కొనసాగించి రైతాంగంలోనూ. గ్రామీణ పేద ప్రజానీకంలోనూ చైతన్యాన్ని పురికొల్పారన్నారు. దాదాపు 4 దశాబ్దాలకు పైగా చల్లపల్లి జమీందారులకు వ్యతిరేకంగా విరోచిత పోరాటం సాగించడం ద్వారా 2500 ఎకరాల జమీందారు భూములను భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు పంచిపెట్టారన్నారు. 40వ దశకంలో అప్పటి నిజాం ఆంధ్ర ప్రాంతమైన హైదరాబాద్ సంస్థానంలో నిజాం రాచరికానికి, వెట్టి చాకిరికి, భూస్వామ్య విధానానికి, వ్యతిరేకంగా ఉద్యమమే ఊపిరిగా, పోరాటమే ధ్యేయంగా ఎంచుకొని రైతులను, వ్యవసాయ కార్మికులను సమైక్యం చేసి సాయుధ పోరాటంలో చంద్ర నిర్వహించిన పాత్ర మరువలేమని వారు ఉద్ఘాటించారు. సామాజిక న్యాయం ఆయన చిరకాల వాంఛ అని. దేశ అభ్యుదయం, స్వాతంత్ర పరమార్థం, సామాజిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని సాధించేందుకు ప్రజాస్వామ్యం సాధనంగా ఉపయోగపడాలన్నది చంద్ర అభిలాష అన్నారు. జీవితం కడక్షణం వరకు కమ్యూనిస్టుల ఐక్యత కోసం, అసంఖ్యాక భారత జనవాళికి విముక్తికోసం తపించిన చంద్ర జీవితం పోరాటాలకు సిద్ధాంత నిబద్ధతకు పర్యాయపదమని సృజన్ కుమార్ అన్నారు.

## బీసీలను అవమానపరిచిన జాగృతి కల్వకుంట్ల కవిత వెంటనే బీసీ జాతికి క్షమాపణ చెప్పాలి

- **కవిత నోరు అదుపులో పెట్టుకో ఖబడ్దార్ అని జాజుల లింగంగౌడ్ హెచ్చరిక**

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 09:**



ఢిల్లీలో బీసీలకు స్థానిక సంస్థలు మరియు విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన పోరుగర్జన సభను ఉద్దేశించి అదొక తుఫెలు దీక్ష అని చేసిన వ్యాఖ్యలు ఆమె అగ్రకులానికి నిదర్శనం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి లిక్కర్స్ స్కాంలో ఇరుక్కున్న జైల్లో చిప్పకూడు తిన్న నీకు బీసీల గురించి మాట్లాడే అర్హత లేదని ఏదో రాజకీయపబ్బం కోసమే నీవు విగ్రహాల దీక్షలు చేస్తున్నావు నిజంగా బీసీల మీద చిత్తశుద్ధి ఉంటే ఈ పది సంవత్సరాల కాలంలో మీ అయ్య ముఖ్యమంత్రిగా అప్పుడు ఏం చేసినావ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకూరి కిరణ్ నాగరాజు గౌడ్ ఇంద్రం రజక బండి గారి భరత్ పాల్గొన్నారు.

## గున్ గల్ మోడల్ స్కూల్ లో డైనింగ్ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రంగారెడ్డి



**వెలుతురు, ఇబ్రహీం పట్నం,ఏప్రిల్ 9:**
యాచారం మండలం గున్ గల్ గ్రామం లోని మోడల్ స్కూల్ లో అమెజాన్ వారి సహకారం తో నిర్మించిన నూతన సోలార్ ప్యానల్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ ని బుధ వారం నాడు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తో పాటు ఇతర సంస్థలు సహకారం అందించాలని అప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు,ఈ కార్యక్రమం లో అమెజాన్ డైరెక్టర్ లు బ్రాయిన్ కేనర్, ట్రైలర్, ఓంకార్, సీ యస్ ఆర్ మేనేజర్ తాతజీ, తెలంగాణా మోడల్ స్కూల్స్ డైరెక్టర్ శ్రీనివాస్ చారి, ప్రిన్సిపాల్ లావణ్య, ఎమ్మార్వో అయ్యప్ప, ఎంపీడీఓ నరేందర్ రెడ్డి, ఏంఈఓ పాండు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ,విద్యార్థులు , అధికారులు తదితరులు పాల్గొన్నారు,

## సూర్య నగర్ లో నూతన సీసీ కెమెరాల ప్రారంభోత్సవం

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిలు

**వెలుతురు, హయత్ నగర్,ఏప్రిల్9:**

ఎల్ బి నగర్ నియోజక వర్గంలోని హయత్ నగర్ డివిజన్ సూర్య నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి , హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి లు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలను అరికట్టడానికి, దొంగతనాలను , ప్రమాదాలను , వాస్తవ పరిస్థితులను , నూతన టెక్నాలజీ విధానం ద్వారా తెలుసుకునేందుకు సీసీకెమెరాలుఉపయోగపడతాయని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,కార్పొరేటర్ జీవన్ రెడ్డి లు అన్నారు,సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రజలందరూ అనుక్షణం నిఘా నీడలో భద్రంగా ఉంటారని, ప్రతి కాలనీలోనూ సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు వాటి మెయింటనెన్స్ కూడా ముఖ్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను , జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పొరంద మహేష్ కాలనీ అధ్యక్షులు అనంతల వెంకటేష్ గౌడ్ సంక్షేమ సంఘ కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శి బొర్ర జైపాల్ రెడ్డి , తంగేళ్ల సంజీవరెడ్డి , గంట శ్రీనివాస రెడ్డి ,మద్ది రాజేందర్ రెడ్డి , చెరుకు శంకరయ్య , అంతటి స్వామి గౌడ్ ఏనుగు నరసింహారెడ్డి ,మారెడ్డి చంద్రారెడ్డి ,తాళ్లపల్లి విజయ్ కుమార్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు,



# "ఉన్న మాట అంటే ఉలుకు ఎందుకు ఎమ్మెల్యే సంజయ్ "

- దొంగరాత్రి పోయి కండువా కప్పుకున్నది వాస్తవం కదా..?
- దమ్ముంటే మీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్ ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం రా..?
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి

**వెలుతురు, కరీంనగర్ బ్యూరో,ఏప్రిల్ 9:**
జగిత్యాల నియోజకవర్గం కార్యాలయం "కమల నిలయం" లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి మీడియా సమావేశంలో మాట్లాడారు, జీవన్ రెడ్డి టీడీపీ నుంచి మంత్రి పదవికి ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. నేను నా చైర్మన్ పదవికి అధికార టీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ప్రతిపక్ష బిజెపి పార్టీలో గౌరవప్రదంగా చేరాను.

### మరి మీరు ఏం చేశారు...?

దొంగ రాత్రి పోయి కాంగ్రెస్ పార్టీలో చేరారు...? 2018లో లక్ష ఓట్లు వచ్చాయి అన్ని గర్వంగా చెప్పుకున్నారు కదా, 2023 లో 40వేల ఓట్లు ఎందుకు తగ్గాయి...?
కోట్లు ఖర్చు పెడితే 8% ఓట్ల తేడాతో గెలిచారు.. మరి అప్పటికీ ఇప్పటికీ ఓట్ల శాతం ఎందుకు తగ్గిందనీ ప్రశ్నించారు,నడుమంత్రాపు సిరి వస్త ఎగిరి పడుతారంటారు.. నువ్వు అనుభవిస్తున్న రాజకీయ జీవితం పదవి ప్రజల బిక్ష, నిన్ను నమ్మిన కార్యకర్తల కష్టం. మిమ్మల్ని గెలిపించిన నాయకులు జైలులో ఉన్న వాళ్ళను మర్చిపోయి దొంగరాత్రి




దొంగలెక్క పోయి బిల్లుల కోసం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నీతులు మాట్లాడడం హాస్యాస్పదమని బోగ శ్రావణి మండిపడ్డారు,నిన్ను నమ్మిన వారి ఆత్మ గౌరవాన్ని పార్టీ కార్యకర్తల నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీకి తాకట్టు పెట్టావు.

### యు ఆర్ నాట్ ఫర్ జగ్శియల్ డెవలప్మెంటు

యు ఆర్ ఫర్ యూఆర్ పర్సనల్ డెవలప్మెంట్యూ ఆర్ ఫర్ యువర్ కాంట్రాక్ట్ డెవలప్మెంట్ సంజయ్ కుమార్ ది తెరిచినా పుస్తకం కాదు రాక్షస పాలన అని ఆమె ఆరోపించారు ,జగిత్యాల లో కక్ష సాధింపు రాజకీయాలు చేయడం మీతోనే సాధ్యం. 2017లో భూమి పూజ చేసిన డబుల్ ఇల్లు ఎందుకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పూర్తికాలేదు దానికి మీ బంధువులే కదా కాంట్రాక్టర్లు...?4 వేల నుండి 43 వేల ఓట్లు మా కార్యకర్తల కష్టం మరియు పార్టీ సపోర్ట్ ప్రజలు దీవించి ఇచ్చిన గౌరవప్రదమైన తీర్పు అది.స్థానం గురించి మాట్లాడుతున్నారు కదా...? ప్రజలు నీపై ఉన్న అభిప్రాయం ఇటీవల జరిగిన సర్వేలో మిమ్మల్ని 108వ స్థానంలో ఉంచారు అది గుర్తుపెట్టుకుని మాట్లాడండి అని ఆమె అన్నారు ,దమ్ముంటే మీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయి...?బీఆర్ ఎస్ లేదా కాంగ్రెస్ నుండి ఏ పార్టీ నుండి టికెట్ తెచ్చుకుంటావో తెచ్చుకో నేను బిజెపి తరపున నిలుచుంటా పోటీ చేస్తా ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం రా... అన్ని ఇటీవల కొన్ని మీడియా పత్రికల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్థాయి గురించి మాట్లాడినందుకు గాను డాక్టర్ బోగ శ్రావణి ఎమ్మెల్యే మాటలకు చురకలు అంటించారు. ప్రజలందరికి విజ్ఞప్తి చేస్తున్నాం జగిత్యాల ప్రజలు ఎమ్మెల్యేకి రాబోయే కాలంలో తగిన బుద్ధి చెబుతారనీ బోగ శ్రావణి తెలిపారు ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న,మహిళ మోర్చా ప్రదాన కార్యదర్శి సాంబరి కళావతి,మహిళ మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, పట్టణ ఉపాధ్యక్షులు పవన్ సింగ్, సింగం పద్మ, కాశెట్టి తిరుపతి, గడ్డల లక్ష్మి ఇట్యాల రాము మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

## కీలక వడ్డీరేట్లను సవరించిన ఆర్‌బిఐ

శాతం నుంచి 6 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ కీలక వడ్డీరేట్లను కేంద్ర బ్యాంకు 25 బేసిస్ పాయింట్లు- తగ్గించిన సంగతి తెలిసిందే. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు- తగ్గించినట్లు- ఆయన వెల్లడించారు. దీంతో గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. రెపోరేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించినట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. రెపో రేటు- తగ్గించడం వల్ల .. బ్యాంకులపై రుణభారం తగ్గనున్నది. దీని వల్ల బ్యాంకులు కూడా కస్టమర్లకు తక్కువ రేటుకే వడ్డీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఫలితంగా రుణాలపై ఈఎంఐలు తగ్గే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రెపో రేటను 6 శాతానికి తగ్గించాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు- ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు. తగ్గింపు నిర్ణయానికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. ఈ సందర్భంగా స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణాల వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపించనున్నాయి. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించొచ్చని కూడా గవర్నర్ అభిప్రాయపడ్డారు. అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. తయారీ రంగం పునరుద్ధరిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు- 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలి త్రైమాసికంలో 6.5శాతం, రెండో త్రైమాసికంలో 6.7శాతం జీడీపీ నమోదవ్వొచ్చని అంచనా. మూడు, నాలుగు త్రైమాసికాల్లో వృద్ధిరేటు వరుసగా 6.6శాతం, 6.3శాతం ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4శాతానికి దిగి రావొచ్చని అంచనా. త్రైమాసికాల వారీగా 3.6శాతం, 3.9శాతం, 3.8శాతం, 4.4శాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వీటితో రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఇకపోతే బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి నిబంధనలు కఠినతరం కానున్నాయి. దీనికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీంతో ముత్తూట్ ఫైనాన్స్, ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ వంటి రుణ జారీ సంస్థల షేర్లు భారీగా క్షీణించాయి. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం ఇటీవల విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటిని అడ్డుకొనేందుకు ఆర్‌బీఐ చర్యలకు సిద్ధమవుతోందని కొన్నిరోజుల క్రితమే వార్తలు వచ్చాయి. దీనిపై ఆర్‌బీఐ తాజాగా స్పందించింది. వివిధ రకాల నియంత్రణ సంస్థలు అనుసరిస్తున్న మార్గదర్శకాలను సమన్వయం చేయడంతో పాటు, సాధ్యమైనంత వరకు రిస్క్ తగ్గించేందుకు త్వరలో సమగ్ర నిబంధనలతో మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొంది. ఎంపీసీ సమావేశ వివరాల వెల్లడి సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌బీఐ ప్రకటనతో ముత్తూట్ ఫైనాన్స్ షేర్లు ఇంట్రాడేలో 10 శాతం మేర పతనం అయ్యాయి. బీఎస్‌ఈలో ఆ కంపెనీ షేర్లు రూ.2063కు చేరాయి. ఐఐఎఫ్‌ఎల్ షేర్లు సైతం 8 శాతం మేర క్షీణించాయి. మణప్పురం షేర్లు 3 శాతం, చోళమండలం షేర్లు 4.7 శాతం మేర పడ్డాయి. ముత్తూట్ ఫైనాన్స్ జారీ చేసే రుణాల్లో 98 శాతం వరకు బంగారం తాకట్టుగా పెట్టుకుని ఇచ్చేవే అధికం కావడంతో ఆ కంపెనీ షేర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యాయి. మణప్పురం 50 శాతం, ఐఐఎఫ్‌ఎల్ 21 శాతం చొప్పున మొత్తం రుణాల్లో వాటాను కలిగిఉన్నాయి. రుణాల జారీ విషయంలో ఆర్థిక సంస్థలేవీ ఒకేతరహా విధానాలు పాటించడం లేదని ఆర్‌బీఐ గుర్తించింది. బంగారం తాకట్టు రుణాల జారీ నుంచి ఆ నగదు వినియోగం, వేలం వరకు ఇలా ప్రతి దానికీ విధివిధానాలను ఖరారు చేసే అవకాశం ఉంది.

## మంచు కుటుంబంలో ముదురుతున్న వివాదం

పేర్కొంటూ మనోజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసి,ఇదంతా తన సోదరుడు విష్ణు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం జల్‌పల్లి నివాసం వద్దకు చేరుకున్న మనోజ్.. గేటు బయట భైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లోకి ఇచ్చేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. నాకు ఈ ఆస్తి వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పాను. ఇది ఆస్తి గొడవ కాదు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా. అక్కడే మొదలైంది ఈ గొడవ. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటివరకూ ఒక్క ఛార్జ్ షీట్ ఫైల్ చేయలేదు. కత్తులు, గన్‌లతో రౌడీలు మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులకు ఇచ్చాను. ఇంట్లో నా పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయి. వాటికోసమే వచ్చా అని మనోజ్ చెప్పారు. పాప పుట్టినరోజు కోసం మేం జయపుర వెళ్లిన తర్వాత విష్ణు ప్లాన్ చేసి ఇదంతా చేశారు. విష్ణు అనుచరులు ఇంటికి వచ్చి కార్లను తీసుకెళ్లారు. నా సెక్యూరిటీ-పై దాడి చేశారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్‌ను వాళ్లు ఎన్నోసార్లు దాటారు. నేను తప్పు చేశానని, ఆస్తి అడిగానని ఒక్క సాక్ష్యాధారం బయటపెట్టమనండి. అప్పుడు వాళ్లందరి కాళ్లపై పడి క్షమాపణ కోరతా. చోరీ గురించి పోలీసులకు చెబుతున్నా యాక్షన్ తీసుకోవడం లేదు. నా సెక్యూరిటీ- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవట్లేదు. ఇప్పుడు నా ఇంట్లోకి వెళ్లడానికి ఆర్డర్ కావాలని పోలీసులు అడుగుతున్నారు. మోహన్‌బాబు చెబితేనే లోపలికి పంపిస్తానని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నా విన్నపం ఒక్కటే. కోర్టు నోటీసులతో వచ్చినా లోపలకు పంపించడం లేదు. నా సమస్యను పరిష్కరించండని మనోజ్ విజ్ఞప్తి చేశారు. నా కుటుంబం నుంచి ఇప్పటివరకూ ఒక్క రూపాయి తీసుకోలేదు. బయట ప్రొడక్షన్‌లో హిట్ కొడితే తీసుకొచ్చి సొంత నిర్మాణ సంస్థలో సినిమా చేయాల్సిందేనని అనేవారు. విష్ణు కెరీర్ నిలబెట్టడం కోసం లేడీ గెటప్ కూడా వేశా. వాళ్ల కోసం ఎంతో గొడ్డు చాకిరీ చేశా. అయినా ఎందుకింతలా దిగజారుతున్నారో అర్థం కావడం లేదు. 'కన్నప్ప'కు పోటీ-గా 'భైరవం' విడుదల చేద్దాం అనుకున్నాం. టెన్షన్ పడిపోయి కన్నప్ప వాయిదా వేసుకున్నాడు. ఆ కోపాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియక ఇదంతా చేస్తున్నాడు. ఇప్పుడు నా తల్లిదండ్రులకు ఈ తలనొప్పులు అవసరమా? విష్ణు ప్రశాంతంగా కూర్చొని మాట్లాడవచ్చు కదా అని మనోజ్ వ్యాఖ్యానించారు.కారు చోరీపై నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వగా అది విష్ణు ఇంట్లో ఉన్నట్లు- గుర్తించారు. రికవరీకి వెళ్లినప్పుడు దాన్ని మాదాపూర్‌కు పంపించారని మనోజ్ మీడియాతో చెప్పారు. ఈక్రమంలోనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు- చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## మూడ్రోజుల పాటు ఈదురుగాలులతో వర్షాలు

**హైదరాబాద్,ఏప్రిల్9( వెలుతురు):**

భారత వాతావరణ విభాగం తాజాగా వాతావరణ పరిస్థితులపై కీలక అప్‌డేట్‌ను విడుదల చేసింది. ఏప్రిల్ 9 నుంచి 12వ తేదీ వరకు దక్షిణ దేశంలోని పలు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, పలు ప్రాంతాల్లో పిడుగుపాటు- సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ వర్ష సూచనల ప్రభావం కోస్తాంధ్ర, యానాం, తెలంగాణ, కేరళ, మాహే, కర్ణాటక రాష్ట్రాల్లో కనిపించనున్నట్లు- ఐఎండీ పేర్కొంది. సముద్ర తీర ప్రాంతాల్లో ఈదురుగాలులు, పిడుగుపాట్ల ప్రభావం ఉండే అవకాశముందని తెలిపింది. ఇక గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వడగాలులు కొనసాగుతాయని ఐఎండీ అంచనా వేసింది. ఏప్రిల్ 9, 10 తేదీల్లో అసోం, మేఘాలయలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, ఏప్రిల్ 10న అరుణాచల్ ప్రదేశ్‌లో కూడా భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ఈ రోజు నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. అదే విధంగా, వాయవ్య భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఏప్రిల్ 10న వర్ష సూచనలు ఉన్నాయి. నైరుతి, ఆగ్నేయ దిశల్లో ఏర్పడిన అల్పపీడనం రాబోయే 24 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా వాయవ్యం, ఉత్తర దిశల వైపుగా కదిలే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. వర్షాలు, ఈదురుగాలులు, పిడుగుపాట్ల సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన వేళల్లో మాత్రమే ప్రయాణాలు చేయాలని వాతావరణ శాఖ సూచించింది. అలాగే వ్యవసాయదారులు తమ పంటలను సంరక్షించేలా ముందు జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించింది.

# ఆదాయ మార్గాలపై దృష్టి సారించండి

పన్ను ఎగవేతదారులను పసిగట్టేందుకు ఏఐని వినియోగించుకోవాలని ఆదేశించారు.. అన్ని ఆదాయార్జన శాఖల్లోనూ ఇదే తరహా పక్రియ అమలు చేసి పకడ్బందీగా పన్ను వసూళ్లు చేయాలన్నారు. -టె-క్నాలజీని వినియోగించుకోవడం ద్వారా వ్యాపారులకు పన్ను చెల్లింపులు, అనుమతులు వంటివి సులభతరం అవుతున్నాయనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వంలా వ్యాపారులను వేధించడం కూటమి ప్రభుత్వ విధానం కాదని.. వారితో సమన్వయం చేసుకుంటూ నిబంధనల ప్రకారం రావాల్సిన పన్నులన్నీ చెల్లించేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. పన్నుచెల్లింపుదారులు, జీఎస్టీ పోర్టల్, ఏపీ రాష్ట్ర డేటా సెంటర్, ఏపీసీటీ-డీ.. ఇలా మొత్తం శాఖల సమాచారాన్ని ఏఐతో అనుసంధానించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు నోటీసుల జారీకి, గ్రీవెన్స్‌లు స్వీకరించడానికి ఏఐని వినియోగించి ప్రభుత్వ యంత్రాంగంలో మరింత వేగం పెంచవచ్చని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రాష్ట్ర సొంత ఆదాయ లక్ష్యం రూ.1,37,412 కోట్లను 100 శాతం ఆర్జించేలా అన్ని శాఖలు కృషి చేయాలని చెప్పారు సీఎం చంద్రబాబు.. రాష్ట్ర సొంత ఆదాయంలో 2.2 శాతం వృద్ధి కనిపించింది అన్నారు సీఎం.. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2024-25కి గాను రాష్ట్రానికి సొంతంగా ఆదాయంలో 2.2శాతం వృద్ధి నమోదైందని.. రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో వృద్ధి 4.1 శాతం పెరగ్గా, పన్నేతర ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో లేదన్నారు.. జీఎస్టీలో 4.9శాతం వృద్ధి, ప్రొఫెషనల్ ట్యాక్స్‌లో 15.2శాతం వృద్ధి, ఎక్సైజ్ ఆదాయంలో 24.3 శాతం వృద్ధి నమోదైందన్నారు. కొత్త పాలసీ ప్రకటించిన దగ్గర నుంచి ఆదాయాన్ని పరిశీలిస్తే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గతం కన్నా మెరుగుపడింది.. అక్టోబర్ 2024 నుంచి మార్చి 2025 వరకు రూ. 4,330 కోట్ల ఆదాయం రాగా, దాదాపు 33 శాతం ఆదాయం పెరిగింది. అలాగే, మున్సిపల్ శాఖలో 2023-24 కంటే 2024-25లో రూ.500 కోట్లకు పైగా ఆదాయం అదనంగా వచ్చింది. పన్నులకు సంబంధించి ఇంకా సుమారు రూ.2,500 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తులకు సంబంధించిన పన్నులు, అలాగే, ఖాళీ స్థలాల పన్నులు అధికంగా వసూలు కావాల్సి ఉన్నాయి. మార్చి నెలలో ప్రకటించిన 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో కేవలం 6 రోజుల్లోనే మొత్తం ఆస్తిపన్నులు రూ.240 కోట్లు- వసూలయ్యాయని అధికారులు తెలిపారు...

# మద్యం ఆదాయం తాకట్టుతో 32 వేల కోట్ల అప్పు

- నకిలీ బ్రాండ్లతో సొంత వ్యాపారానికి తెర
- గత జగన్ ప్రభుత్వ నిర్వాకంతో తీవ్ర నష్టం
- ఎక్సైజ్ అధికారుల సమీక్షలో మంత్రికొల్లు రవీంద్ర

**తిరుపతి,ఏప్రిల్9( వెలుతురు):**



గతంలో మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి 32 వేల కోట్ల అప్పులు చేశారంటూ ఏపీ అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు.. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావెరి సమావేశ మందిరంలో ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం జరిగింది.. ఈ సమావేంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. 2014-19 మధ్య ప్రజలకు ఇబ్బంది లేని విధంగా టీడీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి అమలు చేశాం.. కానీ, 2019- 24 మధ్య కాలంలో ఐదేళు ఎ క్సైజ్ వ్యవస్థను నాశనం చేశారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చి.. మద్యం వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారు. కొత్త పాలసీ పేరుతో వ్యవస్థ మొత్తాన్ని విచ్ఛిన్నం చేశారు. రాష్ట్రంలోని డిస్టిలరీల నుండి మద్యం షాపుల వరకు మొత్తాన్ని హస్తగతం చేసుకున్నారు. ఎన్ ఫోర్సు మెంట్ లేకుండా చేసి మద్యం అక్రమ వ్యాపారాలకు తెరలేపారు. మల్టీ నేషనల్ బ్రాండ్స్ మొత్తాన్ని మార్కెట్ నుంచి దూరం చేసి, తమ సొంత బ్రాండ్లను తీసుకొచ్చి ప్రజల నెత్తిన రుద్దారు అంటూ విరుచుకుపడ్డారు.. ఇక, గత ప్రభుత్వం అమలు చేసిన మద్యం విధానంతో ప్రభుత్వ ఆదాయం.. ప్రజల ఆరోగ్యం రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రి అన్నారు. ఏపీలో నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా పెరిగింది.. సరిహద్దు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు పెరగగా మన రాష్ట్రంలో మద్యం ఆదాయం తీవ్రంగా కోల్పోయాం. నాసిరకం సొంత బ్రాండ్ల కారణంగా లక్షల మంది అనారోగ్యం బారిన పడగా, పలువురు కిడ్నీ, లివర్ సమస్యల బారిన పడ్డారని విమర్శించారు.. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ ద్వారా నాసిరకం బ్రాండ్లకు స్వస్తి పలకడం జరిగింది. 6 రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టాం.. పాత బ్రాండ్లను తిరిగి పునరుద్ధరించాం. 350కి పైగా బ్రాండ్లు ఏపీలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు.. మద్యం ధరలను కూడా పొరుగు రాష్ట్రాలతో సమానంగా చేయడం వలన అక్రమ రవాణా ఆగింది అన్నారు కొల్లు రవీంద్ర. గతంలో ఉన్న బెల్టు షాపులపై కూడా చర్యలు తీసుకోవడంతో దాదాపు నిర్మూలించాం.. గత ఐదేళ్లు ఎక్సైజ్ శాఖను విచ్ఛిన్నం చేసి న్ఫోర్స్మెంట్ కూడా సరిగా లేకుండా పోయింది. నవోదయం 2.0 ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఏపీని మార్చేలా చర్యలు తీసుకుంటు-న్నాం అని వెల్లడించారు.. గంజాయి నిర్మూలన కోసం హోమ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు- చేసుకున్నాం.. టూరిజం పెంపు కోసం 3స్టార్ హోటల్ కి లైసెన్స్ ఫీజు తగ్గించేలా నిర్ణయం తీసుకున్నాం.. గతంలో మద్యం ఆదాయాన్ని తాకట్టు- పెట్టి 32 వేల కోట్ల అప్పులు చేశారు.. గత ఐదేళ్ల అక్రమాల గురించి ఆ పార్టీ నేతలే బట్టబయలు చేశారు. క్యాష్ అండ్ క్యారీ.. విధానంతో దాదాపు లక్ష కోట్ల లావాదేవీలు జరగడంపై సీఐడీ విచారణ జరుగు తోందన్నారు.. కానీ కూటమి పాలనలో అన్ని షాపుల్లో డిజిటల్ పేమెంట్స్ అందుబాటు-లో ఉంచి పారదర్శకతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.. మరోవైపు ఆన్ లైన్ ఇండెంట్, ట్రాక్ అండ్ ట్రేస్ విధానంతో పారదర్శకతకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు.

# కడియం శ్రీహరి రాజకీయ కృతఘ్నుడు

- కెసిఆర్ భిక్షతోనే ఎదిగిన కడియం
- ఎదురుదాడికి దిగిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

**జనగామ,ఏప్రిల్9( వెలుతురు):**



స్టేషన్ ఘన్‌పూర్ రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. బుధవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తీవ్ర విమర్శలు గుప్పించారు. రాజకీయ వేదికపై ఈ స్థాయి వ్యక్తిగత వ్యాఖ్యలు కావడం హాట్ టాపిక్‌గా మారింది. తాటికొండ రాజయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఆయన మాట్లాడుతూ, చనిపోయిన పాము కొస తోకకు ప్రాణం ఉన్నట్టు కడియం రాజకీయం ఉండేది అంటూ ఘాటుగా స్పందించారు. కడియం శ్రీహరికి రాజకీయ జన్మ ఇవ్వడంలో ముందుగా కేసీఆర్ పాత్ర ఉందని, రెండోసారి పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతోనే ఆయనకు ఎమ్మెల్యే టికెట్ లభించిందని రాజయ్య పేర్కొన్నారు. అలాగే, స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి పాత్రను ప్రస్తావిస్తూ, వేడినీళ్లకు చన్నీళ్ల లాగా రాజేశ్వర్ రెడ్డి వ్యవహరించారు. అభివృద్ధి విషయాల్లో ఆయన పాత్ర గణనీయమైందని అన్నారు. కేసీఆర్ మాటల్లో ఎప్పుడూ కడియం పేరు రాలేదని, అయినప్పటికీ ఆయన తన స్థాయిని మరిచి ప్రెస్ మీట్‌లో సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇక కడియం శ్రీహరి పాలన గురించి మాట్లాడుతూ, ఇప్పుడిది ప్రజాస్వామ్యం కాదు, అక్రమ అరెస్టులతో ఒక వర్గానికి అనుకూలంగా పాలన సాగుతోంది. ప్రజల స్వేచ్ఛలు హరించబడుతున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా... రాజకీయ జన్మనిచ్చిన స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలకు జీవితాంతం గులామ్‌గిరి చేయాల్సిన బాధ్యత నీ మీద ఉంది అంటూ రాజయ్య హెచ్చరించారు. ఆయన కడియంపై ఆస్తుల విషయమై కూడా ఆరోపణలు చేశారు. దేవనూరు పరిసర ప్రాంతాల్లో బినామీ పేర్లతో భూములు ఉన్నాయా? కుటుంబంతో కలిసి పాలేరు ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్నావా?' అంటూ ప్రశ్నలు సంధించారు. మొత్తం 23 మంది రైతులకు చెందిన 43 ఎకరాల 38 గుంటల భూమిని బినామీ పేర్లతో స్వాధీనం చేసుకున్నారని పేర్కొంటూ, ఇది వాస్తవం కాదా? అంటూ రాజయ్య నిలదీశారు. నీవు పతనమవుతున్న వ్యక్తివి అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

## యూపి సిఎం యోగితో కన్నప్ప బృందం భేటీ

**జూన్ 27న కన్నప్పను రిలీజ్ ప్రకటించిన మంచు**



**లక్నో,ఏప్రిల్9( వెలుతురు):**

మంచు విష్ణు తాను నటించిన కన్నప్ప కొత్త సినిమా రిలీజ్ డేట్ ను ప్రకటించారు. ఏప్రిల్ 25కు రావాల్సిన మూవీని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొత్త రిలీజ్ డేట్ పై సస్పెన్స్ నెలకొంది. తాజాగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ను మంచు మోహన్ బాబు, విష్ణు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం యోగికి శ్రీరాముడి ప్రతిమ బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా విష్ణు కన్నప్ప కొత్త రిలీజ్ డేట్ ను కూడా ప్రకటించారు. ఈ రిలీజ్ డేట్ పోస్టర్ ను సీఎం యోగి చేతుల మీదుగా ఆవిష్కరించారు. జూన్ 27న కన్నప్పను రిలీజ్ చేస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే ప్రమోషన్లు పెంచుతామన్నారు. దీంతో ఈ విషయం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఓ వైపు మంచు మనోజ్ జల్ పల్లిలోని ఇంటి వద్ద ధర్నా చేస్తున్నాడు. తన వస్తువులు అన్నీ విష్ణు ఎత్తుకెళ్లాడు అంటూ కేసు కూడా పెట్టాడు. ప్రెస్ మీట్ పెట్టి విష్ణుపై చాలా ఆరోపణలు చేస్తున్నాడు. అటు- మనోజ్ అంత రచ్చ చేస్తున్న -టైమ్ లోనే.. ఇటు- విష్ణు కన్నప్ప రిలీజ్ డేట్ ను ప్రకటించారు. కన్నప్ప సినిమా లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో పాటు- అక్షయ్ కుమార్, కాజల్ నటించడంతో భారీ హైప్ క్రియేట్ అయింది. ఇందులో కన్నప్ప పాత్రలో విష్ణు నటించారు. ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్స్, టీ-జర్ ఆకట్టు-కున్నాయి. ఏప్రిల్ 25కే రావాల్సిన సినిమాను.. వీఎఫ్ ఎక్స్ పనుల వల్ల వాయిదా వేసినట్టు- విష్ణు తెలిపారు.


## పెంచిన పన్నులు వెంటనే తగ్గించాలి

- ఇచ్చిన హామీలను కూటమి తప్పింది
- 320 కోట్ల భారం మోపడం దారుణం
- పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సిహెచ్.బాబురావు

**విజయవాడ,ఏప్రిల్9( వెలుతురు):**

పట్టణాలలో వైసిపి సర్కార్ పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్ను పెంచబోమని మాట ఇచ్చి, తప్పిందని, హామీ ఇచ్చిన విధంగా పన్ను పెంపు రద్దు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సిహెచ్.బాబురావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలలో ఆస్తి పన్నును గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వం పెంచింది. దీనివలన 320 కోట్ల రూపాయల భారం గృహ యజమానులపై పడుతుంది. 2020వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాటి వైసిపి ప్రభుత్వం అద్దె విలువ ఆధారిత పన్ను విధానం స్థానంలో ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని ప్రవేశపెట్టింది. చట్ట సవరణ చేసింది, దానికనుగుణంగా జీవో 198 విడుదల చేసింది. దానిపై పౌర సంఘాలు ఎన్నో ఆందోళనలు చేసినా గత ప్రభుత్వం లెక్క చేయలేదు. ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులు పెంచబోమని హామీ ఇచ్చారు. ఈ సంవత్సరం పన్నుల పెంపుదల ఉండదని ప్రజలందరూ భావించారు. కానీ 25-26 ఆర్థిక సంవత్సరానికి గుట్టు చప్పుడు కాకుండా పన్నులు పెంచడం శోచనీయం అని బాబూరావు అన్నారు. ఆన్ లైన్ లో పన్ను పెంచుతూ డిమాండ్ రూపొందించారు. కూటమి ప్రభుత్వం మాట తప్పింది, ప్రజలకు నమ్మకద్రోహం చేసింది. ప్రజలు భారాలు మోయలేని స్థితిలో ఉన్నారని, భారాలు వేయబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే ప్రకటించారు. కానీ దానికి భిన్నంగా ఒకేసారి 320 కోట్ల రూపాయల భారం వేయటం గర్హనీయం అన్నారు. ఈ పన్నుల పెంపు భారం గృహ యజమానులపైనే కాకుండా పరోక్షంగా అద్దెదారులపై కూడా పడుతుంది. మరోవైపు కొత్తగా ఇళ్ళు, భవనాలు నిర్మించుకునే వారు, గదులు అదనంగా కట్టుకునే వారిపై పూర్తి ఆస్తి విలువ ఆధారంగా ఇంటి పన్ను వేస్తున్నారు. ప్రజలు పన్నుల పెరుగుదలతో గగ్గోలు పెడుతున్నారు. అదానీ పోర్టులు,పరిశ్రమలు, ఇతర కార్పొరేట్ కంపెనీలకు పూర్తిగా ఆస్తి పన్ను ప్రభుత్వం రద్దు చేస్తున్నది. కొత్తగా పెట్టే పరిశ్రమలకు అనేక సంవత్సరాలపాటు- పన్ను రాయితీలు ఇస్తున్నారు. ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజలకు మాత్రం పన్నులు తగ్గించకపోగా, పెంచడం దుర్మార్గం. దీనికి తోడు ఒక నెల ఆలస్యమైనా 24 శాతం వడ్డీ.. పెనాల్టీ రూపంలో వసూలు చేయటం అన్యాయం. 30 శాతం వరకు ఇంటి పన్ను పెంచి ఈ నెలాఖరు లోపల పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వటం మోసపూరితమని మండిపడ్డారు. పట్టణాలలో పారిశుధ్యం దెబ్బతింటు-న్నది. ప్రజారోగ్యం క్షీణిస్తున్నది. మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ నుండి స్థానిక సంస్థలకు రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు నిధులు మంజూరు చేయాలి. పట్టణాలు అభివృద్ధి సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలి. పెంచిన పన్నులను తగ్గించాలి. పెంచిన పన్నులు తగ్గించాలని కోరుతూ పౌర సంఘాలు ,అసోసియేషన్లు, పౌర సమాజం ఉమ్మడిగా ఆందోళన నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

# మహిళా సంఘాలకు రైస్ మిల్లులు




**హైదరాబాద్, ఏప్రిల్ 9, ( వెలుతురు)**

మహిళలు తమ కాళ్లపై నిలబడేలా ఎదిగేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇదివరకే రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సౌర విద్యుదుత్పత్తి రంగాల్లో మహిళలను ప్రభుత్వం భాగస్వాములు చేసింది. తాజాగా రైస్‌మిల్లుల పరిశ్రమలో వారికి అవకాశాలు కల్పించాలని భావించి అందుకు కార్యాచరణను ప్రారంభించింది. మహిళా సంఘాలకు తోడ్పాటు అందించేందుకు ప్రతి మండలంలో ఒక రైస్‌మిల్లు నిర్మించేందుకు సర్కార్ ప్లాన్ చేస్తోంది. ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ప్రతి మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్‌మిల్లులు ఏర్పాటు, గోదాములు నిర్మించి ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. తెలంగాణలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో మహిళా సమాఖ్యలు ఉన్నాయి. మొత్తం 553 మండల మహిళా సమాఖ్యలు ఉండగా.. గ్రామస్థాయిలో 18000 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. మహిళా సమాఖ్యలున్న మండలాలకు ఒక్కో రైస్‌మిల్లు చొప్పున మంజూరు చేస్తే మొత్తం 553 రైస్ మిల్లులను నిర్మించి వారికి అందించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో 4.37 లక్షల స్వయం సహాయక సంఘాలు ఉండగా.. వాటిలో సభ్యులుగా 47.40 లక్షల మంది మహిళలు ఉన్నారు. అన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలంటే ఒక్కో ఒక్కోరైసమిల్లుకు దాదాపు రూ. 3.50 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకు మెషినరీ మన దగ్గరే లభిస్తుంది. గంటకు 4 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న మెషీన్లు కొనుగోలు, వాటిని మిల్లులలో బిగించి అంతా సిద్ధం చేయడానికి రూ. 1.10 కోట్ల వరకు అవుతుంది. వీటికి అదనంగా మట్టిపెళ్లలు, బెరుకులను వేర్వేరు చేసి తొలగించే యంత్రాలను కల్పించడానికి మరో రూ.75 లక్షలు వెచ్చించాలి. భవన నిర్మాణం, మెషీన్లు, విద్యుత్, నీటి సరఫరా, ఇతర అన్ని సదుపాయాలతో కలుపుకుంటే ఒక్కో రైస్ మిల్లుకు రూ.3.50 కోట్ల వరకు అవుతుందని అంచనా వేశారు. ప్రతి మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు నిర్మించి ఇస్తామని మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో 553 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి.స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో పాటు నిధులను బ్యాంకు రుణాల ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణంగా రైస్ మిల్లులు నిర్వహించే వ్యాపారవేత్తలు నాబార్డ్ నుంచి రుణాలు తీసుకుంటారు. ఇందుకోసం ఆస్తులు తనఖా పెట్టాల్సి ఉంటుంది. అయితే, మహిళా సంఘాలకు ఆ అవసరం ఉండదని, ప్రభుత్వమే మహిళలకు, బ్యాంకులకు మధ్యవర్తిగా వ్యవహరించడంతో పాటు గ్యారెంటీ కూడా ఇస్తుందట.రైస్ మిల్లుల విషయంలో.. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న ప్రాంతాలు, ఆయా పథకాల్లో చురుగ్గా పాల్గొంటున్న మహిళా సంఘాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందట.ఽ

# కవితక్క..దీక్షల అర్థం ఏమిటీ...

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ( వెలుతురు)**

ప్రతిపక్షంలో దీక్షలు.. అన్నేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు కవితక్క?ఇటీవల కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ వివిధ రకాల ఆందోళనలు చేపట్టారు. రైతుల కోసం సన్నచిలక మిర్చి దండలతో, మహిళల కోసం పోస్ట్‌కార్డ్ ఉద్యమంతో, లేదా హస్తకళాకారుల కోసం ఎండిన పంటలతో ఆమె నిరసనలు దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆందోళనలు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రైతులు, మహిళలు ఇతర వర్గాలను విస్మరిస్తోందని ఆరోపిస్తూ జరిగాయి. తాజాగా ఆమె అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలని దీక్ష చేపట్టారు. ఇందిరా పార్కు ఎదుట దీక్ష చేపట్టారు. ఆశ్చర్యం ఏమిటంటే.. నాడు సీఎంగా కేసీఆర్ ధర్నా చౌక్ ఎత్తివేయాలని ఆదేశించారు. విపక్షాలు, కార్మిక సంఘాలు కోర్టుకు వెళ్లి ధర్నా చౌక్ సాధించుకున్నాయి. ఇప్పుడు అదే ధర్నా చౌక్‌లో కవిత ధర్నా చేయడం గమనార్హం. అయితే ధర్నాలు, దీక్షలు ఇప్పుడు చేస్తున్న కవిత.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పూర్తిగా పరిష్కరించలేదన్న ప్రశ్నలకు కారణమవుతోంది.బీఆర్ఎస్ తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉంది. అయినా కవితప్రస్తుతం ప్రశ్నిస్తున్న ఒక్క పని కూడా చేయలేదు. అయినా నాడు కవిత ఈ అంశాలపై తండ్రిని, అన్నను ఎప్పుడూ ప్రశ్నించలేదు. సామరస్యంగా అయినా సమస్యల పరిష్కారానికి ప్రయత్నించలేదు. నాడు అధికారాన్ని అనుభవించి.. ప్రతిపక్షంలోకి రాగానే సమస్యలు గుర్తుకురావడమే ఆశ్చర్యంగా ఉంది.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కవిత చేస్తున్న ఆందోళనలు, బీఆర్ఎస్‌ను రాజకీయంగా బలోపేతం చేయడానికి, ప్రజల్లో కాంగ్రెస్ అసంతృప్తిని రేకెత్తించడానికి ఉద్దేశించినవిగా కనిపిస్తున్నాయి. అయితే, గతంలో అధికారంలో ఉన్నప్పుడు సాధించలేని కొన్ని సమస్యలపై ఇప్పుడు నిరసనలు చేయడం ప్రజల్లో సందేహాలను రేకెత్తిస్తోంది. ఉదాహరణకు, రైతులకు గిట్టుబాటు ధర కోసం ఇప్పుడు ఆందోళన చేస్తున్న కవిత, అధికారంలో ఉన్నప్పుడు ఈ సమస్యను ఎందుకు పూర్తిగా పరిష్కరించలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.కల్వకుంట్ల కవిత రాజకీయ జీవితం సాంస్కృతిక, సామాజిక, రాజకీయ కార్యక్రమాలతో నిండి ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతు బంధు, కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి పథకాలు రాష్ట్రానికి గుర్తింపు తెచ్చాయి. అయితే, కుటుంబ పాలన, స్థానిక సమస్యల పరిష్కారంలో లోపాలు, యువతకు ఉద్యోగ అవకాశాల కొరత వంటి విమర్శలు కూడా ఎదురయ్యాయి. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ చేస్తున్న ఆందోళనలు రాజకీయ వ్యూహంగా ఉపయోగపడినప్పటికీ, గత పాలనలోని లోటుపాట్లను ప్రజలు గుర్తు చేస్తున్నారు. కవిత ఈ విమర్శలను అధిగమించి, ప్రజల విశ్వాసాన్ని పొందడానికి ఆమె ఆందోళనలు ఆచరణీయ పరిష్కారాలతో కూడి ఉండాల్సిన అవసరం ఉంది.



# చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్..

**హైదరాబాద్ ఏప్రిల్ 9, ( వెలుతురు)**

తెలంగాణలో మిస్ వరల్డ్ సంబరం అంబరాన్నంటేలా జరగబోతోంది. మే నెల 7వతేదీ నుంచి 31వరకు మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన వివిధ ఈవెంట్లు తెలంగాణలో జరుగుతాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై తెలంగాణ టూరిజం సెక్రటరీ స్మిత సభర్వాల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా.. వెల్కమ్ డిన్నర్ కి సంబంధించిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. చౌమహల్లా ప్యాలెస్ లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు.హైదరాబాద్ లో జరగబోతున్న మిస్ వరల్డ్ పోటీలకు 120 దేశాలకు చెందిన మోడల్స్ హాజరవుతారు. వీరంతా మే నెల 6, 7 తేదీల్లో హైదరాబాద్ కి చేరుకుంటారు. ప్రారంభ కార్యక్రమంగా మే 7న చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, అనంతరం చౌమహల్లా ప్యాలెస్ వద్ద వెల్కమ్ డిన్నర్ ఏర్పాటు చేస్తున్నారు. 120 మంది మోడల్స్ తో పాటు ఆయా దేశాలకు చెందిన 400 మంది ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు ఈ కార్యక్రంలో పాల్గొంటారు. వెల్కమ్ డిన్నర్ కి సంబంధించి చౌమహల్లా ప్యాలెస్ లో ఏర్పాటు చేయాల్సిన కార్యక్రమాలపై తెలంగాణ టూరిజం సెక్రటరీ స్మిత సభర్వాల్, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్యాలెస్ లో ఫోటోషూట్ కోసం సీటింగ్ ఏర్పాట్లు, లైవ్ మ్యూజిక్ కాంటెస్ట్, సూఫీ మ్యూజిక్, ఖవ్వాలి మ్యూజిక్ షో ఇక్కడ నిర్వహించబోతున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా 20 నిమిషాలు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల తర్వాత వెల్కమ్ డిన్నర్ ఉంటుంది. తెలంగాణ రుచులతోపాటు, నిజాం



వంటకాలు, ఇతర భారతీయ రుచులు కూడా మెనూలో ఉంటాయి.ఇప్పటి వరకు భారత్ రెండుసార్లు మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చింది. మొదటిసారి బెంగళూరులో, తర్వాత ముంబైలో పోటీలు జరిగాయి. మూడోసారి ఈ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం విశేషం. 72వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. నెలరోజులపాటు భాగ్య నగరం సందడిగా మారుతుంది.లండన్ కి చెందిన మిస్ వరల్డ్ సంస?, తెలంగాణ పర్యాటక శాఖతో కలసి ఈ పోటీలు నిర్వహిస్తుంది. మొత్తం తెలంగాణలో 10వేదికలను గుర్తించగా 8 నుంచి 9 ఈవెంట్లు ఇక్కడ జరుగుతాయి. ప్రారంభ వేడుక, ముగింపు వేడుక హైదరాబాద్ నగరంలో జరుగుతాయి. మిగతా ఈవెంట్లు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో జరిపేందుకు పర్యాటక శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. పర్యాటకంగా తెలంగాణకు ఈ ఈవెంట్ మరింత పేరు తెస్తుందని అంటున్నారు అధికారులు. మిస్ వరల్డ్ పోటీలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అతిథులకు స్వాగతం, వారి బస ఏర్పాట్లు, ఈవెంట్ల కోఆర్డినేషన్, విదేశీ ప్రతినిధుల సౌకర్యాలు.. అన్నిట్లో అప్రమత్తంగా ఉంటున్నారు. నెలరోజుల ముందునుంచే ఏర్పాట్లకోసం కసరత్తులు ప్రారంభించారు.తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రం ఆతిథ్య రంగంలో మరింత ప్రాముఖ్యత సంతరించుకునే అవకాశం ఉండటంతో ప్రభుత్వం పోటీల నిర్వహణలో చొరవ తీసుకుంది. అటు అధికార యంత్రాంగం కూడా ఈ పోటీల నిర్వహణ కోసం టీమ్ లను ఏర్పాటు చేసింది. పర్యాటక శాఖతోపాటు జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ యంత్రాంగం కూడా పోటీల నిర్వహణకోసం సమాయత్తమైంది.

# కోతులు బాబోయ్... కోతులు

**కరీంనగర్, ఏప్రిల్ 9, ( వెలుతురు)**

శతమర్కటం.. పితలాటకం. కోతుల యుద్ధం మనుషుల చావుకొచ్చింది. మనుషులకే కాదు మర్కటాలకు కూడా గట్టు పంచాయితీలు ఉంటాయి. నేను లోకల్ అంటూ అవి యుద్ధానికి దిగితే ఎట్లా ఉంటాదో తెలుసా? ఓ చిన్న పల్లె సాక్షిగా వేలాది కోతులు సరిహద్దు పంచాయితీపై బస్తీ మే సవాల్ అన్నాయి. ఆ యుద్ధం చూసిన ఊరు గజగజలాడిపోయింది.రెండు దేశాల మధ్య యుద్ధం కాదు. రెండు ఏరియాల కోతులు ఒకే చోట చేరితే..ఊరంతా పీకి పందిరేశాయి. మా ఏరియాలోకి వస్తారా అంటూ కొత్త కోతులపై పాత కోతుల దండు దాడి చేసింది. ఈ ఈ వానర దండుయాత్రతో ఊరంతా రణరంగంగా మారింది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్కేపల్లిలో కోతులు యుద్ధానికి దిగాయి. వందలాది కోతులు.. రెండు గ్రూపులుగా సమరమే అంటూ నానా విధ్వంసం సృష్టించాయి.వెన్కేపల్లి గ్రామంలో ఆల్రెడీ ఓ పెద్ద కోతుల గుంపు తిష్ట వేసి గ్రామస్తులను కాల్చుకు తింటోంది. వాటికి పోటీగా, అక్కడి ఆహారంలో వాటా కోసం మరో పెద్ద కోతుల గుంపు వెన్కేపల్లికి వచ్చింది. దీంతో లోకల్ కోతులు, నాన్ లోకల్ కోతుల గుంపుల మధ్య అతి భీకర యుద్ధం జరిగింది. ఒకదాన్ని ఒకటి రక్కుతూ, కోరలతో పీకుతూ, మంకీస్ గ్యాంగ్ వార్‌కి తెర తీశాయి. అవి యుద్ధం చేయడమే కాకుండా, ఇళ్లల్లోని సామాన్లను చిందరవందర చేసి పారేశాయి.మనుషుల మధ్యే కాదు.. మర్కటాల మధ్య కూడా ప్రాంతీయ ద్వేషాలు.. లోకల్, నాన్ లోకల్ పంచాయితీలు ఎలా ఉంటాయో ఈ సంఘటనను చూస్తే అర్థమవుతుందంటున్నారు గ్రామస్తులు. ఒక ప్రాంతపు కోతులు మరో ప్రాంతంలో ఆకలి దాడి చేస్తే, అక్కడి కోతులు




తిరగబడ్డాయి. కోతుల గోల అండ్ భీకర యుద్ధం చూసి ఊరంతా షాక్ అయింది. వేలాది కోతులు రెండు వర్గాలుగా యుద్ధం చేస్తుంటే, గ్రామస్తులు తలుపులు వేసుకుని ఇళ్లలో దాక్కున్నారు. కాలు బయటపెట్టే సాహసం చేయలేకపోయారు. కనిపిస్తే కరిచివేత అన్నట్లు కోతులు పెట్టిన కర్ఫ్యూతో, 2 గంటల పాటు ఊరి జనం ఇళ్లకే పరిమితమయ్యారు. 2 గంటల వార్ తర్వాత, రెండు గ్రూపులు యుద్ధ విరమణ ప్రకటించడంతో ఊరంతా ఊపిరి పీల్చుకుంది. ఇలా వేలాది కోతులు ఊరి మీద పడితే, తాము ఊళ్లో ఉండే పరిస్థితి లేదని వాపోతున్నారు గ్రామస్తులు. కోతుల బెడదను తొలగించాలని అధికారులను వేడుకుంటున్నారు. ఈ మంకీస్ గ్యాంగ్ వార్ చూసి గ్రామస్తులు షాక్ తిన్నారు. ఇలాంటి సంఘటన రియల్ లైఫ్‌లోనే కాదు, సినిమాల్లో కూడా చూడలేదంటున్నారు. కోతుల దాడులను అరికట్టకపోతే, తామే ఊరు ఖాళీ చేసే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు.అడవిలో ఉండాల్సిన కోతులు ఇప్పుడు గ్రానైట్ క్వారీల కారణంగా కోతులు అడవిని వీడి జనసంచారంలో చేరిపోయాయి. అవి అడవిని విడిచి చాలా ఏళ్లు గడిచింది. ఇక్కడ హంగామా చేస్తున్నాయి. గ్రూపులుగా విడిపోయి గొడవలకు దిగుతున్నాయి. రెండు గ్రూపులు కలిస్తే కిష్కింధ కాండను తలపిస్తోంది. పొరపాటున వాటిని నివారించే ప్రయత్నం చేశామో వెంటపడి మరీ పరుగెత్తిస్తున్నాయి. ఈ సమస్య ప్రతీ గ్రామంలో ఉంది. రెండు గంటల పాటు రెండు వానర గ్రూపుల మధ్య జరిగిన బీకర యుద్ధం నడి రోడ్డుపై వామ్మో అంటూ జనం పరుగులు తీశారు.

# హరిత హారం వెనుక హరిత విధ్వంసం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ( వెలుతురు)**


హెచ్సియూ భూముల్లో అడవుల విధ్వంసం జరుగుతోందని, వన్య ప్రాణులను నిలువునా చంపేస్తున్నారు అంటూ బీఆర్ఎస్ నేతలు కన్నీళ్లు కారుస్తున్నారు. ఈ విషయంలో ముందు కాంగ్రెస్ కాస్త వెనుకబడినా.. ఇప్పుడు మాత్రం బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో జరిగిన విధ్వంశాలను బయటకు లాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి నియోపోలిస్ వరకు హరిత హారం నుంచి కాంక్రీట్ జంగిల్ వరకు గులాబీ పార్టీ పాలనలో జరిగిన కృత్రిమ ప్రకృతి విపత్తు అంటూ కౌంటర్ లు ఇవ్వడం మొదలుపెట్టింది.2014 మరియు 2023 మధ్య లక్షలాది చెట్లను నరికివేసినప్పుడు ఎందుకు మౌనంగా ఉంది గులాబి పార్టీ అంటూ కాంగ్రెస్ మండిపడుతోంది. హరిత హారం పేరుతో అడవులను పెంచాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం దాదాపు 10,000 కోట్ల రూపాయలు వెచ్చించినప్పటికీ, తెలంగాణలో లక్షలాది చెట్లను నాశనం చేసినట్టు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. 2015 నుండి 2022 వరకు, కేసీఆర్ సర్కార్ హరితహారం కార్యక్రమం కింద 219 కోట్ల మొక్కలు నాటినట్లు పేర్కొంది, దీని కోసం 9,777 కోట్లు ఖర్చు చేసారు.ఇందులో గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి 5,006.82 కోట్లు, అటవీ శాఖ నుంచి 2,567.12 కోట్లు కేటాయించారు. నాటిన మొక్కలు 85% బతికాయని కేసీఆర్ అప్పట్లో వ్యాఖ్యానించారు. మరి అదే నిజమైతే, తెలంగాణ అటవీ విస్తీర్ణం 21,591 చ.కి.మీ 2014కు నుంచి 2021 నాటికి 21,213 చ.కి.మీకి ఎందుకు తగ్గిపోయింది? అంటూ కాంగ్రెస్ నిలదీస్తోంది. 2014 మరియు 2024 మధ్య, బీఆర్ఎస్ పాలనలో 11,422.47 హెక్టార్ల అటవీ భూమి అధికారికంగా.. అటవీయేతర ప్రయోజనాల కోసం ఉపయోగించింది అప్పటి ప్రభుత్వం.అటవీ సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించి 2016 నుంచి 2019 మధ్య కాలంలోనే 12,12,753 చెట్లను నరికినట్టు కాంగ్రెస్ సాక్ష్యాలతో సహా బయటపెడుతోంది. ఇక కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం లక్ష కోట్లు ఖర్చు చేయగా.. ఇప్పుడు అది ఏ ఉపయోగం లేకుండా ఆగిపోయింది. ఇక ఇందుకోసం 8,000 ఎకరాల్లో అడవిని నరికేశారు. 2016-2019 మధ్య కాలంలో మొత్తం 12 లక్షలకు పైగా చెట్లను గులాబి పార్టీ హయాంలో నరికినట్టు కాంగ్రెస్ మండిపడుతోంది. అప్పుడు లేని పర్యావరణ ప్రేమ, అప్పుడు



లేని అడవి జంతువులపై ప్రేమ ఇప్పుడు ఎందుకు అంటూ నిలదీస్తోంది.అటవీ సంరక్షణ చట్టం ఉల్లంఘనలను కేంద్ర ప్రభుత్వం సైతం ధృవీకరించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఆగిపోయినా సరే ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క నిరసన కార్యక్రమం చేపట్టలేదు. దాని గురించి మీడియాతో మాట్లాడింది లేదు.. సోషల్ మీడియాలో పోస్ట్ లు లేవు. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. నిజంగా పర్యావరణవేత్తలమా లేక ట్రెండింగ్ లో ఉన్న అంశాల విషయంలోనా ఆలోచించుకోవాలని సూచిస్తోంది.2014 నుంచి 2023 మధ్య కాలంలో 4,28,437 ఎకరాల భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం విక్రయించింది. కోకాపేట్‌లో, 1 ఎకరం 100 కోట్ల వరకు విక్రయించారు. TSIIC మరియు HMDA ఆధ్వర్యంలో వేలం ద్వారా 31,000 కోట్ల రూపాయలను ఆర్జించారు. అప్పుడు పర్యావరణంపై ఈ స్థాయిలో హడావుడి జరగలేదు. పర్యావరణంపై ప్రేమ తప్పు లేదని.. మనం చేసింది ఒప్పు.. రాజకీయ ప్రత్యర్థులు చేసేది తప్పు అని మాట్లాడటం దారుణం అనే అభిప్రాయం సోషల్ మీడియాలో వినపడుతోంది. ఏఐ వీడియోలు, ఫోటోలతో మాజీ ఐటి మంత్రి చేసే పోస్ట్ లు ఆపాలని.. కల్వకుంట్ల కుటుంబ బినామీలు హైదరాబాద్ లో కట్టిన భవనాలలో కొండలను తొలగించిన విషయాన్ని గుర్తు పెట్టుకుని మాట్లాడితే మంచిదని కాంగ్రెస్ హెచ్చరిస్తోంది.

## జగన్ బాటలో..నోరు పారేసుకున్న కారుమూరు

- అడ్డంగా నరికేస్తామంటూ హెచ్చరికలు
- మాజీమంత్రి తీరుపై మండిపడ్డ టిడిపి నేతలు



**ఏలూరు, ఏప్రిల్9( వెలుతురు):**
వైకాపా అధినేత జగన్ పోలీసుల బట్టలూడదీస్తానిన హెచ్చరిస్తే..గతంలో ఆయన మంత్రివర్గంలో మంత్రి అయిన ఓ మంత్రి మరో అడుగు ముందుకు వేశారు. అవతలి వారిని, ఇవతలి వారిని లాక్కచ్చి కొడతానంటూ మాజీమంత్రికారుమూరి నాగేశ్వర రావు హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులపై వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీ ఇంటికి ఎంత దూరమో.. మా ఇంటికి కూడా అంతే దూరం' అంటూ బెదిరింపు దోరణిలో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చాక గుంటూరుకు ఇటు వైపువాళ్లను లాక్కొచ్చి కొడతామని.. అటు వైపువాళ్లను నరికి పారేస్తాంటూ కారుమూరి పరుస పదజాలంతో మాట్లాడారు. ఏలూరులో జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కారుమూరి ఈ వ్యాఖ్యలు చేశారు. 'మన ప్రభుత్వమే వస్తుందని.. 'గుంటూరు అవతలవారిని నరికేస్తాం... ఇవతలవారిని ఇంటి నుంచి లాక్కొచ్చి కొడతాం' అని వ్యాఖ్యలు చేశారు. నేను పెద్దిరెడ్డి దగ్గరకు వెళ్లాను. కూటమి ప్రభుత్వం ఏం చేసినా కూడా దాన్ని దాటి ప్రజలు మనకు ఓటేస్తారని చెప్పాను. తెలుగుదేశం నాయకులు సైతం మాపై కక్ష పెట్టుకోవద్దు అని అంటున్నారు. అది మాత్రం జరగదు. గుంటూరు ఇవతల వాళ్లను ఇంట్లో నుంచి లాగి కొడతారు. గుంటూరు అవతలి నుంచి నరికిపారేస్తారు. మనింటికి వాళ్ల ఇల్లు ఎంత దూరమో వాళ్లింటికి మనిల్లు అంతే దూరం' అంటూ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కారుమూరి చేసిన వ్యాఖ్యల వీడియోను టీడీపీ అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. జగన్ అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పినా, వైసీపీ నేతల్లో అధికార మదం ఇంకా దిగలేదని.. వారి నేర ప్రవృతికి ఇదే నిదర్శనమని అన్నారు. గతంలో ఆయన మంత్రిగా ఉన్న సమయంలో రైతుల్ని ఎర్రిపప్పులు అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన కారుమూరి ఎర్రిపప్ప అంటే బుజ్జికన్నా అని అర్థంగా చెప్పారు. దాంతో అందరూ ఆయనను ఎర్రిపప్పా అని సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. కాగా కారుమూరి నాగేశ్వరరావు చేసిన హెచ్చరికలపై టీడీపీ నేతలు మండి పడుతున్నారు. బహిరంగంగా చంపుతామని హెచ్చరిస్తున్న ఆయనపై కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ నేతలను రెచ్చగొట్టి.. హింస జరిగేలా చేసి..రాష్ట్రంలో పరిస్థితులు దిగజార్చేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయని టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మామిడి రైతులపై ట్రంప్ ఎఫెక్ట్



**హైదరాబాద్, ఏప్రిల్9( వెలుతురు):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా అనేక దేశాలపై అదనపు సుంకాలు విధించడంతో పలు రంగాలు నష్టాలను చవిచూస్తున్నాయి. భారత్‌పై ట్రంప్ 26 శాతం సుంకాలు విధించడంతో మనదేశంలోని పలు రంగాలపై ప్రతికూల ప్రభావం పడింది.ఆక్వా రంగంలో రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఏపీలో రొయ్యల ధర అమాంతం పడిపోయింది. ఇప్పుడు ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం మన దేశ మామిడి పండ్లపై కూడా పడుతోంది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వాటి ఉత్పత్తిలో ముందు వరసలో ఉన్నాయి.ఇరు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 7,64,500 ఎకరాల్లో సాగవుతోంది. వాటిల్లో ప్రతి ఏడాది 24,45,900 టన్నుల మామిడి పండ్ల దిగుమతి వస్తోంది. భారత్ నుంచి అమెరికాకు ప్రతి ఏడాది 45 వేల టన్నుల మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచే 10 – 15 వేల టన్నుల మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి.వాటి విలువ రూ.150 – రూ.230 కోట్ల మధ్య ఉంటుంది. టారిఫ్‌ల పెంపుతో వాటి విలువ ఇప్పుడు మరో రూ.50 కోట్లకు పైగా పెరగవచ్చు. దీంతో అమెరికాలో భారత మామిడి పండ్ల ధరలు పెరిగి, డిమాండ్ తగ్గే ముప్పు ఉంటుంది.గతంలో అమెరికాకు మామిడి ఎగుమతులపై టారిఫ్ 0 – 5 శాతం మధ్య కొనసాగింది. ఇప్పుడు దాన్ని 22 శాతం నుంచి 26 శాతం వరకు పెంచారు. ట్రంప్ టారిఫ్‌లతో అమెరికాకు మనమామిడి పండ్ల ఎగుమతి ధరలు పెరుగుతున్నప్పటికీ రైతులకు ఆ లాభాలు అందే అవకాశాలు అంతంత మాత్రమే.ఎందుకంటే ఎగుమతిదారులు టారిఫ్‌ల భారాన్ని రైతులపై వేయవచ్చు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోవచ్చు. అమెరికాకు ఈక్వెడార్‌తో పాటు ఇండొనేషియా తక్కువ ధరకు మామిడిని ఎగుమతి చేస్తే మన దేశ రైతులు యూఎస్‌లో మార్కెట్‌ను కోల్పోయే అవకాశం ఉంది.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**విశాఖపట్నం ఏప్రిల్9( వెలుతురు):**
విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్ లో మృతి చెందిన బాలుడి బంధువులను ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కే.జి.ఎచ్ మార్చురీ వద్ద పరామర్శించారు. అనంతరం పి.విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ .. పోర్ట్ స్టేడియం విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్ లో బాలుడు మృతి చెందిన దుర్ఘట న పై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా వాటర్ వరల్డ్ యాజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు వచ్చాయని గుర్తు చేశా రు. పై ప్రమాద విషయాన్ని పోర్ట్ చైర్మన్ దృష్టికి, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. గతంలో పోర్ట్ స్టేడియం లో గొ కార్టింగ్ కి వెళ్లిన తన మన మరాలు రోడ్డు పై పడిపోయి 45 రోజులు మంచంపై ఉందని గుర్తు చేసుకున్నారు.అయితే ఆ సమ యంలో తమవారిదే పొరపాటు అయి ఉండొచ్చని తాను ఆ ఘటన పై స్పందించలేదని చెప్పారు. వాటర్ వరల్డ్ యాజమాన్యం సేఫ్టీ ప్రికాషన్స్ అద్భుతముగా చేస్తు న్నామని తనతో చెప్పారనీ, చిన్న పిల్లలు ఆనందంగా ఆడుకోవడానికి వస్తున్నారనీ, సరియైన జాగ్రత్తలు తీసుకోవాలని తాను వారితో చెప్పానని వివరించారు. నిన్న జరిగిన ఈ ఘటనలో చిన్నారి చావుకు కారణం విశ్వనాద్ స్పోర్ట్స్ క్లబ్ యాజమాన్యం మాత్రమేనన్నా రు. ప్రమాదం జరిగిన వెంటనే మోటార్ సైకిల్ పై ట్రీట్మెంట్ నిమిత్తం తీసుకువెళ్లగా, అప్పటికే బాలుడు మృతి చెందాడని తెలిపారు. భద్ర తా ప్రమాణాలు పాటించకుం డా, డబ్బు ఆపేక్ష లక్ష్యంగా యాజమా న్యం పసిపిల్లల ప్రాణాలతో ఆడు కుంటుందని ఎమ్మెల్యే ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వేసవి సెలవుల్లో పిల్లలు మఅత్యుకూపంలోకి వెళ్లే అవకాశం ఉందని కలెక్టర్కి వెంటనే విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ మూసివేయాలని కోరారు. ఇలాంటి భద్రతా ప్రమాణాలు లేని స్పోర్ట్స్ క్లబ్ లపై రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉందని అన్నారు. పర్యాటకుల ఆనందానికి ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించని స్పోర్ట్స్ క్లబ్ లకు వెళితే మృత్యు కుహరంలోకి వెళ్లినట్లేనని, పర్యాటకులు ప్రమాదాలకు గురి కావద్దని ఎమ్మెల్యే సూచించారు.

# పవర్ కోసం ప్రతిపక్షాల పాకులాట




**హైదరాబాద్, ఏప్రిల్9( వెలుతురు):**
మూడేళ్లలో మేము పవర్ లోకి వస్తున్నాం... మీ సంగతి చూస్తాం.ఇంకా నాలుగేళ్ల టైముంది. కళ్ళు మూసుకుంటే నాలుగు రోజులుగా అయిపోతాయి. మళ్లీ మనమే పవర్ లోకి వస్తాం .రాగానే వాళ్ల తోలు తీస్తాను. ఆ ఎస్ ఐ పేరు గుర్తుపెట్టుకోండి... మూడేళ్ల తర్వాత పవర్ లోకి రాగానే వాడిచేత మీకు సెల్యూట్ కొట్టిస్తా. తెలుగు రాష్ట్రాల్లో ఈమధ్య బాగా వినబడుతున్న మాటలు ఇవి. ఏపీలో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, తెలంగాణలో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిరోజు.. మూడేళ్లలో పవర్ లోకి వచ్చేస్తాం.. రాగానే వాడి సంగతి చూస్తాం. వీడి సంగతి చూస్తాం... అది కట్టిస్తాం... ఇది పడగొడతాం అని హామీల మీద హామీలు ఇస్తున్నారు.లో ఉన్న ఈ పొలిటికల్ పార్టీల ధైర్యం ఏమిటో మాత్రం ఎవరికి అర్థం కావటం లేదు. క్యాడర్ లో ఊపు తేవడానికి , నమ్మకం కలిగించడానికి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారా...? లేక అధికార పక్షాన్ని బెదిరించి.. మైండ్ గేమ్ ఆడుతున్నారా అన్నది జనంలో చర్చ నడుస్తోంది. ప్రభుత్వం చేస్తున్నది తప్పు అని అనిపిస్తే ఆ తప్పుని అడ్డుకోవడంపై విపక్షాలు దృష్టిపెట్టడం లేదు. మేము వచ్చాక అలా చేస్తాం, ఇలా చేస్తాం అని బెదిరించడం చాలా మామూలు అయిపోయింది. అంటే మూడేళ్ల తర్వాత వీళ్ళు వస్తే మళ్లీ పగ ప్రతీకారాలు కొనసాగుతాయన్నమాట. ఇప్పుడు వాళ్ళని వీళ్ళు వేసుకుంటారు. మూడేళ్ల తర్వాత వీళ్లు వాళ్ళని వెంటాడుతారు అన్నమాట. అధికారంలోకి వస్తే ఏం చేస్తాము అన్నది పొలిటికల్ పార్టీలేవి చెప్పడం లేదు. రెండు మూడేళ్లలో మేము అధికారంలోకి వచ్చేస్తున్నాం... మేము ఆ బుక్ లో రాస్తున్నాం.. ఈ బుక్ లో రాస్తున్నాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. తెలుగు రాష్ట్రాల్లో అన్ని పార్టీలు ఒక రౌడీ గ్యాంగ్ లాగా తయారయ్యాయి. అసలు వీళ్ళ కాన్ఫిడెన్స్ ఏంటో అర్థం కాదు. ముఖ్యంగా ఏపీలో జగన్మోహన్ రెడ్డి కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఆరో నెలలోనే మొదలుపెట్టేశారు. నెక్స్ట్ మనమే అధికారంలోకి వస్తాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. ప్రభుత్వానికి నాలుగున్నర సంవత్సరాలు సమయం ఉంది.164 సీట్లు ప్రభుత్వానికి ఉన్నాయి. నాలుగేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఎవడికి ఏం తెలియదు. అసలు ప్రభుత్వం ఏర్పడి ఇంకా 9 నెలలు మాత్రమే అయింది. కానీ జగన్మోహన్ రెడ్డి అప్పుడే తొందరపడి పోతున్నాడు. నాలుగేళ్లలో మనమే అధికారంలోకి రాబోతున్నాం రాగానే... వాడి సంగతి తెలుస్తాను. వీడి సంగతి తెలుస్తాను అని హెచ్చరిస్తూ ఉంటారు. ముఖ్యంగా పోలీసు అధికారుల్ని... జగన్ పేరు పెట్టి మరి ఓ వీధి రౌడీలాగా వార్నింగ్ ఇస్తూ ఉంటారు.సరే కార్యకర్తలకు కాన్ఫిడెన్స్ నింపడానికి... మనం అధికారంలోకి రాబో తున్నాం ధైర్యంగా ఉండండి అని చెప్పొచ్చు. ప్రభుత్వాలు నిన్ను గాక మొన్న ఏర్పడ్డాయి. ఆంధ్రాలో గట్టిగా 9 నెలలు అవ్వలేదు.అప్పుడే జగన్ 2029 లో నేనే అధికారంలోకి వస్తానని పాట పాడుతున్నాడు. ఆయనకు అంత తొందర ఎందుకో అర్థం కాదు. అధికారం లేకుండా ఉండలేకపోతున్నాడా? లేక నిత్యం భ్రమల్లో... ఊహల్లో బతుకుతున్నాడఇక తెలంగాణ విషయానికొస్తే బి ఆర్ ఎస్ అంచనాలకు మించి ఓవర్ కాన్ఫిడెన్స్ తో ఉంది. రేవంత్ సర్కార్ వైఫల్యాలు బి ఆర్ఎస్ లో విశ్వాసాన్ని నింపేసేయ్. ఎన్నికలకు ఇంకా మూడున్నర సంవత్సరాలు సమయం ఉంది. అయినా సరే టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగలేకపోతున్నారు. అసలు రేపు ఎల్లుండో ఎన్నికలు జరిగిపోతున్నట్టతాము తిరిగి అధికార పీఠాల్లోకి ఎక్కి కూర్చున్నట్లు వీరావేశంతో హామీలు ఇస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పక్కనే ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ స్థలం విషయంలో ఒక పక్క ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం వివరణ ఇస్తుండగానే... మరోవైపు కేటీఆర్ కాంగ్రెస్ ఏం మాయ చేసినా సరే అక్కడ స్థలాలు ఎవరూ కొనవద్దు. మరో మూడు ఏళ్లలో మన ప్రభుత్వం వస్తుంది.. ఆ స్థలాన్ని మేము వెనక్కి లాక్కుంటాం అని హెచ్చరిస్తారు. ఆ 400 ఎకరాలు మన ప్రభుత్వం ఎకో పార్క్ కట్టిస్తుంది హామీ ఇచ్చేస్తారు.ఆంధ్ర, తెలంగాణలో ప్రతిపక్షాల ధైర్యం ఏంటో అర్థం కాదు. గతంలో ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాము. ముఖ్యమంత్రిగా పని చేసాము. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాము. మర్యాదగా మాట్లాడాలి. అన్న ధ్యాస ఏ కొసానా లేదు. మూడేళ్లలో మేం అధికారంలోకి వస్తున్నాము. నాలుగేళ్లలో పవర్ లోకి వస్తాము. వాడి తోలు తీస్తాము. వీడు తోలు తీస్తాము. ఆ బుక్ లో రాస్తున్నాము.. ఈ బుక్ లో ఎక్కిస్తున్నాము... ఇలా ఒక రౌడీ గ్యాంగులు తరహాలో హెచ్చరికలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతీకార రాజకీయాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.దీనికి ప్రధాన కారణం ఏ ప్రభుత్వమైనా ఐదేళ్లకు మించి ఉన్నదని అందరి నమ్మకం. వేలకోట్ల రూపాయలు అప్పులు తెచ్చి.. సంక్షేమ పథకాల అమలు చేస్తూ... ప్రజలను సంతృప్తి పరచలేక కచ్చితంగా ప్రభుత్వంలో ఉన్న ఏ పార్టీ అయినా ఐదేళ్లకు ఓడిపోక తప్పదు.. కనుక జనం ప్రచారం న్యాయంగా మళ్ళీ మనకే ఓటేస్తారు... అందుకే అధికారం మనకు వచ్చేస్తుంది అనే ధీమాతో.. ఓడిపోయిన మరుసటి రోజు నుంచే సిగ్గు ఎగ్గు లేకుండా మళ్లీ మనదే అధికారం అని చెప్పు తిరుగుతుంటాయి పార్టీలు. అసలు ప్రజలు మనల్ని ఎందుకు ఓడించారు... వేరే వాళ్ళకి ఎందుకు అధికారమిచ్చారు అన్న సమీక్ష చేయకుండా.. ప్రభుత్వాలకి ఏడాది నిండకుండానే వీళు వచ్చే ఎన్నికల్లో మాదే అధికారంలో ప్రకటనలు చేస్తున్నారు.

# దుర్గ గుడి భూముల లీజు పొడిగింపు వివాదం



**విజయవాడ, ఏప్రిల్9( వెలుతురు):**
విజయవాడలో దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నగరంలో ప్రధాన ప్రాంతంలో ఉన్న దాదాపు ఆరు ఎకరాల భూమి లీజు గడువు ముగియడంతో దానిని మరోమారు పొడిగించాలని లీజుదారుల నుంచి దేవాదాయ శాఖకు ప్రతిపాదనలు అందాయి. అందులో విద్యా సంస్థను నిర్వహిస్తుండటంతో మరో 50ఏళ్లకు పొడిగించాలని లీజుదారులు అభ్యర్థించారు.యాభై ఏళ్లుగా నామమాత్రపు ధరతో ఉన్న దుర్గగుడి భూముల లీజును మరోసారి పొడిగించే ప్రతిపాదనకు దేవాదాయ శాఖ అభ్యంతం తెలిపింది. యాభై ఏళ్ల తర్వాత ఏమి జరుగుతుందో తెలియనందున ఆలయ భూముల్ని సమగ్రంగా సర్వే చేసి వాటిని శాశ్వతంగగా డిజిటల్ రూపంలో భద్రపరిచిన తర్వాత లీజు ప్రక్రియపై ముందుకు వెళ్లాలని ఆ శాఖ కార్యదర్శి కమిషనర్‌ను ఆదేశించారు.ఈ క్రమంలో దుర్గామల్లేశ్వర దేవస్థానం నుంచి పటమట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో 5.90ఎకరాల భూమిని లీజుకు తీసుకున్న సిద్ధార్థ అకాడమీ పేరిట లీజు పొడిగించాలని కొందరు అధికారులు, దేవాదాయ శాఖ అధికారులకు మౌఖికంగా సూచించారు. దీంతో లీజు ప్రతిపాదనల్ని దేవాదాయ శాఖ ఎస్టేట్స్, లీగల్ విభాగం క్షుణ్ణంగా అధ్యయనం చేసి చట్ట ప్రకారం సాధ్యం కాదని తేల్చేశారు.యాభై ఏళ్లకు లీజును పొడిగిస్తే అప్పటికి 100ఏళ్లు పూర్తై యాజమాన్య హక్కుల్ని దేవస్థానం కోల్పోతుందని, భూమికి శాశ్వత యజమానులుగా లీజుదారులు అవుతారని అభ్యంతరం అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో లీజు గడువును తగ్గించి పొడిగించాలనే సూచనలు అందాయి. ఇప్పటికే 50ఏళ్లుగా లీజు కొనసాగుతుండటంతో లీజు పొడిగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కొత్తగా మరోసారి లీజుకు తీసుకోవాల్సిందేనని కొత్త చట్టం ప్రకారమే లీజులు పొందాలని వివరణ ఇచ్చారు.ఈ క్రమంలో దుర్గగుడి భూముల లీజు వ్యవహారాన్ని కొలిక్కి తెచ్చే బాధ్యత ఇంఛార్జి హోదాలో ఉన్న ఉన్నతాధికారి భుజాలకు ఎత్తుకున్నారు. పెద్దసార్ ఆదేశించారంటూ అధికారులపై ఒత్తిడి చేయడంతో లిఖిత పూర్వకంగా వివరణలు, ప్రతిపాదనలు ఇస్తే తప్ప తాము ముందుకు వెళ్లలేమని ఆ శాఖ అధికారులు తేల్చేశారు.దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం అవుతుండటంతో దేవాదాయ శాఖ చట్టానికి కొన్నేళ్ల క్రితం మార్పులు చేశారు. పాత చట్టంలో లీజుల పొడిగింపుకు అవకాశం ఉన్నా కొత్త చట్టంలో లీజు పొడిగింపు క్లాజ్ లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.ఇప్పటికే 50ఏళ్లుగా లీజులో ఉన్న భూముల్ని మరోసారి పొడిగించడం ప్రస్తుత చట్టం ప్రకారం సాధ్యం కాదని, అలా చేయాలంటే క్యాబినెట్ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు. దేవాదాయ శాఖ భూమి లీజు వ్యవహారంపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తులో తలెత్తే న్యాయవివాదాలకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని భయపడుతున్నారు.ఈ క్రమంలో భూముల లీజు పొడిగించాలని ఒత్తిడి చేస్తోన్న అధికారినే ఏ నిబంధన ప్రకారం భూముల లీజు పొడిగించాలో ప్రతిపాదనలు పంపాలని దేవాదాయ శాఖ అధికారులు సూచించారు. వ్యవసాయేతర భూమిగా వినియోగంలో ఉన్న భూమి విలువను ఎలా నిర్ణయిస్తారో కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు లక్షన్నర లీజుగా చెల్లిస్తుండగా 10శాతం పెంపుదలతో లక్షా 65వేలుగా లీజు ధరను ప్రతిపాదించడంపై కూడా దేవాదాయశాఖ అభ్యంతరం చెబుతోంది.చట్టంలో లీజు పొడిగింపు అవకాశం లేనపుడు బహిరంగంగా జరిగే ప్రక్రియలోనే భూమి ధరను ఖరారు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందులో విద్యా సంస్థలు కొనసాగుతుండటంతో బహిరంగ వేలాన్ని మినహాయించినా అద్దె ధరను మాత్రం మార్కెట్ ధరలకు అనుగుణంగా ఖరారు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.దేవాదాయ శాఖలో ఇన్‌ఛార్జి హోదాలో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి లీజు వ్యవహారంలో లిఖిత పూర్వకంగా ప్రతిపాదనలు చేయకుండా ముందుకు వెళ్లలేమని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. మౌఖిక ఆదేశాలను పాటిస్తే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు తాము బాధ్యత వహించాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.ఈ క్రమంలో గతంలో కానూరు గ్రామ పంచాయితీ పరిధిలో సర్వే నంబర్ 282లో ఉన్న 12.39 ఎకరాల భూమిని యాభై ఏళ్లకు లీజుకు ఇవ్వాలని సిద్ధార్థ అకాడమీ 1997 నవంబర్ 25న కోరగా అప్పట్లో దేవాదాయ శాఖ లేవనెత్తిన అభ్యంతరాలను గుర్తు చేస్తున్నారు. దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో మార్కెట్ ధరలకు అనుగుణంగా లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు.1975–76 భూమిని లీజుకు ఇచ్చినపుడు మొదటి ఆరేళ్లు రూ.6వేల రుపాయలకు లీజుకు ఇచ్చారని తర్వాతి పదేళ్లకు రూ.7వేలు, తర్వాత పదేళ్లు 8వేలు, ఆ తర్వాత పదేళ్లు 9వేలు, ఆ తర్వాత పదేళ్లు 10వేలు, ఆ తర్వాత ఏడాదికి రూ.11వేల అద్దె చెల్లించేలా యాభై ఏళ్లకు లీజుకు ఇచ్చినట్టు పేర్కొన్నారు.ప్రస్తుతం సిద్ధార్థ అకాడమీ పేరిట విజయవాడ మొగల్రాజపురంలోని సర్వే నంబర్ 76లో 8.22 ఎకరాలు, పటమట సర్వే నంబర్ 17లో 5.98ఎకరాల భూమి సిద్ధార్థ అకాడమీ పేరిట లీజుకు ఉంది. 2012 నాటికి ఈ భూముల విలువ రూ.176.34కోట్లుగా నిర్ధారించారు. పటమటలో ఉన్న భూమికి గజం రూ.30వేల చొప్పున రూ.86.83కోట్లు, మొగల్రాజపురంలో ఉన్న భూమికి గజం రూ.22,500 చొప్పున రూ.89.51కోట్లుగా ఉంది. ప్రస్తుతం ఈ విలువలు భారీగా పెరిగాయని దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం ఆ స్థాయిలో లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

## బిగ్ బాస్ లోకి అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్

**రాజమండ్రి ఏప్రిల్9( వెలుతురు):**
ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది ఎవరైనా ఉన్నారంటే వారు 'అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్. గత 4 రోజులుగా నెట్టింట వీరిపై ఒకటే ట్రోల్స్, మీమ్స్, క్లారిఫికేషన్ వీడియోస్, అపాలజీ వీడియోస్. చాలాకాలంగా పచ్చళ్ల వ్యాపారం చేస్తూ కస్టమర్లపై బూతులతో విరుచుకుపడడంతో వీరిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.ఈ క్రమంలోనే ప్రముఖ రియాల్టీ షో బిగ్ బాస్‌లో అలేఖ్య చిట్టి, రమ్య సిస్టర్స్‌లో ఒకరికి ఛాన్స్ వస్తుందనే వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. బిగ్ బాస్ సీజన్ 9 త్వరలోనే కొన్ని నెలల్లో ప్రారంభం కానుండగా.. ప్రతి ఏడాది ఆగస్ట్ లేదా సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో ప్రోగ్రాం స్టార్ట్ అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో కంటెస్టెంట్స్ ఎంపిక, బిగ్ బాస్ ప్రోగ్రాం నిర్వహణ పనుల్లో టీం ఉంది.సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయిన వారికి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు బిగ్ బాస్ ఎంట్రీ దక్కుతుంది. 'అలేఖ్య చిట్టి పికిల్స్' సిస్టర్స్‌పై మీమ్స్, ట్రోల్స్, వీడియోలు 100 మిలియన్స్‌కు పైగా వీడియోలతో ట్రెండ్ అవుతున్నాయి. దీంతో వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కే అవకాశాలున్నాయని నెట్టింట చర్చ సాగుతోంది. అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్‌లో రీల్స్‌తో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న రమ్యకే ఆ అవకాశం ఉంటుందని నెటిజన్లు అంటున్నారు. మోడ్రన్ డ్రెస్సుల్లో ఆమె చేసిన రీల్స్ ఎక్కువగా ట్రెండ్ అవుతుండడమే దీనికి కారణమని చెబుతున్నారు. తాజాగా, జియో హాట్ స్టార్‌లో పికిల్స్‌కు సంబంధించి ఓ సీన్ సైతం వీడియో షేర్ చేశారు. ప్రభాస్ ఛత్రపతి సినిమాలో ఓ సీన్‌తో వీడియో విడుదల చేశారు. తాజాగా, బిగ్ బాస్ ఆదిరెడ్డి కూడా తన యూట్యూబ్ ఛానల్‌లో ఈ విషయంపై స్పందించారు. వారిలో ఒకరు బిగ్ బాస్‌కు రావొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు.రాజమండ్రి వేదికగా 'అలేఖ్య చిట్టి పికిల్స్' పేరుతో ముగ్గురు సిస్టర్స్ సుమ కంచర్ల, అలేఖ్య చిట్టి, రమ్య మోక్ష కంచర్ల (రమ్య గోపాలకృష్ణ) సోషల్ మీడియాలో పచ్చళ్ల వ్యాపారం ప్రారంభించారు. వీరిలో రమ్య తన రీల్స్‌తోనూ పాపులర్ అయ్యారు. తమను విమర్శించిన వారిపై అంతేస్థాయిలో సోషల్ మీడియా వేదికగా విమర్శలు సైతం చేశారు. అయితే పచ్చళ్లు ధరలు ఎక్కువగా ఉన్నాయంటూ ప్రశ్నించిన ఓ నెటిజన్‌కు వీరిలో ఓ అమ్మాయి అలేఖ్య అతనిపై బూతులతో విరుచుకుపడింది. ఈ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇదే సమయంలో తమను కూడా అలానే తిట్టిందంటూ మరిన్ని ఆడియో లీక్స్ బయటకు వచ్చాయి. దీంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లపై ట్రోలింగ్ మొదలైంది. అంత దారుణంగా ఎలా తిడతారంటూ కామెంట్స్ చేశారు. దీంతో అక్క సుమ కంచర్ల తాను తిట్టలేదని.. తనను ట్రోల్ చెయ్యొద్దని వేడుకున్నారు. ఈ అంశంపై వివాదం ముదురుతున్న వేళ అలేఖ్య ఎట్టకేలకు సారీ చెప్పారు. తాను తప్పు చేశానని.. తాను ఎవరినైతే ఇప్పటివరకూ తిట్టానో వాళ్లందర్నీ సారీ అడుగుతున్నట్లు ఓ వీడియో విడుదల చేశారు. దీంతో ఈ వివాదానికి ఎండ్ కార్డ్ పడినట్లే అనిపిస్తున్నప్పటికీ ఇంకా ట్రోలింగ్ మాత్రం కొనసాగుతూనే ఉంది.



# అవును.. నేను ఒంటరినే : తమన్నా



అవును...నేను ఒంటరినే అంటూ తమన్నా భాటియా సమాధానం ఇచ్చారు. తమన్నా వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే.. ఆమె కొన్నేళ్లుగా విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. వారిద్దరూ విడిపోయినట్లు కొన్ని రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. పెళ్లి విషయంలో ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయని, అందుకే బ్రేకప్ చెప్పేసుకున్నారని తెలుస్తోంది. అయితే, బ్రేకప్ వార్తలపై వీరిద్దరూ ఎక్కడా స్పందించలేదు. 'ఓదెల 2'ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా పాల్గొంటున్న నటి తమన్నా తాజాగా జరిగిన ట్రైలర్ విడుదల ప్రచార కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. నటుడు విజయ్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ ఒక విలేకరి తమన్నాను ప్రశ్నించారు.దీనిపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. విజయ్ అనే పేరు ఎక్కడా రాకుండా ఆమె బదులిచ్చారు. కార్యక్రమంలో తమన్నాతోపాటు- ఇతర చిత్రబృందం పాల్గొంది. ఇందులోభాగంగా ఓ విలేకరి.. మంత్రాలు, తంత్రాలు ఉపయోగించి మీరు ఎవరిమీదనైనా విజయం సాధించాలను కుంటున్నారా అని ప్రశ్నించింది. దీనిపై తమన్నా స్పందిస్తూ.. 'మంత్ర, తంత్రాలతో అలాంటిది జరుగుతుందంటే నేను నమ్మను. ఒకవేళ అదే నిజమైతే మీపై ప్రయోగిస్తా. అందరూ నా చేతుల్లో ఉంటారు. నేను చెప్పింది వింటారు. నేను ఏం చెబితే అదే రాసుకుంటారని ఆమె సరదాగా బదులిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. విజయ్ పేరు ప్రస్తావించ దానికి కూడా తమన్నా ఇష్టం చూపించడం లేదని మాట్లాడుకుంటున్నారు. అనంతరం ఆధ్యాత్మిక జీవనం గురించి తమన్నా మాట్లాడారు. 'జీవితంలో మనకు ఎలాంటి సమస్య ఎదురైనా దానినుంచి బయట పడేందుకు ఎదుటి వ్యక్తులపై ఆధారపడాలను కుంటాం. ఆవిధంగా వారి నుంచి మనం సపోర్ట్ పొందుతాం. కానీ, ఆధ్యాత్మిక ప్రయాణంలో నేను ఒక విషయాన్ని నేర్చుకున్నా. ఆనందం లేదా బాధ మన చేతుల్లోనే ఉండాలి. ప్రశ్న ఏదైనా లోతుగా ఆలోచిస్తే సమాధానం కూడా దొరుకుతుందని ఆమె చెప్పారు. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్'కు కొనసాగింపుగా 'ఓదెల 2' సిద్ధమైంది. ఇందులో తమన్నా శివశక్తిగా కనిపించనున్నారు. అశోక్ తేజ దర్శకుడు. ఏప్రిల్ 17న ఈ సినిమా విడుదల కానుంది.

# ఎన్టీఆర్,ప్రశాంత్ నీల్ కాంబో

## 22 నుంచి షూటింగ్‌లోకి జూనియర్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ర ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎన్టీఆర్ 31గా ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నది. ఇప్పటికే హైదరాబాద్‌లోని పలు లొకేషన్స్‌లో ప్రశాంత్ నీల్ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అయితే తాజాగా ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను ప్రకటించారు మేకర్స్. ఎన్టీఆర్ ఎప్పుడెప్పుడు ఈ మూవీ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నాడని అభిమానులు ఎదురుచూస్తుండగా.. వారికి గుడ్ న్యూస్ చెబుతూ.. ఈ నెల 22 నుంచి తారక్ ఈ మూవీ షూటింగ్‌లో పాల్గొంటారని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇక ఈ క్రేజీ అప్‌డేట్‌తో ఎన్టీఆర్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందించనున్నారు.



# లెనిన్‌గా వస్తోన్న అక్కినేని అఖిల్

అఖిల్ అక్కినేని హీరోగా, మురళీ కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లెనిన్'. అక్కినేని నాగార్జున, సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నాగవంశీ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు తాజాగా 'లెనిన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అఖిల్ పుట్టిన రోజును పురస్కరించుకుని లెనిన్ టైటిల్ గ్లింప్స్ ను విడుదల చేశారు. ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది కాదు.. అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ సినిమా గ్లింప్స్ చూస్తుంటే లవ్, యాక్షన్, రొమాన్స్, డివోషనల్ అంశాలతో తెరకెక్కించినట్టు- క్లియర్‌గా అర్థమవుతుది. ముఖ్యంగా తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ అదిరిందనే చెప్పాలి. ఇదిలా ఉండగా లెనిన్ టైటిల్ గ్లింప్స్ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. యూట్యూబ్ లో టాప్ లో ట్రెండింగ్ అవుతోంది. ఈ విషయాన్ని మూవీ టీమ్ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. అఖిల్ ను మునుపెన్నడు చూడని లుక్ లో కనిపించడం అటు ఫ్యాన్స్ తో పాటు- సినీ ప్రేక్షకుల నుండి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇక శ్రీలీల ఈ మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. శ్రీ లీల ఈ సినిమాలో డిఫరెంట్‌గా రెండు జడలలో కనిపించింది. వరుస డిజాస్టర్స్ తర్వాత అటు అఖిల్ ఇటు శ్రీ లీల చేస్తున్న ఈ సినిమాతో సాలిడ్ హిట్ ఇస్తారని ఇరువురి ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.,




# వరుస ఫెయిల్యూర్స్‌తో కావ్య థాపర్ సైలెంట్

గత ఏడాది బాగా హడావుడి చేసిన బ్యూటీ కావ్య థాపర్ ఈ ఏడాది సైలెంట్ అయ్యింది. ఫ్లాప్స్ ఆమె కెరీర్ పై గట్టి దెబ్బే వేశాయి. స్టార్ హీరోలతో జోడీ కట్టినప్పటికీ ఇప్పుడు ఛాన్సుల కోసం వెయిట్ చేస్తోంది. ఈ మాయ ప్రేమేమిటోతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన కావ్య బేబీ ఈ ఏడేళ్లలో పది సినిమాలు కూడా చేయలేకపోయింది. కోలీవుడ్, బాలీవుడ్‌లోకి స్టెప్ ఇన్ అయినా పెద్దగా కలిసి వచ్చిందీ ఏమీ లేదు. ఏక్ మిని కథ, పిచ్చైకారన్ చిత్రాల్లో మంచి ఫెర్ఫామెన్స్ చూపించడంతో టాలీవుడ్ స్టార్ హీరోలతో నటించే ఛాన్సులు కొల్లగొట్టింది కావ్య. అప్పటి వరకు ఏడాదికి ఒక్క మూవీ చేసుకుంటూ వచ్చిన భామ లాస్ట్ ఇయర్ నాలుగు సినిమాలతో పలకరించింది. రవితేజ ఈగల్, సందీప్ కిషన్ ఊరు పేరు భైరవకోన, రామ్ డబుల్ ఇస్మార్ట్, గోపీచంద్ విశ్వమ్‌లో గ్లామరస్ రోల్‌లో కనిపించింది కానీ ఊరు పేరు భైరవ కోన మినహా మిగిలివన్నీ డిజాస్టర్లు. ఈ హ్యాట్రిక్ ఫ్లాప్స్ ఆమె కెరీర్‌పై గట్టి దెబ్బేశాయి. పేలవమైన స్క్రిప్ట్స్ కావ్యను ఫేడవుటుకు దగ్గర చేశాయి. విశ్వం తర్వాత కాస్త గ్యాప్ తీసుకునేందుకు వెకేషన్స్‌కు వెళ్లిన కావ్య థాపర్ మళ్లీ కెరియర్ పై ఫోకస్ చేస్తోంది. ఓ సినిమాకు కమి-టైనట్లు- టాక్. ధమాకా దర్శకుడు త్రినాథ రావు నక్కిన అప్ కమింగ్ ప్రాజెక్టులో ఓకే అయినట్లు- టీఎఫ్ఐలో బజ్ నడుస్తోంది. హవీష్ హీరోగా తెరకెక్కుతోన్న ఈసినిమా ఇప్పటికే సెట్స్ పైకి వెళ్లినట్లు- సమాచారం.



## అజిత్ ఇచ్చిన ధైర్యమే ముందుకు నడిపించింది

సీనియర్ నటుడు అజిత్‌ను కలిసిన తర్వాత తన జీవితమే మారిపోయిందన్నారు దర్శకుడు అధిక్ రవిచంద్రన్. ఆయన తెరకెక్కించి న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అజిత్‌పై ప్రశంసలు కురిపించారు. 22 ఏళ్ల దర్శకుడిగా తొలి సినిమాను తెరకెక్కించాను. ఆ తర్వాత ఓ సినిమా (అన్బానవన్ అసరాధవన్) ఫ్లాప్ అయింది. ఆ సమయంలో అజిత్ తప్ప నాకెవ్వరూ ధైర్యం చెప్పలేదు. ఆయన ఇచ్చిన మద్దతు ఎప్పటికీ మర్చిపోలేను. అప్పటినుంచి నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ప్రేక్షకులు ఎలాంటి సినిమాలను ఆదరిస్తారో అర్థమైంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెరకెక్కించే సమయంలో ఆయన గురించి మరింత తెలుసుకునే అవకాశం వచ్చింది. ఆయన చుట్టూ ఉండే వ్యక్తులతో ఎలా వ్యవహరిస్తారో తెలుసుకున్నాను. ఆయన ఒక లెజెండ్. ఎవరినీ బాధపెట్టరు. ఎవరి గురించి చెడుగా మాట్లడరు. ఆయన కోసం ఎన్నో కాస్ట్యూమ్స్ తయారుచేశాం. వాటిని ఎంతో ఓపికగా ధరించారు' అని చెప్పారు. అజిత్‌కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కోసం సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన -ట్రైలర్, పాటలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. అజిత్, త్రిషల మధ్య సంభాషణలు ఆకట్టు-కునేలా ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలోని 'గాడ్ బ్లస్ యూ' అంటూ సాగే రెండో పాటను చిత్రబృందం విడుదల చేసింది.



## కొబ్బరి రైతులకు ప్రభుత్వం శుభవార్త

- 1330 రైతులకు 2.3 కోట్ల రూపాయలు జమ



**అమరావతి,ఏప్రిల్9( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొబ్బరి రైతులకు శుభవార్త చెప్పింది. వారి ఖాతాల్లోకి డబ్బులు జమ చేసినట్లు తెలిపింది. కొబ్బరి రైతుల కోసం ఏర్పాటు చేసిన పథకం కింద వారికి సాయం అందించింది. ప్రస్తుతం ఏపీలోని కోనసీమ ప్రాంతంలో కొబ్బరి తోటల పునరుద్ధరణ పథకం అమలులో ఉంది. ఈ పథకం కేవలం కొబ్బరి రైతుల కోసం మాత్రమే ఏర్పాటు చేయబడింది. నష్టపోయిన కొబ్బరి రైతులకు ప్రభుత్వం ఈ పథకం కింద సాయం అందిస్తుంది. చనిపోయిన కొబ్బరి రేట్లు-, కాయలు కాయని చెట్లకు ప్రభుత్వం డబ్బుల ఇస్తుంది. గతేడాది మే, జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా చనిపోయిన, కాయలు కాయని చెట్లను ఉద్యానవన శాఖ గుర్తించింది. రైతుల పేర్లు నమోదు చేసుకుంది. నష్టపోయిన ఆ రైతులకు ఆర్థిక సాయం కింద కొంత డబ్బు వారి అకౌంట్లలో పడింది. ప్రభుత్వం ఒక్కో చెట్టుకు 1000 రూపాయలు సాయం చేసింది. కోనసీమలో 850 హెక్టార్లలో 23 వేలకు పైగా కొబ్బరి చెట్లకు ప్రభుత్వం డబ్బులు విడుదల చేసింది. 1330 రైతులకు ఏకంగా 2.3 కోట్ల రూపాయలు వారి అకౌంట్లో జమ అయ్యాయి. కోనసీమ రైతులు తప్పని సరిగా కొబ్బరి చెట్ల పునరుద్ధరణ స్కీమును వినియోగించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. హెక్టారుకు 32 చెట్లకు పరిహారం అందిస్తామని అన్నారు. ఇక, ఈ పథకం ప్రతి ఐదేళ్లకు ఒకసారి మాత్రమే అమలు చేస్తారు. ఒకసారి ఈ పథకం కింద లబ్ధి పొందితే.. తర్వాత సంవత్సరం ఈ పథకం వారికి వర్తించదు. సాధారణంగా కొబ్బరి చెట్లు ప్రదేశం అనుకూలతను బట్టి 60 నుంచి 100 సంవత్సరాల వరకు బతుకు తాయి. చెట్ల రకం బట్టి 3 నుంచి 5 సంవత్సరాల్లో కాయలు కాయటం మొదలవుతుంది. ఒక చెట్టు- సంవత్సరానికి 75 కాయల్ని కాస్తుంది. కొన్ని చెట్లు వంద అడుగులు పైనే పెరుగుతాయి.

## సముద్ర అలలకు దెబ్బతిన్న బోటు

**శ్రీకాకుళం,ఏప్రిల్9( వెలుతురు):**
గత మూడు రోజులు నుండి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీణ ప్రభావం వలన సముద్రంలో అలలు తాకిడికి శ్రీకాకుళం జిల్లా లక్కివలస పంచాయతీ గెద్దలపాడు గ్రామానికి చెందిన శ్రీరంగం వీరాస్వామికి చెందిన ఇంజిన్ బోటు- పూర్తిగా ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న మత్స్యక అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. అల్పపీడనం ప్రభావం వలన బోటు-ను లంగరు వేశారు. అలలు తాకిడి ఎక్కువ అయి బోటు- పూర్తిగా ధ్వంసం అయ్యిందని మత్స్యకారులు తెలిపారు.

## వృద్ధిరేటులో అట్టడుగున తెలంగాణ

- కాంగ్రెస్ నిర్వాకంపై మండిపడ్డ కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్9( వెలుతురు):**
జీఎస్డీపీ, తలసరి వృద్ధి రేటులో తెలంగాణ అట్టడుగున నిలవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వేసిన ఆర్థిక పునాదులను కాంగ్రెస్ సర్కార్ ధ్వంసం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. జీఎస్టీ వృద్ధిరేటు గుండు సున్నాగా నమోదు కావడంతో ఆయన ధ్వజమెత్తారు. సన్నాసి ఢిల్లీ పార్టీలను నమ్మితే.. తెలంగాణ బతుకు సున్నా అని మరోసారి రుజువుచేసిన సందర్భమిది అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలివి లేని దద్దమ్మను గద్దెనెక్కిస్తారు.. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తారు.. కోట్లాది మంది జీవితాలతో చెలగాటమాడతారు అని కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. ఆర్థిక వృద్ధిలో అగ్రభాగాన ఉన్న రాష్ట్రాన్ని పాతాళానికి పడేసిన ఈ పాపం క్షమించరానిది. టూరిస్టు పార్టీలను నమ్మితే జరిగే విధ్వంసమిది.. విజన్ లేనోళ్ల చేతిలో రాష్ట్రాన్ని పెడితే జరిగే వినాశనమిది. నాటి పదేళ్ల దార్శనిక పాలనకు.. నేటి దగుల్బాజీ విధానాలకు మధ్య తేడాను నాలుగు కోట్ల సమాజం నిశితంగా గమనిస్తోంది. ఇక జీవితంలో ఈ ఢిల్లీ పార్టీలను తెలంగాణ నమ్మదు.. మళ్లీ ఎప్పటికీ మోసపోదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలి

- డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ధర్నా

**విశాఖపట్టణం,ఏప్రిల్9( వెలుతురు):**
విశాఖపట్నం పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం యునైటెడ్ ఫోర్త్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పోర్టు చైర్మన్ ఆఫీస్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు ప్రైవేటీకరణ ఆపాలని, రీటెండర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోర్టు యాజమాన్యం సొంత నిధులతోనే హాస్పటల్ ను అభివృద్ధి చేయాలన్నారు. మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. అవసరమైన నిపుణులైన డాక్టర్లు సిబ్బందిని ఏర్పాటు చేయాలని, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. పోర్టు స్టేడియంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ లో బాలుడు చనిపోయిన సంఘటన, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడమేనని ఆరోపించారు. కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదన్నారు. ప్రభుత్వ ఆస్తులపై అజమాయిషీ ని ప్రైవేట్ వారికి అప్పగిస్తే, ఇదేవిధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని ఆయన గుర్తు చేశారు.కనుక పోర్ట్ ఆస్తులను ప్రైవేటు- వారికి ఇవ్వరాదన్నారు. రీటెండర్ ప్రక్రియ వెనక్కి తీసుకోని ఎడల ఈనెల 21న మరోసారి పోర్ట్ ఎటిబి వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ, కార్యదర్శి బి.జగన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. రామలింగేశ్వరరావు, విడి ఎల్ బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జె.సత్యనారాయణ బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం లక్ష్యంగా కెసిఆర్ పాలన

- కాళేశ్వరం వృధా ప్రాజెక్ట్ అంటూ దుష్ప్రచారం
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో నష్టపోతున్న రైతులు
- మాజీమంత్రి వేముల ప్రశాంత రెడ్డి విమర్శలు



**నిజామాబాద్,ఏప్రిల్9( వెలుతురు):**
రైతు సంక్షేమం కోసం కేసీఆర్ అధికారంలో ఉండగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసారని నిజామాబాద్ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు అమలు చేసిన ఘతన కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా కాంగ్రెస్ ముందుకు సాగడంతో దౌర్భాగ్యం నెలకొందని అన్నారు. బుధవారం నాడిక్కడ మాట్లాడుతూ..రైతులను ఆదుకునేందుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడం లేదని అన్నారు. ధాన్యం పండించిన రైతులను ఆదుకోని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణలో చేపట్టిన రైతు సంక్షేమకార్యక్రమాల వల్ల ధాన్యం దిగుబడులు పెరిగాయన్నారు. కానీ ఇప్పుడు పంటలు ఎండుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరంను వృథా ప్రాజెక్టుగా చూపి పబ్బం గడుపుకోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గొల్ల కుర్మల అభివృద్ధికి సీఎం కేసీఆర్ గొర్రెలు పంపిణీ చేశారన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులను ఆదుకున్నామని అన్నారు. ఇలా కులవృత్తులను ఆదుకున్న ఘనత బిఆర్ఎస్‌దని అన్నారు.అన్ని వర్గల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికలు చేసి అమలు చేశారని వివరించారు. గోదావరి నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్ లో నింపి అక్కడి నుంచి వివిధ ప్రాంతాల రైతులకు సాగునీరు అందించారని అన్నారు. ఇలా చేయడం వల్లనే ధాన్యం దిగుబులు పెరిగాయన్నారు. బిఆర్ఎస్ ఆందోళనలతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. ఇప్పటికే తమ ఆందోళనతలో రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలో ప్రాజెక్టులను నిర్మించడంతో ధాన్యం దిగుబడులు పెరిగాయని అన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతీ వరి గింజను తక్షణం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరికి ప్రజలు,రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి వెన్నెముక లాంటి రైతులకు కష్టాలు తప్పటం లేదు. ఏ పంట వేసినా పెద్దగా రాబడి ఉండటం లేదు. నష్టాలు తప్ప లాభాలు రావటం లేదు. ఏదో ఒక కారణంతో అన్నదాతలకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకోవడానికి ముందుకు వచ్చి పలు పథకాలు అమలు చేసిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. వారికి ఆర్థిక భరోసా కల్పించానని అన్నారు. రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ చేసామన్నారు. పంట నష్టం వచ్చినపుడు కూడా ముందుండి మరీ సాయం చేసిన ఘనత కెసిఆర్‌దే అని వేముల అన్నారు.

# గృహవినియోగదారులకు శుభవార్త

- మరింత తగ్గనున్న ఇఎంఐ భారం
- ఆర్‌బిఐ నిర్ణయంపై రియల్టర్ల ఆనందం




**హైదరాబాద్,ఏప్రిల్9( వెలుతురు):**
రెపోరేటు తగ్గడంతో గృహరుణ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోమారు శుభవార్త చెప్పింది. దీంతో వడ్డీలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. స్తబ్దుగా ఉన్న రియల్ రంగానికి ఇది బూమ్ ఇస్తుందని రియల్ ఎస్టే వర్గాలు చెబుతున్నాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో వడ్డీ రేట్లు- తగ్గి గృహ విక్రయాలు పుంజుకుంటాయని రియల్ ఎస్టేట్ సమాఖ్యలు క్రెడాయ్, నరెడ్కో ఆశాభావం వ్యక్తంచేశాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంపై హర్షాతిరేకం వ్యక్తంచేశాయి. వృద్ధికి ఊతమిచ్చేందుకు తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి కూడా దన్నుగా నిలుస్తుందని పేర్కొంటున్నాయి. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని బ్యాంకులు ఎంత వేగం అమలుచేసి.. వినియోగదారులకు ప్రయోజనాన్ని బదిలీ చేయడంపై ఈ ఊరట ఆధారపడి ఉంటుంది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు-పై తీసుకున్న రుణాలను బ్యాంకులు వెంటనే సవరించాల్సి ఉంటు-ంది. మూడు నెలలకోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆర్‌బీఐ నిబంధనలు చెబుతున్నాయి. ఒకవేళ ఫిబ్రవరి నెల ప్రయోజనాన్ని ఇప్పటికీ బ్యాంకులు తగ్గించకపోతే మే నెల నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఆర్‌బిఐ వరుసగా రెండోసారి కూడా రెపో రేట్‌ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఇలా వడ్డీ రేట్లను తగ్గించడం ఈ ఏడాది ఇది రెండోసారి. ఫిబ్రవరి 7న కూడా 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అంతేకాదు భవిష్యత్‌లో మరిన్ని కోతలు ఉండే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఎన్నాళ్లగానో ఈఎంఐ భారం మోస్తున్న గృహరుణ వినియోగదారులకు మరోమారు ఊరట కలిగిందనే చెప్పాలి. ఎవరైతే ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకొని ఉంటారో వారికి ఈఎంఐ తగ్గనుంది. ముఖ్యంగా 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటుతో జారీ అయినవే. కాబట్టి ఆ మేర బ్యాంకులు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునేవారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తం రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెండు దఫాల్లో ఇప్పటివరకు 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఆ మేర ఈఎంఐ తగ్గుతుంది.

# జగన్ రాప్తాడు పర్యటన అంతా డ్రామా

- పోలీసులును బట్టలూడదీసి కొడతానంటారా
- ఇదేనా ఓ మాజీ సిఎం మాట్లాడే భాష
- వచ్చిన హెలికాప్టర్ ఎలా వెళ్లగలిగింది
- జగన్ తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు
- మండిపడ్డ హోంమంత్రి వంగలపూడి అనిత



**విశాఖపట్టణం,ఏప్రిల్9( వెలుతురు):**
వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. రాప్తాడు పర్యటన మరోసారి అధికార, ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధానికి తెరలేపింది.. అయితే మంగళవారం జగన్ టూర్ డ్రామాను తలపించింది.. ఏదో రకంగా శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని అంటూ ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు.. విశాఖలో మీడియాతో మాట్లాడిన ఆమె.. వైసీపీ హయాంలో ఐపీసీ సెక్షన్ ప్రకారం కాకుండా వైసీపీ సెక్షన్ ప్రకారం పోలీసులు వ్యవహరించారని విమర్శించారు.. ఇక, జగన్ పర్యటన కోసం 1100 మంది పోలీసులను పెట్టాం.. జగన్ వెళ్లే ప్రాంతం చాలా సెన్సిటివ్ ఏరియా.. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నాం.. కానీ, వాట్సాప్ లో రెచ్చగొట్టే మెసేజ్ పెట్టారు.. కావాలని ఓ సీన్ క్రియేట్ చేయాలని చూశారని మండిపడ్డారు. హెలిపాడ్ దగ్గరకు తోసుకుంటూ, నెట్టుకుంటూ వచ్చారు.. కొంతమంది పోలీసులకు గాయాలయ్యాయి.. ఇంతచేసి పోలీసులను తప్పు పడుతున్నారని అని జగన్‌పై హోంమంత్రి అనిత ఫైర్ అయ్యారు. 12.42 కిలో మీటర్ల రోడ్డు మార్గం కన్ఫర్మ్ అయ్యింది.. కొద్ది నిమిషాల్లో చాపర్ బయలుదేరిపోయింది.. ఇదంతా ముందస్తు ప్రణాళిక మేరకే సగింది. ఇలా కూడా ఆలోచన చేస్తారా? అనిపించిందని వ్యాఖ్యానించారు. జగన్ మాట్లాడుతుంటే వైసీపీ 5 ఏళ్ల జగన్ అరాచక పాలన గుర్తుకొచ్చింది.. చంద్రబాబు ప్రతిపక్ష నేతగా వున్నప్పుడు విశాఖ ఎయిర్ పోర్ట్ ఘటన జనాలు మర్చిపోలేదు.. ముసుగులేసుకుని కస్టోడియల్ టార్చర్ ప్రజలు మర్చిపోతారనుకుంటున్నారా? ఇలాంటి సంస్కృతి మాది కాదు.. ఇప్పటి సీఎం, డిప్యూటీ- సీఎం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, హోంమంత్రిపై అనేక కేసులు ఉన్నాయి.. ఖాకీ చొక్క ఊడదీస్తానని మాజీ సీఎం అనొచ్చా.. అని ప్రశ్నించారు.. వైసీపీ హయాంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు 2800 పై చిలుకు హత్యలు జరిగాయి.. ఇలా ప్రవర్తిస్తేనే 151 నుంచి 11 కి దిగిపోయావు.. నువ్వు మారకపోతే అవి కూడా రావని అనిత ఎద్దేవా చేశారు.. వైసీపీ వాళ్ల తీరు మారకపోతే చట్టం తనిపని తను చేసుకుపోతుందన్నారు. ఇక, జగన్ ని వదిలి చాపర్ వెళ్లిపోవడంపైనా సమగ్ర దర్యాప్తు చేస్తాం అన్నారు.. పెందుర్తి ట్రాఫిక్ అంశంపైనా పోలీసులు తప్పులేదు.. అవన్నీ అవాస్తవాలు అని హోం మంత్రి వంగలపూడి అనిత కొట్టిపారేశారు.. మొత్తానికి జగన్ మోహన్ రెడ్డి డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. రాప్తాడు నియోజకవర్గానికి వెళ్తున్న జగన్మోహన్ రెడ్డికి 1100 మంది పోలీసులతో రక్షణ ఇచ్చామన్నారు. 250 మంది పోలీసులు హెలిపాడ్ వద్ద ఉన్నారని తెలిపారు. వీఐపీని తీసుకువెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ 15 నిమిషాల్లో ఎలా ఎగిరి వెళ్లిందని ప్రశ్నించారు. ప్లాన్ ప్రకారం ఇదంతా చేశారని అనిపిస్తోందని... వీటన్నింటి పైన విచారణ కొనసాగుతుందని తెలిపారు. మాట్లాడితే లా అండ్ ఆర్డర్ లేదు లా అండ్ ఆర్డర్ లేదు అంటున్నారని.. గతంలో చంద్రబాబు బయటికి రాకుండా అడ్డుకున్నారని.. ఎయిర్‌పోర్టుల్లో గుండాలను పెట్టి, అడ్డుకున్నారని గుర్తుచేశారు.

పార్టీ కార్యాలయాల మీద దాడులు చేయించారని.. ఇలాంటివన్నీ చేసింది జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కస్టోడియల్ టార్చర్ అనేది జగన్మోహన్ రెడ్డి సంస్కృతి అని.. తమది కాదని స్పష్టం చేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించి నందుకు తమ మీద అనేక మంది మీద కేసులుపెట్టారన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ ఇవ్వాలని.. కానీ ఒక మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇస్తున్నామని చెప్పారు. ఇవ్వాల్సిన భద్రత కన్నా ఎక్కువ భద్రత ఇస్తున్నామని వెల్లడించారు. పోలీసుల బట్టలు ఊడదీస్తామంటూ మాట్లాడే పద్ధతి సరియైనదేనా అని ప్రశ్నించారు. ఎవరైనా పోలీస్ డిపార్ట్‌మెంట్ మీద శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడినా, పోస్టులు పెట్టినా తగిన విధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భద్రతా వైఫల్యం ఆరోపణలపై హోం మంత్రిగా తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ స్వయంగా మీటింగ్ పెట్టి.. పార్టీ నిర్ణయాన్ని, ప్రభుత్వం నిర్ణయాన్ని గౌరవించాలని.. ఎవరు బయటకు రావద్దని పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా హోంమంత్రి అనిత వెల్లడించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com